https://teluguislam.net



## రెండవ దశ

# క్రొత్త మార్పు

హుదైబియా ఒప్పందం, యదార్థంగా ముస్లిముల జీవితంలో వచ్చిన ఓ క్రొత్త మార్పే అనాలి. ఖురైష్ జాతి, ఇస్లామ్ పట్ల వైరంలోను, శత్రుత్వంలోను తీవ్రమైన మొండి వైఖరిగల జగడాలమారి జాతి. అందుకని వారు యుద్ధంలో అపజయంపాలై శాంతి వైపునకు మొగ్గుజూపినప్పుడు, అహ్జాబ్ యుద్ధంలో కలసి పోరాడిన మూడు పక్షాల్లో- ఖురైష్, గత్ఫాన్ మరియు యూదులు- పటిష్టమైన ఒక పక్షం ఛిన్నాభిన్నమైపోయింది. ఖురైష్‌లే పూర్తి అరేబియా ద్వీపకల్పంలో విగ్రహారాధనకు ప్రాతినిధ్యం వహించేవారుగా, దానికి నాయకులుగా ఉన్నందువలన, వారు యుద్ధమైదానం నుండి వైదొలగిపోగానే విగ్రహారాధకుల భావోద్రేకాలు కాస్తా చల్లబడిపోయాయి. వారి శత్రుత్వ వైఖరిలో చాలా మటుకు మార్పు వచ్చేసింది. అందుకని ఈ ఒప్పందం జరిగిన తరువాత గత్ఫాన్ వారి వైపు నుండి ఎలాంటి గొడవలు జరిగినట్లు మనకు అగుపడదు. వారేదైనా చేయగలిగారంటే అది కూడా యూదులు రెచ్చగొట్టడం మూలంగానే.

ఇక యూదుల విషయానికి సంబంధించినంత మటుకు, వారు యస్రిబ్ (మదీనా) నుండి బహిష్కరింపబడిన తరువాత 'ఖైబర్' చేరి దాన్ని తమ కుట్రలకు, కుతంత్రాలకు కేంద్రంగా మలుచుకున్నారు. అక్కడ యూదులకు చెందిన కుట్రదారులు తమ ప్రయత్నాలలో నిమగ్నమైపోయి సంక్షోభాన్ని రేకెత్తించే ప్రయత్నంలో మునిగిపోయారు. తమ చుట్టుపట్ల నివసిస్తున్న బద్దూలను ఉసిగొలుపుతూ దైవప్రవక్త (స) మరియు ముస్లిములను హతమార్చేందుకు లేదా కనీసం వారికి భారీ నష్టాన్నయినా కలిగించే ప్రయత్నం చేస్తూ ఉండేవారు. కాబట్టి హుదైబియా ఒప్పందం తరువాత దైవప్రవక్త (స) మొట్టమొదటగా యూదుల ఆటపట్టువైన ఖైబర్‌ను

https://teluguislam.net



జయించి వారి ఆగడాలను మట్టుబెట్టేందుకు నిర్ణయాత్మకమైన సైనిక చర్య చేబట్టారు.

ఎలాగైతేనేమి, హుదైబియా ఒప్పందం తరువాత ప్రారంభమైన శాంతి ఘట్టం ద్వారా ముస్లిములకు ఇస్లామీయ సందేశ ప్రచారాన్ని వ్యాపింపజేసే ముఖ్యమైన అవకాశం లభించినట్లయింది. ఇస్లామీయ ప్రచార కార్యక్రమాల కోసం, ఈ రంగంలో వారి కృషి, సైనిక చర్యలకంటే ముఖ్యమైపోయింది. కాబట్టి ఆ కాలంలో జరిగిన కార్యక్రమాలను రెండు విధాలుగా విభజించి చూడడం సబబుగా తోస్తుంది.

1. సందేశ ప్రచారం మరియు రాజులకు, సర్దారులకు లేఖలు పంపించడం.

2. యుద్ధ కదలికలు.

ఈ దశలో, యుద్ధ కదలికలను గురించి చెప్పే బదులు, రాజులు సర్దారుల పేర పంపబడిన లేఖల గురించిన వివరాలు చెప్పడం ముఖ్యమని భావిస్తున్నాము. ఎందుకంటే, సహజంగా ఇస్లామీయ సందేశ ప్రచార ధ్యేయమే అసలు ఇస్లామ్ యొక్క ధ్యేయం. ఈ లక్ష్యాన్ని సాధించడానికే ముస్లిములు రకరకాల కష్టాలను, యుద్ధాలను, సంక్షోభాలను భరిస్తూ వస్తున్నారు.

## రాజులకు, సర్దారులకు పంపించిన లేఖలు

హిజ్రీ శకం 6 చివరన దైవప్రవక్త (స) హుదైబియా నుండి మదీనాకు తిరిగివచ్చాక, వివిధ రాజుల పేరున లేఖలు రాసి వారిని ఇస్లామ్ సందేశం వైపునకు ఆహ్వానించారు.

మహాప్రవక్త (స) వారికి ఆ లేఖలను రాయడానికి ఉపక్రమించినప్పుడు, ఏ రాజైనా, ఏ చక్రవర్తి అయినా ఆ లేఖను స్వీకరించాలంటే దానిపై ముద్ర తప్పక ఉండాలి అనే సలహా ఇవ్వడం జరిగింది. కాబట్టి ఆయన ఓ వెండి ముద్రను తయారు చేయించారు. ఆ ముద్రపై 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అనే అక్షరాలు చెక్కబడి ఉన్నాయి.[1]

అలా లేఖలు రాయించి అనుభవజ్ఞులైన సహాబాలకిచ్చి దూతలుగా

1. సహీహ్ బుఖారి-2/872,873.

https://teluguislam.net



వారి వద్దకు పంపారు. ఈ దూతల్ని, ఖైబర్ యుద్ధానికి బయలుదేరడానికి కొన్ని రోజుల ముందు, ఒకటవ ముహర్రమ్ హి.శ. 7న పంపారని 'అల్లామా మన్సూర్ పూరి' పూర్తి ఆధారాలతో చెబుతారు.[2] వచ్చే పంక్తుల్లో ఆ లేఖలు, ఆ లేఖల వలన కలిగిన ప్రతిస్పందనలను గురించి తెలుసుకుందాం.

## 1. అబీసీనియా చక్రవర్తి 'నజాషీ' పేరున పంపిన లేఖ

ఈ నజాషీ పేరు అస్‌హమా బిన్ అబ్‌హర్. దైవప్రవక్త (స) అతని పేర రాసిన లేఖను, అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ చేతికిచ్చి హి.శ. 6 చివరన లేదా హి.శ. 7 ప్రారంభంలో పంపించారు. 'తిబ్రీ' ఈ లేఖలోని పూర్తి పాఠాన్ని కూడా ఉటంకించాడు. అయితే ఈ లేఖలో రాయబడిన విషయాన్ని లోతుగా అధ్యయనం చేస్తే, దీన్ని దైవప్రవక్త (స) హుదైబియా ఒప్పందం తరువాత రాసిన లేఖలా అగుపించదు. బహుశా ఈ లేఖలో రాసిన విషయాలు దైవప్రవక్త (స) మక్కాలో ఉన్నప్పుడే, హజ్రత్ జాఫర్ అబీసీనియాకు హిజ్రత్ చేసి వెళ్ళేటప్పుడు రాసి ఇచ్చిన లేఖ అనిపిస్తూ ఉంది. ఎందుకంటే ఈ లేఖ చివరన ముహాజిర్ల ప్రస్తావన ఈ క్రింది మాటల్లో ఉంది.

"నేను మీ వద్దకు నా పినతండ్రి కుమారుడైన జాఫర్ వెంట ఓ బృందాన్ని పంపించాను. వీరు మీ వద్దకు వచ్చినప్పుడు వీరికి మీ దేశంలో శరణు ఇవ్వండి. వారిపై ఎలాంటి వత్తిడి చేయకండి."

బైహఖీ, హజ్రత్ అబ్బాస్ (ర) ఉల్లేఖించిన ఉల్లేఖనం ద్వారా మరో ఉత్తరం పూర్తి పాఠం ఇలా ఉందని రాస్తున్నారు. దాని అనువాదం ఇలా ఉంది:

"ఈ లేఖ ముహమ్మద్ దైవప్రవక్త (స) తరఫున నజాషీ అస్‌హం, అబీసీనియా చక్రవర్తికి రాయబడుతూ ఉంది.

సన్మార్గాన్ని అనుసరిస్తూ, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించిన వారికి సలామ్ (శుభాలు). ఏ ఒక్కడూ సాటిగా రాని ఆ అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు అని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఆయనకు భార్యగాని, కుమారుడుగాని లేరు. అలాగే ముహమ్మద్ ఆయన దాసుడు మరియు ప్రవక్త అని కూడా నేను సాక్ష్యం ఇస్తున్నాను. నేను మిమ్మల్ని ఇస్లామ్ వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఎందుకంటే నేను అల్లాహ్

2. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/171

https://teluguislam.net



ప్రవక్తను గనుక. కాబట్టి మీరు ఇస్లామ్ స్వీకరిస్తే శాంతిని పొందగలరు. "ఓ గ్రంథవహులారా! మాకూ, మీకూ నడుమ సమానంగా ఉన్న ఆ విషయం వైపునకు రండి. అదేమిటంటే, అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించము అని, ఆయనకు ఇంకెవ్వరినీ సాటి కల్పించము అని మరియు మనలో ఏ ఒక్కరూ మరి ఒకరిని అల్లాహ్ తప్ప ప్రభువుగా చేసుకోము అనేది. ఒకవేళ వారు దాన్ని తిరస్కరిస్తే చెప్పేయండి, మేము ముస్లిములము, మీరే దానికి సాక్షి అని" మీరు ఈ సందేశాన్ని స్వీకరించకపోతే మీ జాతి నసారా (క్రైస్తవుల) పాపం అంతా మీదే అవుతుంది."

డాక్టరు హమీదుల్లాహ్ (ప్యారిస్), ఇంకో లేఖలో ఉన్న వస్తువును తన గ్రంథంలో ఉటంకించారు. ఇది ఇటీవలే లభ్యమైన లేఖ. ఒకే ఒక పదం తేడాతో ఆ లేఖే అల్లామా ఇబ్నె ఖైమ్ గ్రంథం జాదుల్ ముఆద్‌లోను నిక్షిప్తమై ఉంది. డాక్టరు హమీదుల్లాహ్, ఈ లేఖలో రాసివున్న వస్తువు గురించి పరిశోధించడంలో ఆధునిక విధానాలను అనుసరించారు. ఈ లేఖ ఫోటోను తన గ్రంథంలో అచ్చువేయించారు కూడా. ఆ లేఖ అనువాదం ఇది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్, అబీసీనియా చక్రవర్తి నజాషీకి వ్రాయునది.

సన్మార్గాన్ని అనుసరించే వ్యక్తికి సలామ్ (శాంతి కలుగుగాక). అల్లాహ్ తప్ప మరే పూజ్యుడు లేడనీ, ఆయన ఖుద్దూస్ (పవిత్రుడు) మరియు సలామ్ (దైవ సుగుణాల్లో ఓ సుగుణం, శాంతి) అనీ, శాంతి ప్రదాత, సంరక్షకుడు అనీ మీకు నేను తెలియపరుస్తున్నాను. ఈసా ఇబ్నె మర్యమ్ (మరియమ్ కుమారుడు ఈసా), అల్లాహ్ తన ఆత్మను మరియమ్‌లోకి ఊదడం వల్ల ఆమె గర్భవతి అయిందని నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఇది అల్లాహ్ ఆదమ్ (అ)ను సృష్టించిన తీరు లాంటిదే. నేను, ఆయనకు ఎవరూ సాటిలేరని ఆ అల్లాహ్ వైపునకు, ఆయన విధేయతకు పరస్పరం సహకారాన్ని అందించే వైపునకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. దీనికితోడు, మీరు నన్ను అనుసరించాలని, నా వైపునకు ఏదైతే వచ్చిందో దాన్ని విశ్వసించమని పిలుపునిస్తున్నాను. ఎందుకంటే, నేను అల్లాహ్ ప్రవక్తను. నేను మిమ్మల్ని మీ సైన్యాన్ని అల్లాహ్

https://teluguislam.net



వైపునకు పిలుస్తున్నాను. నేను నా సందేశాన్ని మీకు వినిపించేశాను. కాబట్టి నా హితబోధను స్వీకరించండి.[3] ధర్మమార్గాన్ని అనుసరించే వారికి శాంతి కలుగుగాక.[4]

ఏదైతేనేమి, అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర), దైవప్రవక్త (స) పంపించిన ఈ లేఖను నజాషీకి అందించగా అతను దాన్ని తీసుకొని కళ్ళకు అద్దుకున్నాడు. అదే పరిస్థితిలో సింహాసనం నుండి క్రిందికి దిగి వచ్చి హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించాడు. దైవప్రవక్త (స) గారి సన్నిధికి ఈ విషయం గురించి ఏ జవాబు అయితే రాసి పంపాడో దాని అనువాదాన్ని ఇక్కడ రాయడం జరిగింది.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

దైవప్రవక్త ముహమ్మద్ (స)గారి సన్నిధికి అస్హమా వ్రాయునది.

ఓ దైవప్రవక్తా! ఆరాధనకు అర్హుడైన ఆ అల్లాహ్ తరపున తమకు సలాములు, కారుణ్యం మరియు శుభాలు కలుగుగాక. ఆ తరువాత.

ఓ అల్లాహ్ ప్రవక్తా! నాకు మీరు పంపిన లేఖ అందింది. ఈ లేఖలో హజ్రత్ ఈసా (అ.స.)గారి ప్రస్తావన ఉంది. భూమ్యాకాశాల ప్రభువు సాక్ష్యంగా, తమరు (తమ లేఖలో) ప్రస్తావించినట్లుగానే హజ్రత్ ఈసా (అ.స.) ఓ గడ్డిపోచకంటే ఎక్కువ ఏమీ కాదు. తమరు వర్ణించిన మనిషే ఆయన.[5]

తమరు మా వద్దకు పంపించిన సందేశాన్ని తెలుసుకున్నాము. మీ పినతండ్రి కుమారునికి మరియు మీ అనుచరులకు ఆతిథ్యం ఇచ్చాము. తమరు అల్లాహ్ యొక్క నిజమైన ప్రవక్త అని నేను సాక్ష్యం ఇస్తున్నాను. నేను మీతో బైత్ చేశాను. మీ పినతండ్రి కుమారుని చేతి మీదుగానూ బైత్ చేశాను. ఆయన చేతి మీదుగానే అల్లాహ్ రబ్బుల్ ఆలమీన్ కోసం ఇస్లామ్ స్వీకరించాను."[6]

---

3. *చూడండి, 'దైవప్రవక్త రాజకీయ జీవితం' రచన: డాక్టర్ హమీదుల్లాహ్ సాహెబ్- 108, 109, 122-125.*
4. *జాదుల్ ముఆద్‌లో చివరి పదం వస్సలాము అలా మనిత్తబ ఉల్ హుదా (ధర్మ మార్గాన్ని అనుసరించే వారికి శాంతి కలుగుగాక)కు బదులు అస్లిమ్ అన్త (నీవు ముస్లిం అయిపో) అని ఉంది. చూడండి, జాదుల్ ముఆద్-3/60*
5. *డాక్టర్ హమీదుల్లాహ్ గ్రంథం -పుట. 108-114, 121-131*
6. *జాదుల్ ముఆద్-2/61*

https://teluguislam.net



ప్రవక్త మహనీయులు (స), హ(జత్ జాఫర్ (ర) మరియు అబీ సీనియాకు వెళ్ళిన ఇతర ముహాజిర్లను వెనక్కు పంపించమని కూడా కోరి ఉన్నారు నజాషీని. అందుకని అతను హ(జత్ జాఫర్, హ(జత్ అబూ మూసా అష్అరీ (ర)లను ఇంకా ఇతర సహాబా (ర)లను హ(జత్ అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీ (ర) వెంట వెళ్ళడానికి రెండు పడవలను కూడా సమ కూర్చాడు. వీరు నేరుగా ఖైబర్‌కు చేరి దైవప్రవక్త (స)ను దర్శించుకున్నారు. మరో పడవలో వీరి కుటుంబ సభ్యులు నేరుగా మదీనాకు చేరుకున్నారు.[7]

పైన పేర్కొన్న నజాషీ, తబూక్ యుద్ధానంతరం రజబ్ నెల హిజ్రీ శకం 9లో మరణించగా, దైవప్రవక్త (స) అతని మరణం రోజున్నే సహాబా (ర)కు అతని మరణ వార్తను తెలియజేశారు. ఆ తరువాత అతని "గాయిబానా నమాజె జనాజా" చేశారు. అంటే అతని మృతదేహం ఎదురుగా లేకుండానే జనాజా నమాజు చేశారన్నమాట. అతని మరణానంతరం మరో రాజు సింహాస నాన్నధిష్టించగా దైవప్రవక్త (స) అతనికి కూడా ఓ లేఖ రాసి పంపించారు. అయితే అతను ఇస్లామ్ స్వీకరించింది లేనిది తెలిపే ఆధారాలు లభించలేదు.[8]

## 2. ఈజిప్టు చక్రవర్తి ముఖౌఖిస్‌కు పంపిన లేఖ

ప్రవక్తశ్రీ (స) ఓ లేఖను జరీహ బిన్ మత్తె[9] పేరున పంపించడం జరిగింది. అతని బిరుదు 'ముఖౌఖిస్'. ఇతను ఈజిప్టుకు, అలెగ్జాండ్రియాకు రాజు. ఆ లేఖ ఇలా ఉంది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అయిన ముహమ్మద్, ఖిబ్త్ చక్రవర్తి అయిన ముఖౌఖిస్‌కు వ్రాయునది.

సన్మార్గాన్ని అవలంబించేవానికి శుభం కలుగుగాక.

నేను మిమ్మల్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఇస్లామ్

---

7. *ఇబ్నె హష్షామ్-2/359 వగైరా*
8. *హ(జత్ అనస్ (ర)గారు ఉల్లేఖించిన ఓ ఉల్లేఖనం సహీ ముస్లిమ్ గ్రంథంలో ఉంది. దాని ద్వారా కొంత వరకు గ్రహించగలం.*
9. *ఈ పేరును అల్లామా మన్సూర్ పూరి గారు రహమతుల్ లిల్ ఆలమీన్ 1/78లో ప్రస్తావించారు. డాక్టర్ హమీదుల్లా గారు అతని పేరును బిన్ యామీన్ అని వ్రాశారు. చూడండి దైవప్రవక్త (స) గారి రాజకీయ జీవితం (రసూలె అక్రమ్ కి సియాసి జిందగి) పేజి 141*

https://teluguislam.net



స్వీకరిస్తే మీరు క్షేమంగా ఉండగలరు. ముస్లిములైపోతే అల్లాహ్ మీకు రెట్టింపు ప్రతిఫలం ఇస్తాడు. కాని దీన్ని తిరస్కరిస్తే ఖిబ్త్ వారి పాపం కూడా మీదే. ఓ ఖిబ్త్ ప్రజలారా! మాకూ, మీకూ మధ్య సమానంగా ఉన్న ఆ విషయం వైపునకు రండి. అదేమిటంటే అల్లాహ్ తప్ప మనం మరెవ్వరినీ ఆరాధించము అనేది, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించము అనేది మరియు మనలో ఏ ఒక్కడూ మరొకరిని అల్లాహ్ తప్ప ప్రభువుగా చేసుకోము అనేదే. ఒకవేళ వారు దాన్ని తిరస్కరిస్తే చెప్పేయండి, మేము ముస్లిములము, మీరే దానికి సాక్షి అని."[10]

ఈ లేఖను అందించడానికి ఆయన (స) హజ్రత్ హాతిబ్ బిన్ అబీ బల్తఅ (ర)ను ఎంపిక చేశారు. ఆయన ముఖౌఖిస్ దర్బారుకు చేరి ఇలా అన్నారు:

"(ఈ భూమ్మీద) మీకంటే పూర్వం ఓ వ్యక్తి గతించాడు. అతను తనను తాను మహా దేవుడని పిలుచుకున్నాడు. అల్లాహ్ అతణ్ణి చివరి వారికి, మొదటి వారికి గుణపాఠంగా చేశాడు. మొదట అతను తన ఈ అధికారం ఉపయోగించి ప్రజల పగ తీర్చుకున్నాడు. ఆ తరువాత తానే ఆ పగకు బలైపోయాడు. కాబట్టి, ఇతరులు మిమ్మల్ని చూసి బుద్ధి తెచ్చుకోక మునుపే ఇతరులను చూసి మీరు బుద్ధి తెచ్చుకోండి."

ఇది విన్న ముఖౌఖిస్, "మాకూ ఒక ధర్మమంటూ ఉంది. అంతకంటే మేలైన ధర్మం మాకు లభించనంతమట్టుకు దాన్ని త్యజించేవారము కాము" అని అనగా హజ్రత్ హాతిబ్,

"మేము మిమ్మల్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానిస్తున్నాము. దీన్ని అల్లాహ్ తక్కిన (ధర్మాల) వాటి కంటే ఉత్తమమైనదిగా చేశాడు. చూడండి! ఆ ప్రవక్త ప్రజలను ఇస్లామ్ వైపునకు ఆహ్వానించినప్పుడు ఖురైషులు అందరి

10. జాదుల్ ముఆద్ అల్ ఇబ్నె ఖైమ్-3/61. ఇటీవలి కాలంలోనే ఈ లేఖ లభించింది. డాక్టరు హమీదుల్లా ఏ ఫోటో అయితే తన గ్రంథంలో ప్రచురించారో దానికి మరియు జాదుల్ ముఆద్ లేఖలో కేవలం రెండే రెండు అక్షరాల తేడా ఉంది. జాదుల్ ముఆద్‌లో 'అస్లిమ్ తస్లిమ్. అస్లిమ్ యూతికల్లాహ్- చివరి వరకు'. లేఖలో ఫస్లిమ్ తస్లిమ్ యూతికల్లాహ్ అని ఉంది. అలాగే జాదుల్ ముఆద్ గ్రంథంలోని లేఖలో అసిమ్ అహ్లల్ ఖిబ్త్ అని ఈ లేఖలో అసిముల్ ఖిబ్త్ అని ఉంది. చూడండి, 'ప్రవక్త రాజకీయ జీవితం' పుట-136, 137.

https://teluguislam.net



కంటే కఠినులై దాన్ని వ్యతిరేకించారు. యూదులు అందరికంటే ఎక్కువగా శత్రుత్వాన్ని వహించారు. కాని 'నసారా' (క్రైస్తవులే) దీనికి దగ్గరగా ఉన్నారు. నా ఈ వయస్సు సాక్షిగా! హజ్రత్ మూసా(అ.స.), హజ్రత్ ఈసా (అ.స.) ఆగమన శుభవార్త ఇచ్చినట్లే, హజ్రత్ ఈసా(అ.స.) హజ్రత్ ముహమ్మద్ (స)గారి ఆగమన వార్తనిచ్చారు. మీరు తౌరాత్ గ్రంథవహులకు ఇంజీల్ (బైబిల్) గ్రంథం గురించి బోధించినట్లే మేము మీకు దివ్యఖుర్ఆన్ బోధనల వైపునకు రమ్మంటున్నాం. ఏదైనా ఓ జాతిలో ప్రవక్త ప్రభవిస్తే ఆ జాతి ఆయన సమాజమైపోతుంది. ఆ జాతి ఇక ఆ ప్రవక్తను విధేయించడం తప్పనిసరి. మీరు ఆయన కాలంలో ఉన్నవారు. అదేకాదు, మేము మిమ్మల్ని మెసయ్యా ధర్మం నుండి అడ్డుకోవడం లేదు. ఆ ధర్మం బోధించిన విషయాన్నే మేమూ మీకు బోధిస్తున్నాం."

ముఖౌఖిస్ ఆ ఉత్తరాన్ని అందుకొని, గౌరవపూర్వకంగా దాన్ని ఏనుగు దంతంతో చేయబడిన డబ్బీలో వేసి దానిపై సీలు వేశాడు. దాన్ని తన స్త్రీ బానిసకు దాయమని ఇచ్చాడు. అరబీ భాష రాయగల ఒక మనిషిని పిలిపించి దైవప్రవక్త (స) గారి సన్నిధికి ఈ క్రింది లేఖ రాయించాడు.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

ముహమ్మద్ బిన్ అబ్దుల్లాకు చక్రవర్తి ముఖౌఖిస్ రాయునది.

మీకు సలాము. అనంతరం, నేను తమ లేఖను చదివాను. ఆ లేఖలో ప్రస్తావించబడిన విషయాన్ని, తమ సందేశాన్ని అర్థం చేసుకున్నాను. నాకు తెలిసినంతమట్టుకు ఓ ప్రవక్త ఇంకా రావలసి ఉంది. ఆయన సిరియా దేశం నుండి ప్రభవిస్తాడని నా అంచనా. నేను తమ దూతను గౌరవించాను. తమ సన్నిధికి ఇద్దరు స్త్రీ బానిసలను పంపిస్తున్నాను. వీరికి ఖిబ్తీలలో గొప్ప గౌరవం ఉంది. కొన్ని వస్త్రాలను, తమరు స్వారీ చేయడానికిగాను ఓ ఖచ్చర్ (కంచర గాడిద)ను కూడా కానుకలుగా పంపిస్తున్నాను. మీకు సలామ్. (శుభాలు కలుగుగాక)."

ముఖౌఖిస్ అంతకంటే మరింకేమీ రాయలేదు. ఇస్లామ్ ధర్మాన్నీ స్వీకరించలేదు. ఇద్దరు స్త్రీ బానిసలు మారియా మరియు సిరీన్‌లు. ఖచ్చర్ పేరు 'దుల్‌దుల్'. ఇది హజ్రత్ అమీరె మావియా కాలం వరకు జీవించి

https://teluguislam.net



ఉండింది.[11] దైవప్రవక్త (స) మారియాను తమ వద్దే ఉంచుకున్నారు. ఆమె గర్భాన దైవప్రవక్త (స) కుమారుడు ఇబ్రాహీం జన్మించారు. ఇక సిరీన్‌ను హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ అన్సారి (ర)కు అప్పజెప్పారు.

## 3. పర్షియా చక్రవర్తి ఖుస్రో పర్వేజ్‌కు పంపిన లేఖ

దైవప్రవక్త (స) ఓ లేఖను పర్షియా చక్రవర్తి కిస్రా (ఖుస్రో)కు పంపించారు. ఆ లేఖ ఇది.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

ముహమ్మద్ రసూలుల్లాహ్ తరఫున పర్షియా చక్రవర్తి కిస్రాకు రాసిన లేఖ ఇది:

సన్మార్గాన్ని అవలంబించే వ్యక్తికీ, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసిస్తూ, అల్లాహ్ తప్ప వేరెవరూ ఆరాధనలకు అర్హులుకారని, ఆయన ఒక్కడూ, ఆయనకు మరెవ్వరూ సాటిలేరని, ముహమ్మద్ అల్లాహ్ దాసుడు మరియు ప్రవక్త అని సాక్ష్యం ఇచ్చే వ్యక్తికి శుభాలు కలుగుగాక. నేను మిమ్మల్ని అల్లాహ్ వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఎందుకంటే, జీవించి ఉన్న వానికి అతని దుష్పరిణామాలను గురించీ, తిరస్కారులకు సత్యమేదో తెలియజేయటానికీ నేను మానవులందరి తరఫున అల్లాహ్ ద్వారా పంపించబడినవాణ్ణి గనుక. కాబట్టి మీరు ఇస్లామ్ స్వీకరించండి క్షేమంగా ఉండగలరు. దాన్నే గనక తిరస్కరిస్తే మీ భుజస్కంధాలపై మజూస్‌ల (అగ్ని ఆరాధకుల) పాపభారం కూడా పడగలదు."

ఈ లేఖను కిస్రాకు అందించడానికి దైవప్రవక్త (స), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖుజాఫా సహమీ (ర) గారిని ఎంపిక చేశారు. ఆయన ఈ ఉత్తరాన్ని బహ్రైన్ పాలకునికి అందజేశారు. బహ్రైన్ పాలకుడు ఈ లేఖను తన మనిషి కిచ్చి కిస్రాకు పంపించాడా లేదా ఖుద్దు అబ్దుల్లాహ్ బిన్ ఖుజాఫా సహమీ(ర) గారినే అక్కడకు పంపించాడా అనే విషయం గ్రంథాల ఆధారంగా తెలియ రాలేదు. మొత్తానికి ఈ లేఖను కిస్రాకు చదివి వినిపించగా అతను దాన్ని చించివేశాడు. ఎంతో గర్వాన్ని ప్రదర్శిస్తూ,

11. జాదుల్ ముఆద్-3/61.

https://teluguislam.net



"నా పాలితుల్లో ఓ నీచమైన బానిస తన పేరును నా పేరుకంటే ముందు రాస్తాడా?" అని మండిపడ్డాడు.

దైవప్రవక్త (స)కు ఈ వార్త తెలియగా ఆయన, "అల్లాహ్ అతని రాచరికాన్ని ఛిన్నాభిన్నం చేయుగాక" అని శపించారు. (ఆ తరువాత దైవప్రవక్త (స) గారు శపించినట్లే జరిగిపోయింది.)

అనంతరం కిస్రా తన యమన్ గవర్నరు అయిన బాజాన్‌కు లేఖ రాస్తూ, హిజాజ్‌లో ఉన్న ఆ వ్యక్తి వద్దకు ఇద్దరు బలాఢ్యులైన మనుషుల్ని పంపి, బంధించి నా సన్నిధికి హాజరుపర్చమని ఆదేశించాడు. బాజాన్ ఆ ఆదేశాన్ని శిరసావహిస్తూ ఇద్దరు వ్యక్తుల్ని ఎంపిక చేస్తూ వారి ద్వారా దైవ ప్రవక్తకు ఓ లేఖ రాసి పంపాడు. ఆ లేఖలో అతను, ఈ ఇద్దరి వెంట వెళ్ళి కిస్రా దర్బారులో హాజరుకమ్మనే ఆదేశం ఉంది. వారిరువురు మదీనాకు వెళ్ళి ప్రవక్త సన్నిధికి చేరిన తరువాత వారిలో ఒకడు, "చక్రవర్తి కిస్రా, బాజాన్ గవర్నరుకు ఓ ఉత్తరం ద్వారా మిమ్మల్ని కిస్రా వద్దకు హాజరుపర్చమని ఉత్తరం రాయడం వలన ఆయన నన్ను మీ వద్దకు పంపించాడు. మీరు నా వెంట కిస్రా దగ్గరకు బయలుదేరి రావాలి" అన్నాడు. ఇదేకాకుండా వారిరువురు బెదిరింపు ధోరణిని అవలంబించారు కూడా. దైవప్రవక్త (స) వారిరువురిని రేపు వచ్చి కలవమని చెప్పారు.

ఇటు మదీనాలో ఆసక్తికరమైన కార్యం జరుగుతూ ఉండగానే, అటు ఖుస్రో పర్వేజ్ కుటుంబంలోనే అతనికి వ్యతిరేకంగా తిరుగుబాటు జ్వాల భగ్గుమంది. దీని ఫలితంగా కైసరు సైన్యాల చేతిలో పార్శీ సైన్యాలు ఎడతెగ కుండా అపజయాలను ఎదుర్కొంటున్నాయి. ఆ అదనులోనే ఖుస్రో తన యుడు 'షేరూయా' తన తండ్రిని హతమార్చి రాజైపోయాడు. అది మంగళ వారం రాత్రి, జమాదిల్ అవ్వల్ నెల, పదవ తారీఖు హి.శ. 7నాడు జరిగిన సంఘటన.[12] దైవప్రవక్తకు ఈ విషయం వహీ (దివ్యావిష్కృతి) ద్వారా తెలిసింది.

మరుసటి రోజు ఆ ఇద్దరు పర్షియా ప్రతినిధులు దైవప్రవక్త (స)గారి సన్నిధికి హాజరు కాగానే ఆయన వారికి ఈ సంఘటన గురించి తెలియజేశారు. ఇది విన్న వారిద్దరూ, ఏమిటీ మీరు స్పృహలో ఉండే మాట్లాడుతున్నారా? మేము ఇంతకంటే మామూలు విషయాలను మీ నేరాల్లో చేర్చి ఉన్నాం.

---

12. ఫత్‌హుల్‌బారి-8/127

https://teluguislam.net



మరి మీ ఈ మాటల్ని మేము మా చక్రవర్తికి రాసి పంపించాలా? అని బెదిరించారు.

"అవును, అతనికి నా ఈ మాటలను గురించి తప్పకుండా తెలియ జేయండి. అతనికి ఇంకా ఇలా కూడా రాసి పంపించండి. అతనితో చెప్పండి. నా ధర్మం, నా పాలన, కిస్రా ఇప్పటి వరకు చేరినంత దూరం చేరగలదని. అంతేకాదు ఈ పాలన అలా విస్తరిస్తూ, గుర్రాలుకాని, ఒంటెలుకాని వెళ్ళ లేనంత వరకు వెళ్ళి ఆగిపోగలదని కూడా చెప్పండి. మీరిరువురు అతనితో, నీవే గనక ముస్లిం అయిపోతే ప్రస్తుతం నీ అధికారంలో ఉన్నదంతా నీదే అవుతుంది, నిన్ను నీ జాతికి రాజుగా చేస్తాను అని కూడా చెప్పండి" అని అన్నారు.

ఆ తరువాత వారిద్దరు మదీనా నుండి బయలుదేరి బాజాన్ దగ్గరకు వెళ్ళారు. అతనికి వివరాలన్నీ తెలియజేశారు. కొన్ని రోజుల అనంతరం అతనికి ఓ లేఖ అందింది. 'షేరూయా' తన తండ్రిని హతమార్చాడని, ఏ వ్యక్తి గురించి తన తండ్రి బాజాన్‌కు రాశాడో తిరిగి ఆదేశం వచ్చే వరకు అతని జోలికి పోవద్దని ఉంది ఆ లేఖలో.

ఈ సంఘటన జరిగిన తోడనే బాజాన్ మరియు యమన్‌లో ఉంటున్న అతని పర్షియన్ సహచరులంతా ముస్లిములైపోయారు.[13]

## 4. రోము చక్రవర్తి కైజరుకు పంపిన లేఖ

సహీ బుఖారి గ్రంథంలోని ఓ సుదీర్ఘమైన హదీసులో ఓ లేఖ గురించిన ఆధారం లభిస్తోంది. ఈ లేఖను దైవప్రవక్త (స) రోమన్ చక్రవర్తి 'హిరక్ల్'కు పంపించింది. ఆ లేఖ ఇది:

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ దాసుడు మరియు ప్రవక్త అయిన ముహమ్మద్ తరఫున మూడవ హిరక్ల్ చక్రవర్తికి.

సన్మార్గాన్ని అవలంబించే వ్యక్తికి శుభాలు. మీరు ఇస్లామ్‌ను స్వీకరిం చండి క్షేమంగా ఉంటారు. ఇస్లామ్ స్వీకరించండి అల్లాహ్ మీ ప్రతిఫలాన్ని రెట్టింపుజేస్తాడు. మీరే గనక దీన్ని తిరస్కరిస్తే 'పరారీసీల' (మీ ప్రజల) పాపభారం కూడా మీ భుజస్కంధాలపైన్నే పడుతుంది.

13. ముహాజిరాతె ఖజ్రీ-1/147; ఫత్‌హుల్‌బారి-8/127,128; రహ్మతుల్ లిల్ ఆలమీన్.

https://teluguislam.net



"ఓ గ్రంథవహులారా! మాకూ, మీకూ మధ్య సమానంగా ఉన్న విషయం వైపునకు రండి. అదేమిటంటే అల్లాహ్ తప్ప మనం మరెవ్వరినీ ఆరాధించము అనీ, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించము అనీ మరియు మనలో ఏ ఒక్కడూ మరొకరిని, అల్లాహ్ తప్ప ప్రభువుగా చేసుకోము అనేదే. ఒకవేళ వారు దాన్ని తిరస్కరిస్తే చెప్పేయండి, మేము ముస్లిములము, మీరే దీనికి సాక్షి అని."[14]

ఈ లేఖను అందించడానికి ఓిహ్యా బిన్ ఖలీఫా కలబీ (ర)ను ఎంచుకోవడం జరిగింది. దైవప్రవక్త (స) ఆయనకు ఆదేశమిస్తూ మీరు దీన్ని బస్రా గవర్నరుకు అందించండి, అతను దీన్ని కైసరు వద్దకు పంపుతాడు అని చెప్పారు. ఆ తరువాత జరిగిన వివరాలన్నీ సహీ బుఖారి గ్రంథంలో ఇబ్నె అబ్బాస్ (ర) గారు ఉల్లేఖించిన హదీసులో ఉన్నాయి. ఆయన ఇలా ఉల్లేఖిస్తున్నారు.

అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ నాతో ఇలా అన్నారు; "హిరక్ల్ తనను ఖురైషుల ఓ బృందంతో సహా తన వద్దకు రప్పించుకున్నాడు. ఈ బృందం హుదైబియా ఒప్పందం జరిగిన తరువాత ఆ షరతులకు లోబడి ప్రశాంత వాతావరణంలో సిరియాకు వెళ్ళి ఉంది. మేము ఏలియా (బైతుల్ మఖ్దిస్)లో అతని దర్బారులో హాజరయ్యాము.[15] హిరక్ల్ మమ్మల్ని తమ దర్బారులో హాజరుపర్చుకున్నాడు. ఆ సమయంలో దర్బారులో గొప్ప గొప్ప వారు కూర్చుని ఉన్నారు. ఆ తరువాత అతను తన దుబాషీని పిలిచి అతని మాధ్యమంగా మాతో సంభాషించాడు.

---

*14. సహీ బుఖారి-1/4,5.*

*15. ఆ సందర్భంలో హిరక్ల్, అల్లాహ్ అతని చేతుల మీదుగా పర్షియన్లను ఘోరపరాజయానికి గురిచేయగా కృతజ్ఞతలు చెల్లించుకోవడానికి ఏలియా వెళ్ళి ఉన్నాడు. (చూడండి, సహీ ముస్లిమ్-2/99). దీని వివరాలు ఇలా ఉన్నాయి: పార్సీలు ఖుస్రో పర్వేజును హతమార్చిన తరువాత రోమన్లతో వారు హస్తగతం చేసుకున్న ప్రాంతాలను వెనక్కు తిరిగి ఇచ్చే షరతు మీద సంధి కుదుర్చుకున్నారు. వారు దానికి ప్రతిగా, వారి విశ్వాసం ప్రకారం, ఈసా (అ.స.)ను శిలువ వేసిన శిలువను కైజరుకు అప్పజెప్పారు. కైజరు ఈ సంధి జరిగిన తరువాత దాన్ని దాని యథాస్థానంలో ప్రతిష్ఠించినందుకు, ఈ విజయం గురించి కృతజ్ఞతలు అర్పించుకునేందుకు క్రీ.శ. 629 అంటే హి.శ. 7లో ఏలియా (బైతుల్ మఖ్దిస్)కు వెళ్ళాడు.*

https://teluguislam.net



“ఇప్పుడు తనను తాను దైవప్రవక్తగా ప్రకటించిన ఈ వ్యక్తికి మీలో ఎవరు వంశం రీత్యా దగ్గరి సంబంధం కలిగి ఉన్నారు?” అని అడిగాడు.

“నేను ఆయన వంశం రీత్యా అతనికి దగ్గరివాణ్ణి” అని బదులిచ్చాన్నేను.

“ఇతణ్ణి నాకు దగ్గరగా తీసుకురండి, ఇతని అనుచరుల్ని కూడా అతని వెనుకాలే కూర్చోబెట్టండి” అని ఆదేశించాడు హిరక్ల్.

అనంతరం అతను తన దుబాషీని సంబోధిస్తూ, “ఆయన వెంట ఉన్న మనుషులతో చెప్పు, ఇతనే గనక అసత్యమాడితే వెంటనే దాన్ని మీరు ఖండించాలి” ” అని అనగా, “దైవసాక్షి! అగౌరవంపాలు అవుతాననే భయమే లేకుండా ఉండి ఉంటే నేను ముహమ్మద్ (స) గురించి అసత్యమాడేవాణ్ణే కదా!” అని అనుకున్నాను నా మదిలో.

దుబాషీ మాధ్యమంగా ఆ ఇరువురి నడుమ కొనసాగిన సంభాషణ ఇలా ఉంది:

అతను అడిగిన మొట్టమొదటి ప్రశ్న, “ఆయన వంశం ఎలాంటిది అని అనుకుంటున్నారు మీరు?”

అబూ సుఫ్యాన్: ఆయన గొప్ప వంశానికి చెందినవాడు.

హెరక్ల్: నీవే కాకుండా ఈ మాట మీరెవరైనా ఇదివరకు అని ఉన్నారా?

అబూ సుఫ్యాన్ : లేదు.

హెరక్ల్: ఈయన తాతముత్తాతల్లో ఎవరైనా రాజుగా రాజ్యమేలారా?

అబూ సుఫ్యాన్ : లేదు

హెరక్ల్: సరే, ధనవంతులు ఆయన్ను అనుసరించారా లేదా బలహీనులా?

అబూ సుఫ్యాన్: అందరూ బలహీనులే.

హెరక్ల్: వీరి సంఖ్య అధికం అవుతుందా లేదా క్షీణిస్తోందా?

అబూ సుఫ్యాన్: పెరుగుతూనే ఉంది.

హెరక్ల్: ఈ ధర్మంలో ప్రవేశించిన తరువాత ఏ ఒక్కడైనా ఈ ధర్మం నుండి బయటపడి ధర్మభ్రష్టుడయ్యాడా?

https://teluguislam.net



అబూసుఫ్యాన్: లేదు.

హెరక్ల్: ఈయన ఏ విషయాన్నయితే చెబుతున్నాడో ఆ విషయం గురించి ఇంతకు పూర్వం అతని కంటే ఎవరైనా చెప్పి ఉన్నారా?

అబూ సుఫ్యాన్: లేదు.

హెరక్ల్: ఆయన చెప్పిన మాటను ఎప్పుడైనా తప్పడం జరిగిందా?

అబూ సుఫ్యాన్: లేదు. అయితే మేము ఇప్పుడు అతనితో చేసుకున్న ఒప్పందంలో కుదుర్చుకున్న కాలాన్ని గడుపుతున్నాం. ఈ కాలంలో అతను తన మాటను నిలుపుకుంటాడో లేదో మాకు తెలియదు.

అబూ సుఫ్యాన్ కథనం ప్రకారం, ఈ ఒక్క మాట తప్ప మరే మాటనూ నేను నా తరపు నుంచి చెప్పే అవకాశం నాకు లభించలేదు.

హెరక్ల్: మీరు ఆయనతో యుద్ధం చేయడం జరిగిందా?

అబూ సుఫ్యాన్: అవును, మేము ఆయనతో యుద్ధం కూడా చేశాము.

హెరక్ల్: అయితే మీకు, ఆయనకు మధ్య జరిగిన యుద్ధ పరిణామాలు ఎలాగున్నాయి?

అబూ సుఫ్యాన్: యుద్ధం మాకూ, ఆయనకు నడుమ ఓ బొక్కెన లాంటిది. ఆయన మమ్మల్ని నష్టబెడితే మేము ఆయన్ను నష్టానికి గురిచేసే వారం.

హెరక్ల్: ఆయన మీకు దేని గురించి ఆదేశిస్తున్నాడు.

అబూ సుఫ్యాన్: ఆయన చెప్పేది, మేము కేవలం అల్లాహ్‌నే ఆరాధించాలని, ఆయనకు మరెవ్వరినీ సాటి కల్పించరాదని, మీ తాతముత్తాతలు ఏవైతే చెబుతూ వచ్చారో దాన్ని వదిలేయమని. ఆయన మాకు నమాజు చెయ్యమని, సత్యం పలకమని, చెడుకు దూరంగా ఉండమని, సౌశీల్యం మరియు బంధువుల ఎడల సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆదేశిస్తున్నాడు.

ఆ తరువాత హెరక్ల్ తన దుబాషీని సంబోధిస్తూ, నీవు ఇతనితో (అబూ సుఫ్యాన్‌తో) ఇలా చెప్పు అంటూ తన అభిప్రాయాన్ని ఇలా బహిర్గతం చేశాడు.

https://teluguislam.net



"నేను ఆయన వంశం గురించి అడిగినప్పుడు నీవు ఆయన ఉన్నత మైన వంశానికి చెందినవాడని చెప్పావు. ప్రవక్తలు తన జాతిలోని ఉన్నత వంశం నుండే ప్రభవింపజేయబడతారు.

ఈ మాటలు మీలో ఇంకెవరైనా చెప్పి ఉన్నారా? అని అడిగినప్పుడు నీవు, అలా ఎవరూ చెప్పలేదని అన్నావు. ఈ మాటలు ఇంతకు పూర్వం ఇంకెవరైనా చెప్పి ఉండి ఉంటే ఇతను వాటినే వల్లిస్తున్నాడని నేను అనుకొని ఉండేవాణ్ణి.

ఈయన తాతముత్తాతల్లో ఎవరైనా రాజుగా చెలామణి అయ్యారా? అని అడిగినప్పుడు, నీవు లేదు అని సమాధానమిచ్చావు. ఇతని తాతముత్తాతల్లో ఎవరైనా రాచరికం చేసి ఉంటే, ఈయన తన తాతముత్తాతల రాచరికాన్ని కోరుకుంటున్నాడని అనుకొని ఉండేవాణ్ణి.

అలాగే, ఏ మాటైతే ఆయన అంటున్నాడో అంతకు పూర్వం మీరు దాన్ని అసత్యంగా ఖండించి ఉన్నారా? అని నేనడిగినప్పుడు నీవు అలా జరగ లేదని అన్నావు. అందుకని ఆయన మీతో ఎప్పుడూ అసత్యం పలకనప్పుడు అల్లాహ్ గురించి ఎలా అసత్యం పలుకగలడు?

సంపన్నులు ఆయనను అనుసరిస్తున్నారా లేదా పేదవారా? అని నేనడిగినప్పుడు బలహీన ప్రజలు, పేదలే ఆయన్ను అనుసరిస్తున్నారని నీవు అన్నావు. యదార్థంగా ఇలాంటివారే ప్రవక్తలను అనుసరించేవారుగా ఉంటారు.

ఆయన ధర్మాన్ని అవలంబించిన తరువాత ఎవరైనా తిరిగి ఆ ధర్మాన్ని వదిలి మార్గభ్రష్టులైపోతున్నారా? అని అడగగా నీవు లేదు అని సమాధాన మిచ్చావు. యదార్థం ఏమిటంటే, విశ్వాస మాధుర్యం హృదయాల్లో చోటుచేసు కున్నప్పుడే అలా జరుగుతుంది.

ఆయన ఆడిన మాట ఎప్పుడైనా తప్పారా అని అడగగా నీవు అలా ఎప్పుడూ జరగలేదని సమాధానమిచ్చావు. ప్రవక్తలు అలాగే ఉంటారు, ఎప్పుడూ ఆడిన మాటను జవదాటరు.

నేను నిన్ను, ఆయన వేటిని గురించి ఆదేశిస్తున్నాడు? అని అడిగిన ప్పుడు నీవు, ఆయన అల్లాహ్‌ను ఆరాధించమని, ఆయనకు మరెవ్వరినీ

https://teluguislam.net



సాటి కల్పించకు అనే ఆదేశం ఇస్తున్నాడు అనీ, విగ్రహారాధన విడువమనీ, నమాజు, సత్యం మరియు సౌశీల్యం గురించి బోధిస్తున్నాడని చెప్పావు.

నీవు చెప్పిందే నిజమైతే ఈ వ్యక్తి అతి త్వరలోనే నా ఈ కాళ్ళ క్రింద ఉన్న భూభాగానికి యజమాని అవుతాడు. ఓ ప్రవక్త వస్తాడన్న విషయం నాకు తెలుసు. అయితే ఆయన మీ జాతి నుండి ప్రభవించడని నేను అనుకున్నాను. నేను ఆయన వద్దకు వెళ్ళే నమ్మకమే ఉండివుంటే ఆయన వద్దకు వెళ్ళే శ్రమ తీసుకునేవాణ్ణే. ఆయన సాన్నిధ్యంలోనికి వెళ్ళగలిగితే ఆయన రెండు కాళ్ళను కడిగేవాణ్ణే."

ఆ తరువాత హిరక్ల్, దైవప్రవక్త (స)గారి లేఖను తెప్పించి అక్కడున్న వారందరికీ చదివి వినిపించాడు. లేఖ చదవడం పూర్తి కాగానే అక్కడ బిగ్గరగా మాట్లాడుకోవడం, పెద్ద గోల జరగటం వినిపించింది. మమ్మల్ని బయటకు పంపించేయమని అతను ఆదేశమివ్వగా మమ్మల్ని బయటకు పంపించడం జరిగింది. మేము బయటకు వచ్చిన తరువాత నేను నా అనుచరులతో, 'అబూ కబ్షా'[16] కుమారుని వ్యవహారం బాగా ముదిరిపోయింది. ఇతనంటే, బనుల్ అస్ఫర్ (రోమనుల)[17] రాజు కూడా భయపడుతున్నాడు అన్నాను. ఈ సంఘటన తరువాత నాకు దైవప్రవక్త (స) గారి ధర్మమే ప్రాబల్యం పొందగలదనే గట్టి నమ్మకం కుదిరింది. చివరకు నా హృదయ కవాటాలను అల్లాహ్ ఇస్లామ్ కోసం తెరిచేశాడు.

కైసరుపై, దైవప్రవక్త (స)గారి లేఖ ఎలాంటి ప్రభావం చూపిందో అబూ సుఫ్యాన్ మాటల వల్ల అర్థం చేసుకోవచ్చు. కైసరు, దైవప్రవక్త (స)గారి

---

16. అబూ కబ్షా కుమారుడు అంటే దైవప్రవక్త (స) అన్నమాట. అబూ కబ్షా ఆయన (స)గారి తాతో పితామహులు లేదా మాతామహుల్లో ఒకరి మారు పేరు. ఆయనకు పాలు పట్టిన తల్లి హలీమా సాదియా గారి భర్త మారు పేరు కూడా అదే అని చెప్పడం జరుగుతోంది. మొత్తానికి ఈ అబూ కబ్షా పేరు అంత ప్రాచుర్యంలో లేని పేరు. అరబ్బుల్లో, ఎవరినైనా అగౌరవపర్చాలంటే అతని వంశంలోనే అప్రసిద్ధ వ్యక్తితో జోడించి చెప్పడం ఆచారంగా వస్తూ ఉండేది.
17. బనుల్ అస్ఫర్ (అస్ఫర్ సంతతి, అస్ఫర్ అంటే పసుపు రంగు అని అర్థం). రోమనులను బనుల్ అస్ఫర్ అనడానికి కారణం ఏమిటంటే, రోమనుల ఏ వ్యక్తి ద్వారా అయితే రోమను సంతతి వికసించిందో అతణ్ణి 'అస్ఫర్' (పసుపు రంగువాడు) అని ప్రాచుర్యం పొందడమే.

https://teluguislam.net



లేఖ నందించడానికి వెళ్ళిన దూత హజ్రత్ దిహ్యా కలబీ (ర)గారికి డబ్బు, వస్త్రాలిచ్చి సత్కరించాడు. కాని హజ్రత్ దిహ్యా కలబీ (ర) వాటిని తీసుకొని మదీనాకు వచ్చేటప్పుడు 'జిజామ్' తెగకు చెందిన కొందరు వ్యక్తులు దోపిడి చేసి అవన్నీ దోచుకోవడం జరిగింది. ఆయన మదీనాకు చేరి నేరుగా దైవప్రవక్త (స)గారి సన్నిధికే వెళ్ళారు. వివరాలన్నీ ఆయనకు తెలియజేయగా, మహాప్రవక్త (స) జైద్ బిన్ హారిసా నేతృత్వంలో అయిదు వందల మంది సహాబాల ఓ సైనిక పటాలాన్నిచ్చి 'హుస్మా'కు పంపించారు. హజ్రత్ జైద్ (ర) జిజామ్ తెగ వారిపై రాత్రి పూట దాడి చేసి చాలా మందిని సంహరించారు. వారి పశువుల్ని, స్త్రీలను తోలుకొని మదీనాకు వచ్చారు. పశువుల్లో వేయి ఒంటెలు, అయిదు వేల మేకలు ఉన్నాయి. ఖైదీల్లో వంద మంది స్త్రీలు, పిల్లలూ ఉన్నారు.

జిజామ్ తెగ వారికి, దైవప్రవక్త (స)కు నడుమ అప్పటికే సంధి కుదిరి ఉన్నందువలన ఆ తెగకు చెందిన ఓ సర్దారు జైద్ బిన్ రిఫాఅ జిజామీ పరుగున దైవప్రవక్త (స) వద్దకు వచ్చి నిరసన ప్రకటిస్తూ వేడుకున్నాడు. జైద్ బిన్ రిఫాఅ, ఆ తెగకు చెందిన కొందరు వ్యక్తులతో సహా ఇదివరకే ఇస్లామ్ స్వీకరించి ఉండడం, దోపిడి జరిగినప్పుడు ఆయన హజ్రద్ జైద్ (ర)కు కూడా సహాయపడి ఉండడం మూలంగా దైవప్రవక్త (స) అతని నిరసనను స్వీకరించి యుద్ధధనాన్ని, ఖైదీలను అతనికి అప్పజెప్పేశారు.

"గజ్వా"ల చరిత్ర రాసేవారు చాలా మంది ఈ సంఘటన హుదైబియా ఒప్పందం కంటే ముందు జరిగిన సంఘటన అని చెబుతారు. కాని ఇది పెద్ద పొరపాటు. ఎందుకంటే కైసరు వద్దకు లేఖ పంపించింది హుదైబియా ఒప్పందం తరువాతనే. అందుకని, అల్లామా ఇబ్నె ఖైమ్ గ్రంథస్తం చేసిన దాని ప్రకారం, ఈ సంఘటన హుదైబియా ఒప్పందం తరువాతనే సంభవించిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.[18]

### 5. ముస్జిర్ బిన్ సావీ పేరున రాసిన లేఖ

మహాప్రవక్త (స), బహ్రైన్ పాలకుడైన మున్జిర్ బిన్ సావీ వద్దకు ఓ లేఖను పంపుతూ అతన్ని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించారు. ఇది

18. చూడండి, జాదుల్ ముఆద్-2/122; తల్ఖీహుల్ ఫహూమ్, పుట. 29

https://teluguislam.net



అలా బిన్ హజ్రమీ చేతికిచ్చి పంపిన లేఖ. సమాధానంగా ముంజిర్ బిన్ సావి మహాప్రవక్త (స)కు ఇలా రాశాడు.

ఓ దైవప్రవక్తా! నేను తమ ఉత్తరాన్ని బహ్రైన్ ప్రజలకు చదివి వినిపించాను. కొందరు ఇస్లామ్ ధర్మాన్ని పవిత్రమైనదిగా తలంచి ఇష్టపూర్వకంగా దాన్ని స్వీకరించారు. కొందరికి మీ ఆహ్వానం నచ్చలేదు. నా ఈ రాజ్యంలో యూదులు మరియు మజూస్‌లు (అగ్ని ఆరాధకులు) కూడా ఉన్నారు. తమరు ఈ విషయంలో ఆదేశాలివ్వండి."

ఈ ఉత్తరానికి సమాధానంగా దైవప్రవక్త (స) అతనికి ఈ లేఖను రాశారు.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

దైవప్రవక్త ముహమ్మద్ (స) తరఫున ముంజిర్ బిన్ సావీకి,

నీకు సలాములు. నేను నీ తరఫున అల్లాహ్‌ను స్తుతిస్తున్నాను. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులైన వారు లేరని, ముహమ్మద్ అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.

తరువాతను- నేను నిన్ను అల్లాహ్‌కు భయపడమని గుర్తు చేస్తున్నాను. చూడు! ఎవరైతే మేలును, పుణ్యాలను చేసుకుంటాడో, అతను తన కోసమే మేలు చేసుకున్నవాడవుతాడు. ఎవరైతే నా దూతల ఆదేశాలను పాటిస్తాడో అతను నా ఆదేశాలను పాటించినట్లే. ఎవరైనా వారితో సత్ప్రవర్తనగా మెలిగితే అతను నా ఎడల సత్ప్రవర్తనతో మెలిగినట్లే. నా దూతలు నిన్ను బాగా పొగిడారు. నేను నీ జాతి విషయంలో నీ సిఫార్సును స్వీకరిస్తున్నాను. కాబట్టి ముస్లిములు ఏ పరిస్థితిలోనైతే ఇస్లామ్ స్వీకరించారో, వారిని ఆ పరిస్థితిలోనే ఉండనివ్వు. తప్పు చేసిన వారిని నేను క్షమించేస్తున్నాను. కాబట్టి నీవు వారిని క్షమించు. ఇంకా ఎప్పటివరకైతే నీవు సంస్కరణ మార్గాన్ని అనుసరిస్తూ ఉంటావో, అప్పటివరకు నిన్ను తొలగించేది లేదు. ఎవరైతే యూదత్వం మరియు అగ్ని ఆరాధనపైన్నే స్థిరంగా ఉంటారో, వారిపై జిజ్‌యాను విధిస్తున్నాను.[19]

---

19. జాదుల్ ముఆద్-3/61,62. ఈ లేఖ ఇటీవలే లభించింది. డాక్టర్ హమీదుల్లాహ్ దీని ఫోటోను ప్రచురించారు కూడా. జాదుల్ ముఆద్ మరియు ఈ ఫోటోలో రాసి ఉన్న అంశంలో కేవలం ఒకే ఒక పదం తేడా అగుపిస్తుంది. (అంటే ఫోటోలో) 'లా ఇలాహ ఇల్లాహువ' కు బదులు 'లా ఇలాహ గైరహూ' అని ఉంది.

https://teluguislam.net



## 6. యమామా పాలకుడు హౌజా బిన్ అలి పేరున రాసిన ఉత్తరం

దైవప్రవక్త (స), ఈ క్రింది ఉత్తరాన్ని యమామా పాలకుడు హౌజా బిన్ అలి పేరున రాసి పంపించడం జరిగింది.

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) తరపున హౌజాకు వ్రాయునది.

సద్బోధనలను అవలంబించే వ్యక్తికి సలాము కలుగుగాక. నా ధర్మం గుర్రాలు, ఒంటెలు ఏ హద్దు వరకు వెళ్ళగలవో అక్కడి వరకు విస్తరిస్తుంది అన్న విషయం నీకు తెలిసి ఉండాలి. కాబట్టి నీవు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించు. క్షేమంగా ఉంటావు. నీ ఆధీనంలో ఉన్నదంతా నీ ఆధీనంలోనే ఉండగలదు.

ఈ ఉత్తరాన్ని తీసుకువెళ్ళడానికి దూతగా హజ్రత్ సలీత్ బిన్ అమ్రూ ఆమిరీని ఎంపిక చేయడం జరిగింది. హజ్రత్ సలీత్ ఈ సీలు వేసిన ఉత్తరాన్ని తీసుకొని హౌజా వద్దకు వెళ్ళగా, అతను ఆయనను తన అతిథిగా చేసుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశాడు. హజ్రత్ సలీత్ ఆ ఉత్తరాన్ని అతనికి చదివి వినిపించగా అతను అవునూ కాదు అనకుండా మధ్యేమార్గాన్ని అవలంబిస్తూ ఇలా జవాబు రాసి ఇచ్చాడు:

"తమరు దేని వైపునకైతే ఆహ్వానిస్తున్నారో, అంతకంటే మేలైనది మరింకేముంటుంది? అరబ్బులు నేనంటే గడగడలాడుతున్నారు. కాబట్టి మరేదైనా పనిని నాకు అప్పగించండి. నేను మిమ్మల్ని అనుసరిస్తాను."

అతను హజ్రత్ సలీత్‌కు కానుకలు కూడా సమర్పించుకున్నాడు. హిజ్రలో తయారైన వస్త్రాలు కూడా బహూకరించాడు. హజ్రత్ సలీత్ ఆ కానుకలను తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి వివరాలన్నీ వినిపించారు. మహాప్రవక్త (స) అతని ఉత్తరాన్ని చదివి, "అతను భూమికి సంబంధించిన ఓ చిన్న ముక్క అడిగినా నేను అతనికి ఇచ్చేవాణ్ణి కాదు. స్వయంగా అతను నాశనం కావడమేకాక అతని వద్ద ఉన్నదంతా నాశనమైపోతుంది" అన్నారు. మహాప్రవక్త (స) మక్కా జయించి తిరిగి వచ్చినప్పుడు హజ్రత్ జిబ్రీల్ (అ.స.) వచ్చి, హౌజా మరణించాడని వార్త అందించారు. అప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరులతో ఇలా అన్నారు:

https://teluguislam.net



"వినండి! యమామాలో నా తరువాత ఓ అసత్య (ప్రవక్త) పుట్టబోతున్నాడు. అతను చంపివేయబడతాడు."

"ప్రవక్తా! అతణ్ణి ఎవరు చంపుతారు?" అని వారిలో ఒకరు అడగగా, "నీవు, నీ సహచరులు" అని బదులిచ్చారు ఆయన.

ఆ తరువాత దైవప్రవక్త (స) చెప్పినట్లే జరిగింది.[20]

### 7. డెమాస్కస్ పాలకుడు హారిస్ బిన్ అబీ షమర్ గస్సానీ పేరున రాసిన లేఖ

దైవప్రవక్త (స) అతని వద్దకు ఈ క్రింది ఉత్తరాన్ని రాసి పంపించారు.

బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్

అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) తరఫున హారిస్ బిన్ అబీ షమర్‌కు రాయునది.

సన్మార్గాన్ని అవలంబిస్తూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి దాన్ని ధృవీకరించే వ్యక్తికి సలామ్ (శుభాలు కలుగుగాక). నేను నిన్ను, ఎలాంటి భాగస్వామ్యంలేని ఆ అల్లాహ్ ధర్మాన్ని విశ్వసించమని ఆహ్వానిస్తున్నాను. (ఇలా చేస్తే) నీ రాచరికం నీదే అవుతుంది.

ఈ ఉత్తరాన్ని అసద్ బిన్ ఖుజైమా తెగకు చెందిన ఓ సహాబీ హజ్రత్ షుజా బిన్ వహబ్ చేతికి ఇచ్చి పంపడం జరిగింది. ఆయన ఆ ఉత్తరాన్ని హారిస్‌కు అందించగా అతను, "నా నుండి నా రాచరికాన్ని ఎవరు లాక్కోగలరు? చూడు, అతనిపై దాడి చేయనున్నాను" అని చెప్పి పంపించాడు. అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు.

### 8. అమ్మాన్ రాజుకు రాసిన లేఖ

దైవప్రవక్త (స) ఓ లేఖను అమ్మాన్ రాజు జైఫర్, అతని సోదరుడు అబ్ద్ పేరున రాసి పంపించారు. ఆ ఇరువురి తండ్రి పేరు జలందీ. ఆ లేఖ ఇలా ఉంది:

బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్

ముహమ్మద్ (స) బిన్ అబ్దుల్లాహ్ తరఫున జలందీ కుమారులు జైఫర్ మరియు అబ్ద్ పేర.

---

*20. జాదుల్ ముఆద్-3/63*

https://teluguislam.net



ఇస్లామ్ ధర్మాన్ని అనుసరించే వ్యక్తికి సలామ్ (శుభాలు). తరువాత-

"నేను మీ ఇరువురిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానిస్తున్నాను. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే క్షేమంగా ఉండగలరు. ఎందుకంటే నేను మానవాళి అందరికీ అల్లాహ్ ప్రవక్తను అయినందువలన, జీవించి ఉన్న ప్రతివానికి అతని దుష్పరిణామాలను గురించి హెచ్చరించవలసి ఉంది. దైవ తిరస్కారులు నా మాట సత్యమైనది అని తెలుసుకోవాలి. మీరిరువురే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే, మీరిరువురిని పాలకులుగానే కొనసాగించగలను. మీరే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించకపోతే, మీ రాచరికం మంటగలిసి పోతుంది. మీ రాజ్యంపై అశ్వాల దాడి జరుగగలదు. మీ రాచరికంపై నా ప్రవక్త పదవే ప్రాబల్యం పొందగలదు."

ఈ లేఖను తీసుకువెళ్ళడానికి దూతగా హజ్రత్ అమ్రూ బినుల్ ఆస్ (ర)గారిని ఎంపిక చేయడం జరిగింది. ఆయన మాటల్లో తదుపరి వృత్తాంతం ఇలా ఉంది.

నేను బయలుదేరి అమ్మాన్ చేరి అబ్ద్‌ను కలిశాను. ఆ ఇరువురు అన్నదమ్ముల్లో ఇతనే దూరదృష్టిగలవాడు, ఆలోచనాపరుడూను. నేను అతనితో, "నేను మీ వద్దకు, మీ అన్న వద్దకు దైవప్రవక్త (స) గారి దూతగా వచ్చాను."

అతను, "నా సోదరుడు వయస్సులోనూ, రాజుగానూ నాకంటే పెద్ద వాడు, కాబట్టి నేను మిమ్మల్ని ఆయన వద్దకు పంపిస్తాను. ఉత్తరం ఆయనకు ఇచ్చేద్దురుగాని" అని చెప్పి, "అవునూ! మీరు దేని వైపునకు ఆహ్వాని స్తున్నట్లు?" అని అడిగాడు. అతనితో జరిగిన సంభాషణ ఇలా కొనసాగింది.

నేను : మేము అల్లాహ్ మార్గం వైపునకు ఆహ్వానిస్తున్నాం. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. ఆయన తప్ప మీరు ఎవరినైతే పూజిస్తున్నారో వారందరినీ వదిలేయాలి. ముహమ్మద్ (స) అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని సాక్ష్యం పలుకమని చెబుతున్నాము.

అబ్ద్: ఓ అమ్రూ! నీవు నీ జాతి సర్దారు కుమారుడివి. చెప్పు, నీ తండ్రి ఏం చేశాడో? ఎందుకంటే అతణ్ణే నీవు అనుసరించవలసి ఉంది.

https://teluguislam.net



నేను: ఆయన ముహమ్మద్ (స)ను విశ్వసించకనే మరణించాడు. కాని నేను మాత్రం ఆయన ఇస్లామ్ స్వీకరించి ఉంటే ఎంత బాగుండేదో అనేదే నా బాధ. నేనూ ఆయన మార్గాన్నే అవలంబించాను కాని అల్లాహ్ నాకు ఇస్లాం ధర్మ రుజుమార్గాన్ని చూపించాడు.

అబ్ద్: నీవు ఆయన్ను ఎప్పుడు అనుసరించావు?

నేను: ఇటీవలే.

అబ్ద్: నీవు ఇస్లామ్ స్వీకరించినది ఎక్కడ?

నేను: నజాషీ వద్ద ఉన్నప్పుడు. నజాషీ కూడా ఇస్లామ్ స్వీకరించిన విషయం నీకు తెలుసా?

అబ్ద్: మరి అతని జాతి అతని రాచరికాన్ని స్వీకరించిందా?

నేను: అవును. దాన్ని ఆ జాతి కొనసాగనిచ్చింది. అతన్నే అది అనుసరించింది.

అబ్ద్: క్రైస్తవ మత ఫాదరీలు, సన్యాసులు కూడా ఆయన్ను అనుసరించారా?

నేను: అవును.

అబ్ద్: ఓ అమ్రూ! నీవేం మాట్లాడుతున్నావో కొంచెం ఆలోచించావా? మనిషి ఏ వైఖరి అయినా అసత్యం కంటే చెడ్డది కాదు సుమా?

నేను: నేను అసత్యం పలకడం లేదు. దాన్ని మేము ధర్మసమ్మతమైనదిగా తలిచేవారం కాము.

అబ్ద్: 'హిరక్ల్'కు నజాషీ ఇస్లామ్ స్వీకరించిన విషయం తెలియదేమో అని నేననుకుంటున్నాను.

నేను: ఎందుకు కాదు! అది అతనికి తెలిసిందే.

అబ్ద్: మరి ఈ విషయం నీకెలా తెలిసింది?

నేను: నజాషీ 'హిరక్ల్'కు కప్పం కడుతూ ఉండేవాడు. కాని అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన తరువాత దైవప్రవక్త (స)యొక్క ప్రవక్తా (స) పదవిని ధృవపరిచిన తరువాత అతను, "దైవసాక్షి! అతను నాకు ఒక్క దిర్హమ్‌ను చెల్లించమన్నా నేను చెల్లించేవాణ్ణికాదు" అని అన్నాడు. ఈ విషయం హిరక్ల్‌కు తెలిసినప్పుడు అతని సోదరుడు యనాక్, "ఏమిటీ నీకు కప్పం కట్టకుండా ఉన్న ఆ బానిసను, నీ ధర్మం

https://teluguislam.net



కాకుండా మరొకరి ధర్మాన్ని అనుసరించే ఆ బానిసను ఇట్టే వదిలేస్తావా" అని అడిగాడు. దానికి హిరక్ల్, "నేను అతణ్ణి ఏమీ చేయలేను. దైవసాక్షిగా చెబుతున్నాను నాకే గనుక ఈ రాచరికం పోతుందనే భయం లేకపోతే నేను కూడా అతను అనుసరించిన మార్గాన్నే అనుసరించేవాణ్ణి" అన్నాడు.

అబ్ద్: ఓ అమ్రూ! నీవు అనేది ఏమిటో కొంత ఆలోచించి మాట్లాడు.

నేను: దైవసాక్షి! నేను నిజమే పలుకుతున్నాను.

అబ్ద్: సరే! ఆయన దేన్ని గురించి ఆదేశిస్తున్నారు మరియు ఏ విషయం గురించి వారిస్తున్నారో చెప్పు.

నేను: ఆయన అల్లాహ్ ఆదేశాలను పాటించే ఆదేశం ఇస్తున్నారు. అలాగే ఆయన అవిధేయత నుండి మిమ్మల్ని వారిస్తున్నారు. సత్కార్యాలు చెయ్యమని, బంధువుల ఎడల సత్ప్రవర్తనతో మెలగాలని ఆదేశిస్తున్నారు. జులుము, అత్యాచారం, వ్యభిచారం, మద్యపానం వలదని, రాళ్ళు, విగ్రహాలు మరియు శిలువను పూజించకూడదని చెబుతూ వాటి నుండి మమ్మల్ని అడ్డుకుంటున్నారు.

అబ్ద్: ఆయన దేని వైపునకైతే పిలుస్తున్నారో అది ఎంత మేలైన విషయం! నా సోదరుడే ఈ విషయంలో నాతో ఏకీభవిస్తే, మేము ప్రయాణించి అక్కడికి వెళ్ళి ముహమ్మద్ (స)ను విశ్వసించేవాళ్ళం. ఆయనను ధృవపరిచేవాళ్ళం. కాని, నా సోదరుడు దీనికంటే రాచరికాన్నే అధికంగా ప్రేమిస్తున్నాడు. అతను దాన్ని వదిలి ముహమ్మద్ (స) అనుయాయునిగా మారడం కష్టమే.

నేను: అతనే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిం అయిపోతే మహాప్రవక్త (స), అతనికి తన జాతిపై ఉన్న అధికారాలను అలానే కొనసాగించగలరు. అయితే మీ ధనవంతుల నుండి మాత్రం 'సదఖా' వసూలు చేయడం జరుగుతుంది.

అబ్ద్: ఇంకేం కావాలి? సరే, సదఖా అంటే ఏమిటీ?

దీనికి సమాధానంగా నేను రకరకాల సొత్తుల నుండి దైవప్రవక్త (స)

https://teluguislam.net



ఏయే సదఖాలు తీయమని ఆదేశించారో వాటన్నిటి వివరాలు ఆయన ముందు ఉంచాను. ఒంటె గురించిన సదఖా గురించి చెప్పినప్పుడు అతను నాతో, ఓ అమ్రూ! వాటికవే సొంతంగా వెళ్ళి చెట్లను మేసి వచ్చే పశువుల్లో నుండి కూడా సదఖా ఉందా అని అడిగాడు. "అవును" అని సమాధానమిచ్చాన్నేను.

అబ్ద్: దైవసాక్షిగా చెబుతున్నాను! ఇంత విశాలమైన భూభాగం మరియు జనసాంద్రతగల మా జాతి దీన్ని ఒప్పుకుంటుందని నేననుకోను.

నేను అతని దివాణంలో కొన్ని రోజుల వరకు వేచి ఉన్నాను. అతను తన సోదరుని వద్దకు వెళ్ళి వివరాలన్నీ చెప్పి వస్తున్నాడు. ఓ రోజు అతను నన్ను పిలిపించాడు. నేను లోనికి ప్రవేశించబోగా పహరా దారులు నా రెక్కలు పట్టుకొని ఆపేశారు. అతను ఆయన్ను వదలమని వారిని ఆదేశించగా వారు నన్ను విడిచిపెట్టేశారు. నేను అతని దగ్గరకు వెళ్ళి కూర్చోబోగా ఆ పహరాదార్లే నన్ను కూర్చోకుండా అడ్డుకున్నారు. నేను రాజు వైపు చూశాను. అతను నాతో నీవు తెచ్చిన సమాచార మేమిటో చెప్పు అని అడిగాడు. సీలు వేసిన ఉత్తరాన్ని నేను అతనికి ఇచ్చివేశాను. అతను దాని సీలు తీసి చదివి తన సోదరునికి అందించాడు. తమ్ముడు కూడా దాన్ని అలానే చదివాడు కాని అతని వాలకం తన అన్నకంటే మెత్తగా కనబడింది. ఆ తరువాత రాజుకు, నాకు నడుమ ఈ సంభాషణ జరిగింది.

రాజు: ఖురైషులు ఏ వైఖరిని అవలంబించారో చెప్పు.

నేను: వారంతా ఆయనకు విధేయులైపోయారు. కొందరు ఇస్లామ్ ధర్మం ఎడల ప్రేమతో మరికొందరు కరవాలం ఎడల భయంతో.

రాజు: ఆయన వెంట ఉన్నదెవరు?

నేను: అందరూ ఆయన వెంటే ఉన్నారు. వారందరు ఇస్లామ్ ధర్మాన్ని ఏరికోరి స్వీకరించినవారే. ఇతర అన్ని విషయాలకంటే దీనికే అధిక ప్రాధాన్యత ఇస్తారు. వారికి అల్లాహ్ మార్గదర్శకత్వం ద్వారా, తమ బుద్ధివివేకాల ద్వారా తాము ఇప్పటి వరకు మార్గభ్రష్టులమై ఉన్నామనే విషయం

https://teluguislam.net



తెలిసింది. ఇక మీ ప్రాంతంలో మీరు తప్ప ఇంకెవరైనా అలా అప మార్గంలో ఉన్నారో లేదో నాకు తెలియదు. మీరే గనక ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించక, దైవప్రవక్త ముహమ్మద్ (స) గారికి విధేయత చూపకపోతే మిమ్మల్ని మా ఉష్ట్రారోహులు, అశ్వారోహులు తమ కాళ్ళ క్రింద వేసి నలిపేస్తారు. మీ పచ్చికబయళ్ళు మటుమాయమైపోతాయి. కాబట్టి మీరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించండి. క్షేమంగా ఉండగలరు. దైవప్రవక్త (స) మిమ్మల్ని మీ జాతికి నాయకునిగా, పాలకునిగా చేస్తారు. మీ దగ్గరకు అశ్వికదళంగాని, పదాతిదళంగాని రానేరదు.

రాజు: ఈ రోజు నన్ను ఆలోచించుకోనీ. రేపు తిరిగి వచ్చేయి.

ఆ తరువాత నేను అతని తమ్ముని ఇంటికి తిరిగి వచ్చేశాను. అతను నాతో, "అమ్రూ? అతనికే గనక రాచరికపు దురాశ అడ్డుకోకుంటే ఇస్లామ్ తప్పక స్వీకరిస్తాడు అనే నమ్మకం నాకుంది" అని అన్నాడు.

నేను రెండో రోజు దర్బారుకు వెళ్ళగా అతను అనుమతి ఇవ్వడానికి నిరాకరించాడు. కాబట్టి నేను అతని తమ్మునితో కలసి అతనింటికి వచ్చి, "రాజు దగ్గరకు నేను వెళ్ళలేకపోయాను" అని చెప్పగా అతను నన్ను తన సోదరుని వద్దకు తీసుకువెళ్ళాడు. అతడు, "నేను మీ ఆహ్వానం గురించి బాగా ఆలోచించాను. నేనే గనక నా రాజ్యాన్ని, ఇప్పటి వరకు ఇంకా నా రాజ్యంలో ప్రవేశించని దళాల అధిపతికి అప్పగిస్తే నేను అరేబియాలోనే అతి బలహీనునిగా తలచబడతాను. ఒకవేళ మీ అశ్వికదళం, ఉష్ట్రారోహులే ఇక్కడికి వస్తే, మీకు ఇప్పటి వరకు ఎదురుకాని యుద్ధం జరిగితీరుతుంది" అని చెప్పాడు.

"సరే, నేను రేపు తిరిగి వెళ్ళిపోతున్నాను" అని చెప్పగా అతను తన సోదరునితో ఏకాంతంలో మాట్లాడుతూ, "ఈ ప్రవక్త ఎవరిపైనైతే ప్రాబల్యం సంపాదించారో వారి ముందు మనమెంత? ఆయన ఎవరి వద్దకైతే తన సందేశాన్ని పంపించారో వారు ఈయన ఆహ్వానాన్ని స్వీకరించినవారే" అని చెప్పాడు.

---

21. జాదుల్‌ముఆద్-3/62,63

https://teluguislam.net



రెండవ రోజు నన్ను దర్బారుకు పిలువనంపారు. ఆ రాజు మరియు అతని సోదరుడు ఇద్దరూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ప్రవక్త (స)ను ధృవపరిచారు. సదఖా వసూలు చేయడానికి, వారి నడుమ తీర్పుజెప్పడానికి నన్ను స్వతంత్రునిగా వదిలేశారు. ఎవరైనా నాతో విభేదిస్తే వారిద్దరూ నాకు సహాయపడ్డారు.[21]

ఈ సంఘటన జరిగిన సందర్భాన్నిబట్టి చూస్తే, ఇతర రాజుల వద్దకు పంపిన లేఖల కంటే ఈ ఇద్దరి వద్దకు పంపిన లేఖ ఆలస్యంగా చేరింది. బహుశా ఇది మక్కా విజయం తరువాత జరిగిన సంఘటన కావచ్చు.

ఈ లేఖల ద్వారా దైవప్రవక్త (స) తన సందేశాన్ని అన్ని దేశాల పాలకుల వద్దకు పంపడం జరిగింది. ఫలితంగా కొందరు ఇస్లామ్ స్వీకరించగా కొందరు దాన్ని తిరస్కరించారు. అయితే తిరస్కరించిన వారికి కూడా ఇస్లామ్ ఏమిటో తెలిసిపోయింది. వారి మనస్సులో ప్రవక్త (స) గారి ధర్మం, ఆయన పేరు బాగా నాటుకుపోయి సుపరిచితమైంది.

https://teluguislam.net



# హుదైబియా ఒప్పందం తరువాతి సైనిక చర్యలు

## 'గజ్వయె గాబా' లేదా 'గజ్వయె జీఖరద్'

ఈ గజ్వా, బనూ ఫరాజా తెగకు చెందిన కొందరిని నిలువరించడానికి వెన్నాడినటువంటి సైనిక చర్య. ఈ తెగ దైవప్రవక్త (స)కు చెందిన పశువుల్ని దొంగమాటుగా తోలుకుపోయినందున దాన్ని వెంటాడవలసివచ్చింది.

హుదైబియా ఒప్పందం తరువాత ఖైబర్ యుద్ధానికి ముందు మహాప్రవక్త (స) నిర్వహించిన మొట్టమొదటి గజ్వా ఇది. ఇమామె బుఖారి కథనం ప్రకారం, ఇది ఖైబర్ కంటే మూడు రోజులు ముందు జరిగింది. ఈ గజ్వాలో పాల్గొని ప్రత్యేకంగా యుద్ధం చేసిన హజ్రత్ సల్మా బిన్ అకూ (ర)గారి ఉల్లేఖనం కూడా దీన్ని బలపరుస్తోంది. ఈయన ఉల్లేఖనాలను సహీహ్ ముస్లిం గ్రంథంలో మనం చూడొచ్చు. యుద్ధాల చరిత్రను రాసే చరిత్రకారులు ఈ సంఘటన హుదైబియా ఒప్పందానికి పూర్వం జరిగిన సంఘటనగా చెబుతారు. అయితే, సహీహ్ గ్రంథాల్లో చెప్పబడిన విషయం ఆ చరిత్రకారులు చెప్పినదానికి భిన్నమైనది. అదే సరియైనదీను.[1]

ఈ గజ్వా హీరో అయిన హజ్రత్ సల్మా బిన్ అకూ (ర) గారు ఉల్లేఖించిన ఉల్లేఖనాల సారాంశం ఇలా ఉంది:

"దైవప్రవక్త (స) తాము స్వారీ చేసే ఒంటెలను మేపడానికి తమ బానిస రిబాహ్‌ను పంపించారు. నేను కూడా అబూ తల్హా గుర్రంతో సహా ఆయన వెంటే ఉన్నాను. హఠాత్తుగా తెల్లవారుతూ ఉండగా అబ్దుర్రహ్మాన్ ఫరాజీ అనేవాడు ఒంటెలపై దాడి చేసి వాటిని తోలుకొని వెళ్ళిపోయాడు. కాపరిని చంపేశాడు. నేను రిబాహ్‌తో, "రిబాహ్! ఈ గుర్రాన్ని తీసుకెళ్ళి అబూ తల్హాకు అప్పజెప్పి ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలియజెయ్యి" అని ఓ ఎత్తయిన

---

1. చూడండి, సహీ బుఖారి, గజ్వయె జీఖరద్ అధ్యాయం-2/603, సహీ ముస్లిం-2/113, 114, 115, ఫత్‌హుల్‌బారి-7/460,461,462, జాదుల్ ముఆద్-2/120

https://teluguislam.net



తిన్నె పైకి ఎక్కాను. మదీనా వైపు తిరిగి, 'యాసబాహ్ హాహ్' (అయ్యో! ఉదయం పూట జరిగిన దాడి) అని మూడుమార్లు అరిచాను. ఆ తరువాత నేను దాడి చేసిన వారిని వెంబడిస్తూ వారిపై శరపరంపరలను కురిపిస్తూ ఈ క్రింది యుద్ధ గీతాన్ని ఆలపించసాగాను:

"నేను అకూ కుమారుణ్ణి. ఈ రోజు పాలు త్రాగేవాని రోజు (అంటే ఈ రోజు ఎవరు తల్లిపాలు త్రాగారో తెలిసే రోజు)."

నేను వారిని, దైవసాక్షిగా! ఎడతెగకుండా బాణాలు వేసి గాయపరుస్తూనే ఉన్నాను. ఏ అశ్వారూఢుడైనా నా వైపునకు తిరిగితే నేను ఏదో ఒక చెట్టు వెనుక నక్కిపోయేవాణ్ణి. ఆ తరువాత నా బాణంతో అతణ్ణి గాయపరిచేవాణ్ణి. చివరికి వారంతా ఓ కొండ గుండా వెళ్ళే ఇరుకైన మార్గంలోనికి ప్రవేశించగా నేను ఆ కొండపైకి వెళ్ళిపోయాను. బండరాళ్ళు త్రోసి వారిని గాయపర్చసాగాను. ఇలా విరామం లేకుండా నేను వారిని వెన్నంటే ఉన్నాను. చివరికి దైవప్రవక్త (స)గారి ఒంటెలన్నింటిని నా వెనుకగా చేసుకోగలిగాను. వారు ఆ ఒంటెలని వదిలేశారు. అయినా నేను వారిని వెంబడించడం మానలేదు. వారిపై బాణాల వర్షం కురిపిస్తూనే ఉన్నాను. వారు తమ బరువును తగ్గించుకోడానికిగాను ముప్ఫైకిపైన్నే దుప్పట్లను, ముప్ఫై బల్లేలను పారవేయవలసివచ్చింది. వారు పారవేసిన వాటిపై (గుర్తుగా) కొన్ని రాళ్ళు వేస్తూ వెళుతున్నాను. ఎందుకంటే దైవప్రవక్త (స) మరియు ఆయన సహాబాలు, ఇది శత్రువు నుండి లాక్కున్న సొత్తు అని తెలుసుకోవటానికి. అనంతరం వారంతా లోయలోని ఇరుకైన ప్రదేశంలో కూర్చుని మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. నేను ఆ కొండ శిఖరానికి చేరుకుని కూర్చున్నాను. వారికి సంబంధించిన నలుగురు కొండ ఎక్కి నా వైపు రావడం గమనించాను. వారు నా మాటల్ని వినేటంతటి దూరానికి రాగానే వారినుద్దేశించి, "నేనెవరినో మీకు తెలుసా? నేను సల్మా బిన్ అకూను, నేను మీలో ఎవరి వెంటబడతానో వారిని ఇట్టే పట్టేయగలను. కాని మీరు నన్ను మాత్రం పట్టుకోలేరు సుమా!" అని అన్నాను. అంతే వారు నా మాటలు విని వెనుదిరిగి వెళ్ళిపోయారు. నేను అక్కడే కూర్చుండిపోయాను. చివరికి నేను దైవప్రవక్త (స)గారి అశ్వారోహుల్ని చూశాను. వారు చెట్ల సందుల్లో నుండి నా వైపే వస్తున్నారు. అందరికంటే ముందున్నది అఖ్రమ్. ఆయన వెనుక అబూ ఖతాదా, ఆయన వెనుకాల మెగ్దాద్ బిన్ అస్వద్ ఉన్నారు.

https://teluguislam.net



(వారు శత్రువులున్న చోటికి చేరుకొన్న తరువాత) అబ్దుర్రహ్మాన్‌తో అఖ్రమ్ ఢీకొన్నారు. హజ్రత్ అఖ్రమ్, అబ్దుర్రహ్మాన్ గుర్రాన్ని గాయపరిచేశారు. కాని అబ్దుర్రహ్మాన్ ఆయన మీదకు తన బల్లెం విసిరి చంపేశాడు. అంతలోనే అబూ ఖతాదా (ర), అబ్దుర్రహ్మాన్‌పై విరుచుకుపడి బల్లెంతో అతణ్ణి గాయ పరిచారు. తక్కిన శత్రువులు కాలికి బుద్ధి చెప్పారు. మేము వారిని వెంటాడి చీల్చిచెండాడుతున్నాం. నేను మాత్రం కాళ్ళపై ఎగురుతూ వారిని వెంటాడు తూనే ఉన్నాను. సూర్యాస్తమయం కాకపూర్వమే వారు ఓ లోయ వైపునకు పారిపోయారు. ఆ లోయలో 'జీఖరద్' అనే ఊటబావి ఉంది. బాగా దాహార్తులుగా ఉన్నందున ఆ ఊటబావి నీళ్ళు త్రాగాలని అక్కడికి వెళ్ళారు వారు. కాని నేను మాత్రం వారిని ఆ ఊటబావి దరికి చేరకుండా నిలువరిం చాను. దైవప్రవక్త (స) మరియు అశ్వారూఢులు ప్రొద్దుక్రుంకిన తరువాతగాని నా దగ్గరకు చేరలేదు. నేను దైవప్రవక్త (స) గారికి ఇలా విన్నవించుకున్నాను;

"దైవప్రవక్తా (స)! వీరంతా దాహార్తులుగా ఉన్నారు. తమరే గనక నాకు ఓ వంద మందిని ఇస్తే జీనులతో సహా వారి గుర్రాలనన్నింటినీ హస్తగతం చేసుకోగలను. వారి మెడలు పట్టి మీ ముందు హాజరుపర్చగలను."

దీనికి మహాప్రవక్త (స), "ఓ అకూ కుమారా! నీవే వారిపై విజయం సాధించావు. ఇప్పుడు కొంత మెత్తదనాన్ని పాటించు. ఇప్పుడు వారు బనూ గత్ఫాన్ తెగకు అతిథులయ్యారు" అన్నారు.

ఈ గజ్వాను గురించి వ్యాఖ్యానిస్తూ దైవప్రవక్త (స), "ఈ రోజు మాలో అందరికంటే మేలైన అశ్వారోహి అబూ ఖతాదా (ర) మరియు అందరికంటే మేలైన పదాతి సైనికుడు సల్మా" అని అన్నారు. ఆయన (స) నాకు రెండు భాగాలు ఒసగారు. ఒకటి, పదాతిదళ సైనికునిది, మరొకటి గుర్రపు రౌతుది. మదీనా తిరిగివచ్చేటప్పుడు ఆయన తన 'అస్బా' అనే స్వారి ఒంటెపై నన్ను తమ వెనుకాలే కూర్చోబెట్టుకొని గౌరవించారు.

ఈ గజ్వాలో దైవప్రవక్త (స) మదీనా బాగోగుల్ని చూసే బాధ్యతలు హజ్రత్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (ర)కు అప్పగించారు. ఈ గజ్వా పతాకాన్ని హజ్రత్ మిగ్దాద్ (ర)కు ఇచ్చారు.[2]

---

2. అధఃసూచికలోని ఆధారాలు

https://teluguislam.net



# గజ్వయె ఖైబర్; గజ్వయె వాదియిల్ ఖురా

## (ఖైబర్ యుద్ధం, ఖురా లోయ యుద్ధాలు)

ఖైబర్ అనేది ఒకప్పుడు మదీనాకు ఉత్తరాన ఎనభై లేదా అరవై మైళ్ళ దూరాన ఉండే ఓ పెద్ద పట్టణం, ఇక్కడ కోటలే కాకుండా పంట పొలాలు కూడా ఉండేవి. ప్రస్తుతం అది ఓ చిన్న టౌనుగానే ఉండిపోయింది. ఇక్కడి వాతావరణం ఆరోగ్యానికి అంత మేలైన వాతావరణం కాదు.

దైవప్రవక్త (స) హుదైబియా ఒప్పందం ఫలితంగా, అహ్జాబ్ యుద్ధంలో పాల్గొన్న మూడు పక్షాల్లో పటిష్టమైన ఓ పక్షం. ఖురైష్ వైపు నుండి ఇక ఎలాంటి ప్రమాదం లేదని తృప్తిపడ్డారు. దీని ద్వారా తక్కిన ఆ ఇరుపక్షాల బెడద లేకుండా పోతుందని ఆ తరువాత ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు ఏర్పడగలవని, ముస్లిములు ఎడతెగకుండా కొనసాగుతున్న రక్తపాతం నుండి విముక్తి పొంది అల్లాహ్ ధర్మాన్ని వ్యాపింపజేయడానికి తీరిక లభిస్తుందనే ఉద్దేశ్యంతో, ఖురైష్‌కు సహాయపడ్డ మిగిలిన రెండు వర్గాల- యూదులు మరియు నజద్ తెగలు- వైపు నుండి కూడా ఎలాంటి బెడద లేకుండా పోతుందనే ఉద్దేశ్యంతో వారి పని పట్టడానికి ఉపక్రమించారు మహాప్రవక్త(స).

ఖైబర్ కుట్రలు, కుతంత్రాలకు పుట్టినిల్లు. సైనిక కవ్వింపులకు కేంద్రం. యుద్ధ జ్వాలలను చెలరేగింపజేసే జ్వాలాముఖి అయినందున ముస్లిములు దీన్నే ఎంచుకోవడం జరిగింది.

మరి ఖైబర్ నిజంగానే అలాంటి ప్రదేశమా? అని ప్రశ్నించినప్పుడు, అహ్జాబ్ యుద్ధం (అగడ్త యుద్ధం)లో ముష్రిక్కుల వర్గాలన్నిటిని ఉసికొల్పి ముస్లిములపైకి దండెత్తి వచ్చిన వారు ఖైబర్ ప్రజలే అని మనం మరవకూడదు. అదేకాదు, బనూ ఖురైజాను కూడా తెరమాటున ఒప్పందం తెంచడానికి ప్రోత్సహించిన వారు ఈ ఖైబర్ వారే. అంతటితో సరిపుచ్చక, ఇస్లామీయ సమాజంలోని మునాఫిక్‌లతో మరియు అగడ్త యుద్ధంలో పాల్గొన్న మూడవ

https://teluguislam.net



పక్షం - బనూ గత్ఫాన్ మరియు బద్దూలతో సతతం సంబంధాలు పెట్టుకొని స్వయంగా యుద్ధ సన్నాహాలు జరిపిన వారు వీరు. తమ కుట్రలతో ముస్లిము లను పరీక్షకు గురి చేశారు.

దైవప్రవక్త (స)ను కూడా చంపడానికి ప్రయత్నించారు. పరిస్థితులు అలా మారిపోతుండడంతో దైవప్రవక్త (స) మాటిమాటికి సైనిక చర్యలను చేపట్టవలసి వచ్చేది. ఈ కుట్రదారులకు, కుతంత్రరాయుళ్ళకు నాయకులైన సలామ్ బిన్ అబిల్ హుఖైఖ్ మరియు అసీర్ బిన్ జారిమ్‌లాంటి వాళ్ళను తుడిచిపెట్టవలసి వచ్చింది. అంతకంటే ముందే ముస్లిములు యూదుల్ని అణచివేయాల్సి ఉండింది. ఈ విషయంలో వారు కొంత ఆలస్యం చేయడానికి కారణం, యూదుల కంటే శక్తిలోను, యుద్ధ కౌశల్యంలోను మిన్న అయిన మరో వర్గం- ఖురైష్. ముస్లిములను తుదముట్టించడానికి సన్నద్ధమై ఉంది. దాన్ని విస్మరించి వారు యూదుల పని పట్టడానికి వెళ్ళలేరు. అయితే ఖురైష్‌తో నిర్యుద్ధ ఒడంబడిక (హుదైబియా ఒప్పందం) జరగగానే ముస్లిములు ఈ నేరస్తులను తుదముట్టించేందుకు మార్గం సుగమం అయిపోయింది. యూదుల లెక్కల గడియ దగ్గరకు వచ్చేసినట్లయింది.

## ఖైబర్ ప్రయాణం

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) హుదైబియా నుండి తిరిగి వచ్చి జీహజ్జా మాసం పూర్తిగాను మరియు ముహర్రం మాసంలోని కొన్ని రోజుల వరకు మదీనాలోనే ఉండిపోయారు. ముహర్రం నెల మిగిలిన రోజుల్లో ఖైబర్ వైపునకు బయలుదేరారు.

ఖైబర్ అల్లాహ్ చేసిన వాగ్దానమని, ఆయన ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్ ద్వారా దాన్ని నిలబెట్టుకున్నాడని ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అంటారు. ఆ ఆయత్ ఇది.

وَعَدَكُمُ اللّٰهُ مَغَانِمَ كَثِيْرَةً تَأْخُذُوْنَهَا فَعَجَّلَ لَكُمْ هٰذِهٖ

**అల్లాహ్ మీకు అమితమైన విజయ ధనాలను వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరు పొందుతారు. వెంటనే ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదిస్తాడు.** (48 : 20)

"వెంటనే ఆయన మీకు ఈ విజయాన్ని ప్రసాదిస్తాడు" అనేది

https://teluguislam.net



హుదైబియా ఒప్పందం అని, "విజయ ధనాలను వాగ్దానం చేస్తున్నాడు" అంటే అది ఖైబర్ అని అర్థం.

## ఇస్లామీయ సైనిక బలం

మునాఫిక్‌లు, విశ్వాసంలో బలహీనులు హుదైబియా ప్రయాణంలో దైవప్రవక్త (స) వెంట వెళ్ళకుండా తమ ఇండ్లలోనే ఉండిపోయిన కారణంగా అల్లాహ్ తన ప్రవక్త (స)కు ఈ విషయంలో ఆదేశాలిస్తూ ఇలా చెప్పాడు;

سَيَقُولُ الْمُخَلَّفُونَ إِذَا انطَلَقْتُمْ إِلَىٰ مَغَانِمَ لِتَأْخُذُوهَا ذَرُونَا نَتَّبِعْكُمْ ۖ يُرِيدُونَ أَن يُبَدِّلُوا كَلَامَ اللَّهِ ۚ قُل لَّن تَتَّبِعُونَا كَذَٰلِكُمْ قَالَ اللَّهُ مِن قَبْلُ ۖ فَسَيَقُولُونَ بَلْ تَحْسُدُونَنَا ۚ بَلْ كَانُوا لَا يَفْقَهُونَ إِلَّا قَلِيلًا ﴿١٥﴾

**నీవు విజయ ధనాన్ని పొందడానికి వెళ్ళేటప్పుడు, వెనుక ఉండిపోయిన వారు నీతో, "మమ్మల్ని కూడా మీ వెంట రానీయండి" అని తప్పకుండా అంటారు. వారు అల్లాహ్ ఉత్తర్వును మార్చగోరుతున్నారు. వారికి స్పష్టంగా ఇలా చెప్పు, "మీరు మాతో రావడానికి ఎంత మాత్రం వీలు లేదు. అల్లాహ్ ఈ విషయాన్ని ముందే చెప్పేశాడు." వారు, "అది కాదు, మీరు మేమంటే అసూయ పడుతున్నారు" అని అంటారు. (అసలు ఇక్కడ విషయం అసూయకు సంబంధించింది కాదు), కాని వారు సరియైన మాటను చాలా తక్కువగానే అర్థం చేసుకుంటారు. (48 : 15)**

అందుకని దైవప్రవక్త (స) ఖైబర్‌కు బయలుదేరేటప్పుడు, తమ వెంట కేవలం జిహాద్‌లో పాల్గొనే కోరిక కలవారే రావాలని ప్రకటించారు. ఈ ప్రకటన అర్థం ఏమిటంటే, హుదైబియాలో చెట్టు క్రింద బైతె రిజ్వాన్ చేసిన వారే వెళ్ళగలరు అని. వారి సంఖ్య మొత్తం పదునాల్గు వందల మంది.

ఈ గజ్వా సందర్భంగా మదీనా బాధ్యతలను హజ్రత్ సబా బిన్ అరఫ్తా గిఫ్ఫారీకి- ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం - నుమైలా బిన్ అబ్దుల్లాహ్ లైసీకి అప్పగించడం జరిగింది. పరిశోధకులు మొదటి పేరే సరిఅయినది అని అంటారు.[1]

---

*1. ఫత్‌హుల్ బారీ-7/465; జాదుల్ ముఆద్-2/133*

https://teluguislam.net



ఈ సందర్భంలోనే హజ్రత్ అబూ హురైరా (ర)గారు కూడా ముస్లిం అయి మదీనాకు వచ్చేశారు. అప్పుడు సబా బిన్ అరఫ్తా ఫజ్ర్ నమాజు చేయిస్తున్నారు. నమాజు పూర్తి చేసుకొని అబూ హురైరా ఆయన దగ్గరకు వెళ్ళగా, దారి బత్తాన్ని సమకూర్చి ఆయన్ను మహాప్రవక్త (స) వద్దకు పంపించేశారు. అబూ హురైరా ఖైబర్‌కు చేరి దైవప్రవక్త (స)గారి దర్శనం చేసుకున్నారు (అప్పటికే ఖైబర్ జయించబడింది). దైవప్రవక్త (స) ముస్లిము లతో మాట్లాడి ఆయనకు, ఆయన వెంట వచ్చిన వారికి కూడా విజయధనాన్ని పంచిపెట్టారు.

## యూదులకు మునాఫిక్‌ల సహాయం

ఈ సందర్భంగా యూదులకు వెన్నుదన్నుగా మునాఫిక్‌లు ప్రయత్నాలు ప్రారంభించారు. మునాఫిక్‌ల సర్దారు అబ్దుల్లా బిన్ ఉబై, ఖైబర్ యూదులకు, "ముహమ్మద్ మీపై దాడి చేయడానికి వస్తున్నాడు, కాబట్టి జాగ్రత్తగా ఉండండి, యుద్ధం కోసం సమాయత్తమవ్వండి భయపడకండి. ఎందుకంటే మీ సైనికుల సంఖ్య, యుద్ధ సామగ్రి ముహమ్మద్ మరియు ఆయన అనుచరుల కంటే పెద్దది. ప్రస్తుతం వారి వద్ద ఏదీ లేదు. ఆయుధాలు కూడా చాలా తక్కువ" అని సమాచారం పంపించాడు.

ఈ వార్త విన్న ఖైబర్ ప్రజలు, కనానా బిన్ అబిల్ హుఖైఖ్ మరియు హౌజా బిన్ ఖైస్‌ను బనూ గత్ఫాన్ వారి వద్దకు సహాయార్థం పంపించడం జరిగింది. ఎందుకంటే బనూ గత్ఫాన్ తెగవారు యూదులకు మిత్రపక్షం మరియు ముస్లిములకు విరోధులు. దీనికితోడు యూదులు, వారే గనక ముస్లిములపై విజయం సాధిస్తే ఖైబర్ పంటలో సగభాగం వారికి అప్పచెబు తామన్న భరోసా కూడా ఇచ్చారు.

## ఖైబర్ మార్గం

దైవప్రవక్త (స) ఖైబర్‌కు వెళుతూ 'జబ్లెఇస్ర్'ను దాటి, వాదియె సహబా (సహబా లోయ) గుండా ప్రయాణం సాగించారు. ఆ తరువాత రజీ అనే లోయలోనికి వచ్చి చేరారు. (కాని ఈ రజీ, అజ్ల్ మరియు కారా వారి కుట్ర మూలంగా బనూ లహియ్యాన్ చేతిలో ఎనమండుగురు సహాబాలు చంపబడిన రజీ కాదు).

https://teluguislam.net



రజీ నుండి బనూ గత్ఫాన్ నివాసం కేవలం ఒక పగలు ఒక రాత్రి ప్రయాణ దూరంలో ఉంది. అప్పటికే బనూ గత్ఫాన్ యూదుల సహాయం కోసం ఖైబర్‌కు బయలుదేరి ఉన్నారు. అయితే బయలుదేరి కొంత దూరం వెళ్ళారో లేదో, వెనుక వైపు పెద్ద గొడవ వినబడింది. ముస్లిములు తమ భార్యాపిల్లలు, పశువులపై దాడి చేశారేమో అని తలచి వెనుకకు మరలి వెళ్ళిపోయారు. ఇలా ఖైబర్‌కు వెళ్ళే మార్గంలో ముస్లిములకు ఎలాంటి అడ్డంకి లేకుండాపోయింది.

దైవప్రవక్త (స) సైనిక పటాలానికి మార్గం చూపించడానికి నియమించ బడిన ఇద్దరు నిపుణుల్ని పిలిపించారు. అందులో ఒకరి పేరు హుసైల్. వీరిద్దరితో, ఖైబర్‌కు ఉత్తరం వైపు నుండి అంటే, మదీనా వైపు నుండి కాకుండా సిరియా వైపు నుండి ఖైబర్‌లో ప్రవేశించే సరియైన మార్గం ఏదో తెలియజేయ మని అడిగారు. ఈ యుద్ధవ్యూహం ద్వారా యూదులు సిరియా వైపు పారి పోకుండా, మరో వైపు బనూ గత్ఫాన్ మరియు యూదుల నడుమకు వచ్చి గత్ఫాన్ వైపు నుండి ఎలాంటి సహకారం అందకుండా చేయడం ప్రవక్త (స)గారి యుద్ధచాతుర్యం.

వారిలో ఓ మార్గదర్శకుడు దైవప్రవక్త(స)తో అలాంటి మార్గం గుండానే తీసుకొని వెళతానని మాట ఇచ్చాడు. అతను సైనిక పటాలానికి ముందు నడుస్తూ ఓ చోటకు చేరాడు. అది అనేక మార్గాల కూడలి. అక్కడికి చేరిన తరువాత అతడు, "దైవప్రవక్తా (స)! తమరు వీటిలో ఏ మార్గాన్నయినా ఎంచుకోండి. వీటన్నిటి ద్వారా తమరు గమ్యాన్ని చేరుకోగలరు" అన్నాడు. ఒక్కొక్క మార్గం పేరేమిటో చెప్పు అని అడగగా అతను, ఓ మార్గం పేరు 'హజ్న్' (దుఃఖపూరితమైనది) అన్నాడు. ప్రవక్త దాన్ని అనుసరించ నిరాక రించగా, అతను రెండో మార్గం పేరు 'షాష్' (కడగండ్లతో కూడుకున్నది) అని చెప్పాడు. దైవప్రవక్త (స) దాన్నీ వదిలేశారు. మూడో మార్గం పేరు 'హాతిబ్' (కట్టెలు కొట్టేవాడు) అని అనగా దాన్ని అనుసరించడానికీ నిరాకరించారాయన. తదుపరి హుసైల్ ఇక మిగిలిపోయింది ఓ మార్గమే అని చెప్పాడు. హజ్రత్ ఉమర్ (ర) అందుకొని దాని పేరు ఏమిటీ? అని అడగగా, 'మర్‌హబ్' అన్నా డతడు. మహాప్రవక్త (స) ఆ మార్గంపై నడువడానికే ఇష్టపడ్డారు.

https://teluguislam.net



## ప్రయాణంలో జరిగిన కొన్ని సంఘటనలు

1. హజ్రత్ సల్మా బిన్ అకూ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: "మేము దైవప్రవక్త (స) గారి వెంట బయలుదేరాము. అది రాత్రి ఝాము, ఓ వ్యక్తి ఆమిర్‌నుద్దేశించి, "ఆమిర్! నీ కవిత్వాన్ని గానం చేసి వినిపించవూ?" అని అడిగాడు. ఆమిర్ ఓ కవి. ఆయన తన ఒంటెను దిగి తోటివారికి పాటపాడి వినిపించనారంభించారు. ఆ పాట అర్థం ఇలా ఉంది:

"ఓ అల్లాహ్! నీవే లేకపోతే మేము రుజుమార్గాన్ని పొందేవారం కాదు. దానధర్మాలు చేసేవారం కాదు. నమాజు చేసేవారం కాదు. మమ్మల్ని మేము నీకు అర్పించుకున్నాము. నీ భయభీతులు కలిగి ఉన్నంత వరకు మమ్మల్ని మన్నిస్తూ ఉండు. మేము (నీ మార్గంలో) ఎవరినైనా ఢీకొంటే మాకు స్థయిర్యం కలుగజెయ్యి. మాపై శాంతి కురిపించు. మమ్మల్ని ఎవరైనా సవాలు విసిరి నిలువరిస్తే మేము దృఢంగా నిలబడతాము. మా సవాలుపై ప్రజలు నమ్మకం కలిగి ఉన్నారు."

ఈ పాట విన్న దైవప్రవక్త (స) ఎవరా పాటపాడిన వ్యక్తి? అని అడిగారు. ఈయన ఆమిర్ బిన్ అకూ అని బదులిచ్చారు సహచరులు. ఆయన్ని అల్లాహ్ కరుణించుగాక అని దైవప్రవక్త (స) దీవించగా, ఓ వ్యక్తి, అయితే, ఆయన అమరగతి నొందడం ఖాయం అని అనేశాడు కూడా. ప్రవక్త (స) ఇప్పటి వరకు ఆ మాట మాకుచెప్పలేదేమిటీ? అని అన్నాడు.[2]

(యుద్ధ సమయంలో) దైవప్రవక్త (స) ఓ వ్యక్తి గురించి ప్రత్యేకంగా కరుణించమని అల్లాహ్‌ను వేడుకుంటే అతను అమరగతి నొందుతాడన్న విషయం సహాబాలకు తెలుసు.[3] ఈ సంఘటనే ఖైబర్ యుద్ధ సమయంలో హజ్రత్ ఆమిర్ (ర) విషయంలో జరిగింది. (ఆ కారణంచేతనే, దైవప్రవక్త (స) ఆయన వయస్సు పెరగాలని ఎందుకు దుఆ చేయలేదు, మేము ఆయన కవిత్వాన్ని మరింత ఆస్వాదించేవారం కదా! అని అనుకోవడం కూడా జరిగింది.

2. ఖైబర్‌కు మరీ చేరువలో మహాప్రవక్త (స) సహ్బా లోయలో అస్ర్ నమాజు చేశారు. తినుబండారాలను తెప్పిస్తే కేవలం 'సత్తూ' (ప్యాల పిండి)

---

2. *సహీ బుఖారి, గజ్వాయె ఖైబర్ అధ్యాయం-2/603; సహీ ముస్లిమ్, గజ్వాయె జీఖరద్ అధ్యాయం-2/115*
3. *సహీహ ముస్లిమ్-2/115*

https://teluguislam.net



తీసుకురావడం జరిగింది. దాన్ని ఆయన ఆదేశం మేరకు ముద్దగా చేయడం జరిగింది. మహాప్రవక్త (స)తో సహా సహాబాలందరూ దాన్ని ఆరగించారు. ఆ తరువాత మగ్రిబ్ నమాజు కోసం లేచి కేవలం నీరు నోటబట్టి పుక్కిలించగా సహాబాలు కూడా దైవప్రవక్త (స)ను అనుసరిస్తూ పుక్కిలించారు. ఆ తరువాత వుజూ చేయకుండానే ఆయన మగ్రిబ్ నమాజు చేశారు.[4] (అంటే అస్ర్ నమాజులో చేసిన వుజూతోనే సరిపెట్టుకున్నారు) ఆ తరువాత ఆయన (స) ఇషా నమాజు చేశారు. [5]

## ఖైబర్ సానువుల్లో ఇస్లామీయ సైన్యం

ఉదయం యుద్ధం జరుగుతుందనగా ఆ రాత్రి ముస్లిములు తమ చివరి రేయి ఖైబర్ దాపున గడిపారు. కాని ఈ విషయం యూదులకు ఏమాత్రం తెలియలేదు. రాత్రి పూట శత్రువుకు దాపుగా వచ్చినా సూర్యోదయం కాక పూర్వం యుద్ధం మొదలుపెట్టడం మహాప్రవక్త (స) సంప్రదాయం కాదు. కాబట్టి పూర్వసంధ్యాసమయంలో (కొంత చీకటిగా ఉన్నప్పుడే) ఆయన ఫజ్ర్ నమాజు చేశారు. ఆ తరువాత ముస్లిములు తమ వాహనాలనెక్కి ఖైబర్ వైపునకు బయలుదేరారు. ఇటు ఖైబర్ ప్రజలు ఆ విషయం తెలియనందున తమ పారలు, గునపాలు పట్టుకొని వ్యవసాయ పనుల కోసం బయలుదేరారు. హఠాత్తుగా ముస్లిం సైన్యాన్ని చూసి భయకంపితులై నగరం వైపునకు పరుగిడుతూ, "దైవసాక్షి! ఇంకేముందీ! ముహమ్మద్ (స) సైన్యం మన మీదకు వచ్చిపడిందని" అరవనారంభించారు. (ఈ దృశ్యాన్ని చూసి) మహాప్రవక్త (స), "అల్లాహు అక్బర్! ఖైబర్ సర్వనాశనం అయింది. "అల్లాహు అక్బర్! ఖైబర్ సర్వనాశనమైంది, మనం ఏ జాతి మైదానంలోనైతే కాలిడుతామో భయభీతులైన ప్రజల ఆ రోజు చెడ్డదే అవుతుంది" అని అన్నారు.[6]

మహాప్రవక్త (స) తన సైన్యాన్ని విడిది చేయించడానికి ఓ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఇది చూసిన హబ్బాబ్ బిన్ మున్జిర్ (ర) దైవప్రవక్త(స)తో ఇలా విన్నవించుకున్నారు.

---

4. *అయ్‌జన్ సహీ బుఖారి 2/603*
5. *ముగాజి, అల్ వాఖిదీ (గజ్వాయె ఖైబర్, పుట.112)*
6. *సహీహ్ బుఖారి, గజ్వాయె ఖైబర్ అధ్యాయం-2/603,604*

https://teluguislam.net



"దైవప్రవక్తా(స)! ఈ ప్రదేశంలో విడిది చేయడానికి దైవం మీకు ఏమైనా ఆదేశం ఇచ్చాడా? లేదా కేవలం తమరు యుద్ధవ్యూహంగా ఈ చోటును ఎంపిక చేసుకున్నారా?"

"లేదు! ఇది కేవలం నా సొంత నిర్ణయం" అన్నారు దైవప్రవక్త (స).

"ఓ దైవప్రవక్తా! ఈ ప్రదేశం నజాత్ కోటకు చాలా దాపుగా ఉంది. ఖైబర్‌కు చెందిన యుద్ధ యోధులు ఈ కోటలోనే ఉన్నారు. వారికి మన పరిస్థితులు ఏమిటో తెలిసిపోతుంది. కాని వారి గురించి మాత్రం మనకు ఏదీ తెలియరాదు, వారి బాణాలు మన మీదకు వచ్చిపడతాయి కాని మన బాణాలు వారి మీదకు వెళ్ళలేవు. వారు రాత్రి పూట చేసే దాడి నుండి కూడా మనం రక్షించుకోలేం. ఇంతేకాదు, ఈ ప్రదేశం ఖర్జూరపు చెట్లతో నిండి ఉంది. దిగువ ప్రదేశం కూడానూ. ఇక్కడి భూమి కూడా రోగాల పుట్ట. కాబట్టి తమరు ఈ లోపాలు లేనటువంటి మరేదైనా ప్రదేశాన్ని ఎన్నుకొని అక్కడ విడిది చేయడానికి ఆదేశమివ్వండి" అని విన్నవించుకున్నారు హబ్బాబ్(ర).

"నీవు ఇచ్చిన సలహా చాలా బాగుంది" అంటూ మహాప్రవక్త (స) మరో ప్రదేశానికి వెళ్ళి విడిది చేశారు.

ఖైబర్ నగరం కనుచూపు మేరకు రాగానే మహాప్రవక్త (స) తమ సైన్యాన్ని ఆగండి అని చెప్పగా సైన్యం ఆగిపోయింది. అక్కడ ఆయన ఈ దుఆ చేశారు.

"ఓ అల్లాహ్! సప్తాకాశాల స్వామీ! వేటినైతే అవి తమ నీడతో కప్పాయో వాటి స్వామీ! సప్త భూమండలాల ప్రభూ! వేటినైతే అవి ఎత్తుకొని ఉన్నాయో వాటి ప్రభూ! షైతానులను మార్గభ్రష్టులుగా చేసిన స్వామీ! మేము నీ నుండి ఈ బస్తీ మేలును, అక్కడి ప్రజల శ్రేయాన్ని, ఇందులో ఉన్న వాటన్నిటి మేలు గురించి నిన్ను అర్థిస్తున్నాం. ఈ బస్తీలోని చెడు నుండి, ఇక్కడి ప్రజల చెడుగు నుండి, ఈ బస్తీలో ఉన్నవాటి చెడుగు నుండి నీ శరణు వేడు తున్నాము."

ఆ పిదప "పదండి ముందుకు" అంటూ అక్కడి నుంచి కదిలారు.[7]

---

7. ఇబ్నె హష్షామ్-2/329

https://teluguislam.net



## యుద్ధ సన్నాహం-ఖైబర్ కోటలు

ఖైబర్ సరిహద్దుల్లోనికి చేరిన రాత్రే మహాప్రవక్త (స), "రేపు నేను జెండాను ఓ వ్యక్తి చేతికి ఇవ్వబోతున్నాను. అతను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను ప్రేమించేవాడు, ఆయనంటే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు మహా ఇష్టం" అన్నారు. తెల్లారగానే సహాబా (ర) అందరూ దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరయ్యారు. ప్రతి వ్యక్తీ ఆ జెండా తనకే దక్కాలనే ఆశిస్తున్నాడు. మహాప్రవక్త (స) అడిగారు "అలి ఇబ్నె తాలిబ్ ఎక్కడా?" అని.

"ఆయనకు కళ్ళు కలిగాయి"[8] అన్నారు సహాబా సమాధానంగా.

"ఆయన్ను పిలువండి" అన్నారు మహాప్రవక్త (స).

ఆయన్ను పిలుచుకురాగా దైవప్రవక్త (స) తమ లాలాజలాన్ని ఆయన కళ్ళకు పెట్టి దుఆ చేయగా ఆయనకు వెంటనే స్వస్థత చేకూరింది. కళ్ళకలక ఏమీ లేకుండా పోయింది. ఆ తరువాత జెండాను ఆయన చేతికి అందించడం జరిగింది. జెండా చేతబట్టి హజ్రత్ అలీ దైవప్రవక్త (స)తో,

"ఓ అల్లాహ్! నేను వారంతా మాలా మారిపోయేటంత వరకు వారితో పోరాడుతాను" అనగా,

"ధీమాగా యుద్ధ మైదానానికి వెళ్ళి వారికి ఇస్లామ్ సందేశాన్ని ఇవ్వు. ఇస్లామ్ ధర్మంలో అల్లాహ్ హక్కులేమిటో వారికి తెలియజెయ్యి. దైవసాక్షి! నీ ద్వారా ఒక్క వ్యక్తికి అయినా రుజుమార్గం లభిస్తే, అది నీ కోసం ఎర్ర ఒంటెలు పొందడం కన్నా ఎంతో మేలైనది" అన్నారు దైవప్రవక్త (స).[9]

ఖైబర్ ప్రజలు రెండు మండలాల్లో విభజించబడి ఉన్నారు. ఒక మండలంలో ఈ క్రింది అయిదు కోటలున్నాయి.

1. హిస్న్ నాయిమ్, 2. హిస్న్ సఅబ్ బిన్ ముఆజ్, 3. హిస్న్ జుబైర్ కోట, 4. హిస్న్ అబీ, 5. హిస్న్ నజార్ (హిస్న్ అంటే కోట అని అర్థం).

వీటిలో మొదటి మూడు కోటలకు సంబంధించిన ప్రాంతం 'నజాత్'గా పిలువబడేది. మిగతా రెండు కోటలకు సంబంధించిన ప్రాంతం 'షిక్' పేరున ప్రఖ్యాతిగాంచింది.

---

8. *ఈ కళ్ళకలక వలననే ఆయన వెనుకబడి ఉన్నారు. చివరగా ప్రవక్త (స) చేరుకోగలిగారు*

9. *సహీ బుఖారి, గజ్వయె ఖైబర్-2/605, 606*

https://teluguislam.net



ఖైబర్ జనసంఖ్యకు సంబంధించిన రెండవ మండలం 'కతైబా' అనబడేది. ఇందులో కేవలం మూడు కోటలు మాత్రమే ఉన్నాయి.

1. హిస్న్ ఖముస్ (ఇది బనూ నజీర్ వంశానికి చెందిన అబుల్ హుఖైఖ్ కోట), 2. హిస్న్ వతీహ్, 3. హిస్న్ సలాలమ్.

ఈ ఎనిమిది కోటలే కాకుండా ఖైబర్‌లో మరి కొన్ని కోటలు గఢులు కూడా ఉన్నాయి. కాని అవన్నీ చిన్నవే. శక్తిలోను, సంరక్షణలోనూ అవి పై కోటలకు సరితూగేవి కావు.

యుద్ధం విషయానికొస్తే అది మొదటి మండలంలోనే జరిగింది. రెండో మండలంలోని మూడు కోటల్లో యోధులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ యుద్ధం చేయకుండానే వారు ఆ కోటలను ముస్లిములకు అప్పగించేశారు.

## యుద్ధం ప్రారంభం - నాయిమ్ కోట కైవసం

పైన చెప్పిన ఎనిమిది కోటల్లో మొట్టమొదటగా నాయిమ్ కోటపైన్నే దాడి జరిగింది. ఎందుకంటే ఈ కోట దాని ఉనికి, యుద్ధ నీతి ప్రకారం యూదుల మొదటి రక్షణ శ్రేణిలోనిది. ఈ కోట మర్‌హబ్ అనే పేరుగల యూద యోధుని కోట. ఇతడు "వేయి మందికి సమానమైన బలాఢ్యుడు" అని చెప్పుకోవడం జరిగేది.

హజ్రత్ అలి బిన్ అబీ తాలిబ్ (ర) ముస్లిముల సైన్యాన్ని వెంటబెట్టు కొని ఆ కోట ముందుకు వెళ్ళారు. యూదులకు ఇస్లామ్ సందేశాన్ని వినిపించి దాని వైపునకు ఆహ్వానించగా వారు నిరాకరించారు. తమ రాజు మర్‌హబ్ నేతృత్వంలో ముస్లిములతో యుద్ధం చేసే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చి నిలిచారు. యుద్ధరంగంలోకి దూకి మొదట మర్‌హబ్ ఒంటరి పోరాటం కోసం సవాలు విసిరాడు. ఆ తీరును హజ్రత్ సల్మా బిన్ అకూ ఇలా వర్ణిస్తున్నారు.

"మేము ఖైబర్‌కు చేరగా వారి రాజు మర్‌హబ్ తన కరవాలాన్ని చేతబట్టి నిక్కుతూ నీల్గుతూ, యుద్ధజ్వాలలు ఎగిసే సమయంలో, నేను మర్‌హబ్‌ను, ఆయుధధారుణ్ణయి ధైర్యంగా పోరాడుతానని, అనుభవం గల యోధుణ్ణి అన్న విషయం ఖైబర్ ప్రజలకు బాగా తెలుసు" అంటూ ముందుకొచ్చి నిలిచాడు.

https://teluguislam.net



అతనిని మార్కొనడానికి నా పినతండ్రి ఆమిర్ ముందుకొచ్చారు. ఆయన అతనితో ఇలా అన్నారు.

"నేను ఆమిర్‌ను, ఆయుధధారుణ్ణి, బలవంతుణ్ణి, యోధుణ్ణి అన్న విషయం ఖైబర్ ప్రజలు బాగా ఎరుగుదురు."

అనంతరం ఆ ఇరువురు ఒకరిపైనొకరు ఖడ్గ ప్రహారాలు ప్రారంభించారు. మర్‌హబ్ కరవాలం నా పినతండ్రి ఢాలులో గ్రుచ్చుకున్నది. ఆమిర్ అతణ్ణి క్రింది నుంచి కొట్టబోయారు. కాని ఆయన కరవాలం పొట్టిది అయినందు వలన, ఆ యూదుని శీలమండపై విసిరారు. కరవాలం పిడి తిరిగి వచ్చి ఆయన మోకాలికి తగిలింది. చివరికి ఆ గాయంతోనే ఆయన అమర గతిని పొందారు. దైవప్రవక్త (స) తన రెండు వ్రేళ్ళను కలిపి చూయిస్తూ, "ఈయనకు రెట్టింపు ప్రతిఫలం దక్కుతుంది. ఆయన గొప్ప ధైర్యవంతుడైన ముజాహిద్. బహుశా ఈ అరేబియాలోనే అలాంటి అరబ్బు లేడేమో!" అని అన్నారు.[10]

ఎలాగైతేనేమి, హజ్రత్ ఆమిర్ గాయపడిన తరువాత మర్‌హబ్‌ను ఎదుర్కోడానికి హజ్రత్ అలి (ర) వచ్చారు. ఆయన అప్పుడు ఈ పద్యపాదాలను వల్లించారు.

"నేను ఎవరిననుకున్నావు? నా తల్లి నా పేరు హైదర్ (పులి)గా పెట్టారు. అడవి పులిలా భయంకరుణ్ణి. కొలపాత్ర 'సాఅ' కు బదులు నా బల్లెంతో నిన్ను కొలువగలను."

ఆ తరువాత మర్‌హబ్ తలపై తన కరవాలంతో వ్రేటువేయగా అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అలా హజ్రత్ అలి (ర) చేతుల మీదుగా విజయం లభించినట్లయింది.[11]

యుద్ధం జరిగేటప్పుడు హజ్రత్ అలి (ర) యూదుల కోట దాపుకు

---

*10. సహీహ్ ముస్లిమ్, ఖైబర్ యుద్ధ అధ్యాయం-2/122, గజ్వాయె జీఖరద్ అధ్యాయం వగైరా-2/115; సహీ బుఖారి గజ్వాయె ఖైబర్ అధ్యాయం-2/603.*

*11. మర్‌హబ్‌ను చంపిన వారెవరూ? అన్న విషయంలో విభేదాలున్నాయి. అదే కాకుండా అతను చనిపోయిందెప్పుడు? కోట స్వాధీనమైనదెప్పుడు? అన్న విషయంలోనూ గట్టి భేదాభిప్రాయాలున్నాయి. సహీ షైన్‌లోని ఉల్లేఖనాల సందర్భాలలోను కొంత అభిప్రాయభేదం ఉంది. మేము పైన చెప్పినదంతా సహీహ్ బుఖారి ఉల్లేఖనం సందర్భాన్ని దృష్టిలో ఉంచుకునే చెప్పడం జరిగింది.*

https://teluguislam.net



చేరినప్పుడు ఓ యూదుడు ఆ కోటపై నుండి తొంగిచూసి నీవెవరవు? అని అడిగాడు. సమాధానంగా హజ్రత్ అలి (ర),

"నేను అలీని" అన్నారు. ఆ పేరు వినడంతోనే ఆ యూదుడు, "ఆ గ్రంథం సాక్షి! ఏదైతే మూసా (అ.స.)పై అవతరించిందో, మీరే ఔన్నత్యాన్ని పొందుతారు" అని వెళ్ళిపోయాడు.

ఆ తరువాత మర్‌హబ్ తమ్ముడు యాసిర్, "నాతో తలపడే శక్తి ఎవరికుంది?" అని సవాలు విసురుతూ ముందుకు వచ్చాడు. ఈ సవాలును స్వీకరించి హజ్రత్ జుబైర్ (ర) యుద్ధ మైదానంలోనికి దిగారు. అది చూసిన ఆయన తల్లిగారు హజ్రత్ సఫియా (ర), "దైవప్రవక్తా! నా కుమారుడు చంపి వేయబడతాడా?" అని ఆందోళన పడుతూ అడిగారు.

"లేదు! నీ కుమారుడే అతణ్ణి చంపేస్తాడు" అన్నారు దైవప్రవక్త (స). అలాగే జరిగింది. హజ్రత్ జుబైర్(ర) యాసిర్‌ను హతమార్చారు.

ఆ తరువాత నాయిమ్ కోట దగ్గర భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ప్రఖ్యాత యూద యోధులు హతులైపోయారు. మిగిలిన యూదులకు నిరోధించే శక్తి ఉడిగిపోయినందున ముస్లిముల దాడిని ఎదుర్కోలేక పోయారు. కొన్ని ఆధారాల్లో ఈ యుద్ధం ఎన్నో రోజుల వరకు కొనసాగిందని, ముస్లిములకు గట్టి ప్రతిఘటన ఎదురైందని ఉంది. అయినా యూదులు ముస్లిములను ఓడించలేక నిరాశా నిస్పృహలతో వెనక్కు మళ్ళి సఅబ్ కోటలోనికి వెళ్ళిపోయారు. ముస్లిములు నాయిమ్ కోటను వశపర్చుకున్నారు.

## సఅబ్ బిన్ ముఆజ్ కోటను జయించడం

నాయిమ్ కోట తరువాత సఅబ్ కోట తన బలం, రక్షణ రీత్యా రెండవ పటిష్టమైన కోట. ముస్లిములు హజ్రత్ హుబ్బాబ్ బిన్ మున్జిర్ అన్సారీ నాయకత్వంలో ఈ కోటపై దాడి చేశారు. మూడు రోజుల వరకు దాన్ని తమ దిగ్బంధంలో ఉంచుకోవడం జరిగింది. మూడో రోజున మహాప్రవక్త (స) ఈ కోటను జయించేందుకు ప్రత్యేకంగా దుఆ చేశారు.

ఇబ్నె ఇస్‌హాక్ కథనం ఇలా ఉంది:

"అస్లమ్ తెగకు చెందిన ఓ శాఖ 'సహెమ్' మనుషులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు:

https://teluguislam.net



"ఓ ప్రవక్తా! మేము బాగా అలసిపోయాము. మా వద్ద ఏమీ మిగల్లేదు." దానికి దైవప్రవక్త (స) ఇలా దుఆ చేశారు;

"ఓ అల్లాహ్! వీరి పరిస్థితి ఏమిటో నీవు బాగా ఎరుగుదువు. వీరి శక్తి ఉడిగిపోయిన విషయం కూడా నీకు తెలుసు. వారికి ఇవ్వడానికి నా దగ్గరా ఏదీ లేదు. కాబట్టి ఎంతో ప్రయోజనకారి అయిన, సమృద్ధమైన ఆహార పదార్థాలు, క్రొవ్వు గల ఓ కోట విజయాన్ని వీరికి సంప్రాప్తం చెయ్యి."

ఆ ప్రార్థన తరువాత ముస్లిములు ఆ కోటపై విరుచుకుపడ్డారు. అల్లాహ్ సఅబ్ బిన్ ముఆజ్ కోట విజయాన్ని వారికి ఇచ్చాడు. ఖైబర్‌లో ఆహార పదార్థాలు, క్రొవ్వుగల మరే కోట అంతకంటే లేదు.[12]

దైవప్రవక్త (స) దుఆ చేసి ఆ కోటపై దాడి చేయడానికి పిలుపునివ్వగా దాడి చేసే వారిలో బనూ అస్లమ్ వారే ముందంజలో ఉన్నారు. ఈ కోట ముందు కూడా వ్యక్తిగత యుద్ధం, సామూహిక యుద్ధం జరిగింది. అదే రోజు సూర్యాస్తమయానికి ముందే కోట జయించబడింది. అక్కడ ముస్లిము లకు కొన్ని పెద్ద పెద్ద రాళ్ళు విసిరే వరిసేలలూ, దబాబాలు[13] లభించాయి.

ఇబ్నె ఇస్హాక్ కథనంలో, తీవ్రమైన ఆకలి బాధ యొక్క ప్రస్తావన ఉంది. ఈ ఆకలి బాధను తాళలేక సైనికులు (విజయం లభించగానే) గాడిద లను జిబహ్ చేసి వాటి మాంసాన్ని వండనారంభించారు. దైవప్రవక్త (స)కు ఈ విషయం తెలిసి, పెంపుడు గాడిదల మాంసం తినకుండా వారిని వారిం చారు.

## జుబైర్ కోట విజయం

నాయిమ్ కోట, సఅబ్ కోట వశమైన తరువాత యూదులు నజాత్ కోటలన్నిటినీ వదిలేసి జుబైర్ కోటలో తలదాచుకున్నారు. ఇది సురక్షితమైన పర్వతంపై నిర్మించబడిన కోట. కోటకు చేరడానికి మార్గం బహుదుర్గమంగా ఉంది. అశ్వారూఢులుగాని, పదాతిదళ సైనికులుగాని అక్కడికి చేరడం బహు

---

12. ఇబ్నె హష్షామ్-2/332
13. కట్టెతో తయారైన సురక్షితమైన వాహనంలాంటి ఓ పెట్టె. ఇందు చొరబడి చాలా మంది శత్రువు ప్రహారాల నుండి రక్షణ పొందుతూ కోట గోడ వరకు వెళ్ళి అందు రంధ్రం చేయడానికి పనికొచ్చే ఓ సాధనం. వాటినే దబాబా అంటారు. ఇప్పుడు యుద్ధ టాంకుల్ని దబాబాలుగా పిలుస్తున్నారు.

https://teluguislam.net



కష్టం. మూడు రోజుల వరకు దాన్ని దిగ్బంధించి అక్కడనే ఉండిపోవలసి వచ్చింది. ఆ తరువాత ఓ యూదుడు వచ్చి దైవప్రవక్త(స)తో, "ఓ అబుల్ ఖాసిం! మీరు ఒక నెల వరకు ఇక్కడ దిగ్బంధం సాగించినా వారికి జరిగే నష్టం ఏమీ ఉండదు. కాని వారు ఏ ఊటబావుల్లో నుండి అయితే నీరు తీసుకుంటారో, అవి క్రింద ఉన్నాయి. వీరు రాత్రిపూట బయటకు వచ్చి నీరు త్రాగి వెడుతూ ఉంటారు. మీరే గనక వారు నీరు త్రాగకుండా, తీసుకొని పోకుండా అడ్డుకుంటే దాసోహం అనక మానరు." ఈ వార్త అందగానే దైవప్రవక్త(స) వారి నీటిని ఆపేశారు. ఆ తరువాతగాని యూదులు బయటకు వచ్చి యుద్ధంలో పాల్గొనలేదు. ఈ యుద్ధంలో ఎందరో ముస్లిములు హతుల య్యారు. పదుగురు యూదులు కూడా చనిపోయారు. కాని కోట వశమై పోయింది.

## కైవసం అయిన 'అబీ' కోట

జుబైర్ కోట కోల్పోయిన యూదులు హిస్న్ అబీ (అబీ కోట) లోనికి వెళ్ళి రక్షణ పొందారు. ముస్లిములు ఆ కోటను కూడా దిగ్బంధించారు. ఈసారి ఇద్దరు యూద యోధులు ఒకరి తరువాత ఒకరు వ్యక్తిగత పోరాటం కోసం సవాలు విసురుతూ యుద్ధరంగంలోకి దుమికారు. ఆ ఇరువురు కూడా ముస్లిముల చేతిలో ప్రాణాలొదలడం జరిగింది. రెండో యూదుణ్ణి చంపిన వారు ఎర్ర తలపాగ చుట్టుకున్న ప్రఖ్యాత యోధుడు అబూ దుజానా సమాక్ బిన్ ఖర్షా అన్సారి (ర) గారే. ఆయన ఆ యూదుణ్ణి చంపి ఎంతో చురుకుగా వారి కోటలో చొరబడ్డారు. వారి వెంటే ఇస్లామీయ సేన కూడా ఆ కోటలో ప్రవేశించింది. లోపల కొంత సమయం వరకు ఘోర యుద్ధం జరిగింది. కాని ఆ తరువాత యూదులు ఆ కోట నుండి పారిపోనారంభించారు. చివరకు అందరూ పారిపోయి 'నజార్' కోటలోకి చేరుకున్నారు. ఇది ఖైబర్‌లోని మొదటి అర్ధ భాగానికి (అంటే మొదటి మండలం) చెందిన చిట్టచివరి కోట.

## జయించబడిన 'నజార్' కోట

ఈ కోట ఆ ప్రాంతానికి చెందిన పటిష్టమైన కోట. ముస్లిములు వారి శక్తినంతా ఉపయోగించినా ఈ కోటలో ప్రవేశించలేరనేది యూదుల ధీమా. కాబట్టి వారు తమ స్త్రీలు, పిల్లలతో సహా ఆ కోటలోనే రక్షణ పొందడానికి

https://teluguislam.net



ఏర్పాట్లు చేసుకొని ఉన్నారు. ఇప్పటి వరకు నాల్గు కోటల్లోని ఏ కోటలో కూడా వారు పిల్లలను, స్త్రీలను ఉంచలేదు.

ముస్లిములు ఆ కోటను కూడా ఎంతో పకడ్బందీగా దిగ్బంధించారు. యూదులపై బాగా వత్తిడిని తెచ్చారు. కాని ఈ కోట ఓ ఎత్తయిన, సురక్షితమైన కొండపై కట్టబడి ఉండడం మూలంగా అందులో ప్రవేశించడానికి మార్గం ఏదీ అగుపడలేదు ముస్లిములకు. అటు యూదులకు కోట నుండి బయటకు వచ్చి ముస్లిములను ఎదుర్కోడానికి ధైర్యం చాలడం లేదు. అయితే బాణాల వర్షం కురిపిస్తూ, రాళ్ళు విసురుతూ వారిని అడ్డగిస్తున్నారు.

ఈ కోటను వశపర్చుకోవడం ముస్లిములకు కష్టసాధ్యం అని అనిపించగా, దైవప్రవక్త (స), మిన్జనీక్‌లు (పెద్ద రాళ్ళను విసిరే వడిసెలలు) ఉపయోగించమని ఆదేశం ఇచ్చారు. ముస్లిములు కొన్ని గుండ్లను ఆ కోట పైకి విసరివేయగా ఆ కోట గోడల్లో పగుళ్ళు ఏర్పడి మార్గం లభించింది. ఆ తరువాత కోట లోపల భీకర యుద్ధం జరిగింది. యూదులకు ఘోర పరాజయం ఎదురైంది. తక్కిన కోటల నుండి పారిపోయి ఎలా ఆత్మరక్షణ చేసుకున్నారో యూదులు ఈ కోట నుండి కూడా అలానే జారుకున్నారు. పారిపోయేటప్పుడు వారు తమ స్త్రీలను, పిల్లలను కూడా తీసుకువెళ్ళడం మరచిపోయారు. వారిని ముస్లిముల దయాదాక్షిణ్యాలపైన్నే వదిలేశారు.

ఈ పటిష్టమైన కోట విజయం తరువాత ఖైబర్ యొక్క మొదటి సగభాగం (నజాత్ మరియు షిక్ ప్రాంతం) గెలుచుకున్నట్లయింది. ఈ ప్రాంతంలో మరికొన్ని చిన్న చిన్న కోటలు కూడా ఉన్నాయి. కాని ఈ కోట చేజారిపోయిన తరువాత యూదులు ఆ మిగిలిన కోటల్ని కూడా ఖాళీ చేసి ఖైబర్‌కు చెందిన రెండవ మండలం 'కతీబా' వైపునకు పారిపోయారు.

## జయించబడిన ఖైబర్ రెండవ సగభాగం

నజాత్ మరియు షిక్ ప్రాంతం జయించబడిన తరువాత మహాప్రవక్త (స), కతీబా, వతీష్ మరియు సలాలిమ్ ప్రాంతం వైపునకు మళ్ళారు. 'సలాలిమ్' బనూ నజీర్‌కు చెందిన ప్రముఖ యూదుడు 'అబుల్ హుఖైబ్'కు చెందిన కోట. ఇటు నజాత్ మరియు షిక్ ప్రాంతాల నుండి పారిపోయి వచ్చిన యూదులందరూ ఇక్కడికి చేరి తలదాచుకుని పటిష్టమైన పహరా కాస్తున్నారు.

https://teluguislam.net



ఇక్కడున్న మూడు కోటల్లో ఏ కోటలోనైనా యుద్ధం జరిగిందా లేదా అనే విషయంలో యుద్ధాల చరిత్ర రాసిన చరిత్రకారుల్లో అభిప్రాయ భేదాలున్నాయి. ఇబ్నె ఇస్‌హాక్ కథనంలో, ఖమూస్ కోటను జయించడానికి యుద్ధం చేయవలసి వచ్చిందనే వివరణ మాత్రం ఉంది. దీని సందర్భాన్ని పురస్కరించుకొని చూడగా ఈ కోట కేవలం యుద్ధం చేసే గెలుచుకోవడం జరిగిందని చెప్పవచ్చు. ఇక్కడి యూదులు లొంగిపోవడానికి ఎలాంటి ప్రతిపాదనలు పెట్టలేదు.[14]

కాని వాఖిదీ కథనం ప్రకారం, ఇక్కడి మూడు కోటలు కూడా చర్చల ద్వారా యూదులు, ముస్లిములకు కైవసం చేసినట్లు ఉంది. బహుశా వారు ఖమూస్ కోటను అప్పగించడానికి కొంత యుద్ధం చేయవలసివచ్చి ఉండవచ్చు. ఆ తరువాతనే సంప్రదింపులు జరిపి కోటను అప్పగించారేమో. అయితే తక్కిన రెండు కోటలు మాత్రం ఎలాంటి యుద్ధం చేయకుండానే ముస్లిములకు అప్పగించడం జరిగింది.

దైవప్రవక్త (స) కతీబాకు అరుదెంచిన తరువాత ఆ ప్రాంతం (కతీబా) ప్రజలను దిగ్బంధంలోనికి తీసుకోవడం జరిగింది. ఈ దిగ్బంధం పదునాల్గు రోజులు కొనసాగింది. యూదులు మాత్రం తమ కోటలో నుండి బయటికి రావడం లేదు. చివరికి దైవప్రవక్త (స) మిన్జనీక్‌లను సిద్ధం చేస్తూ ఉండగా యూదులకు తమ వినాశం గురించి పూర్తి నమ్మకం ఏర్పడింది. అప్పుడుగాని వారు దైవప్రవక్త (స)తో సంధి సంప్రదింపులకు దిగలేదు.

## సంధి సంప్రదింపులు

మొదట అబుల్ హుఖైఖ్, దైవప్రవక్త (స) వద్దకు సందేశం పంపిస్తూ, "నేను మీ దగ్గరకు వచ్చి మాట్లాడదలుచుకున్నాను" అన్నాడు. దైవప్రవక్త (స) రావచ్చుననే అనుమతి నొసగగా, అతను సంధి షరతులతో మహాప్రవక్త (స) దగ్గరికి వచ్చి ఈ క్రింది సంధి షరతును ప్రతిపాదించాడు.

దాని ప్రకారం, కోటలో ఉన్న సైన్యాన్ని చంపకుండా ఉండాలి. వారి భార్యాపిల్లలు వారివద్దే ఉంటారు (అంటే వారిని బానిసలుగా చేయకూడదు). కాగా వారంతా తమ భార్యాపిల్లల్ని వెంటబెట్టుకొని ఖైబర్ భూభాగం నుండి

14. చూడండి, ఇబ్నె హష్షామ్-2/331, 336, 337

https://teluguislam.net



వెళ్ళిపోతారు. తమ ఆస్తిపాస్తులను, ధనసంపదలను, తోటల్ని, భూముల్ని వెండిబంగారాలను, గుర్రాలను, కవచాలను వగైరాలను దైవప్రవక్త (స)కు అప్పగిస్తారు. కేవలం వారు కట్టుబట్టలతో బయటకు వెళ్ళిపోతారు.[15] దానికి దైవప్రవక్త (స), మీరు ఏదైనా దాచినట్లయితే దానికి బాధ్యులు మీరే అని చెప్పి యూదులు ప్రవేశపెట్టిన ఈ సంధి షరతులను ఒప్పుకోవడం జరిగింది.[16] ఈ సంధి అయిన పిదప వారు తమ మూడు కోటలు ముస్లిములకు అప్ప జెప్పారు. ఇలా ఖైబర్ విజయం పరిపూర్ణమైపోయింది.

## అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారుల మోసం - వారి హత్య

ఈ సంధికి వ్యతిరేకంగా అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారులు ఓ పెద్ద ధనరాశిని మాయం చేశారు. హుయ్ బిన్ అఖ్తబ్ దాచిపెట్టిన బంగారు నగల తోలు సంచిని మాయం చేశారు. అవి హుయ్ బిన్ అఖ్తబ్, బనూ నజీర్ దేశ బహిష్కరణ జరిగినప్పుడు మదీనా నుండి వెంట తీసుకొనివచ్చిన నగలు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ఇలా ఉంది:

“అబుల్ హుఖైఖ్ కుమారుడు కనానాను మహాప్రవక్త (స) వద్దకు తీసుకురావడం జరిగింది. అతని వద్ద బనూ నజీర్ ధనాగారం ఉండింది. ఆయన (స) అతణ్ణి ఆ ధనాగారం గురించి అడగగా అతను ఆ ధనం గురించి గాని, అది దాచిపెట్టిన స్థలం గురించిగాని తనకు ఏమీ తెలియదు అని నిరాకరించాడు. ఆ తరువాత ఓ యూదుడు వచ్చి, నేను కనానాను రోజూ ఓ పాడుబడిన ప్రదేశంలోనికి వచ్చి పోతూ ఉండగా చూస్తూ ఉండేవాణ్ణి అని చెప్పాడు. ఇది విన్న మహాప్రవక్త (స), కనానాతో, ఒకవేళ ఆ భాండాగారాన్ని మేము నీ నుండి వెలికితీస్తే నిన్ను చంపవచ్చా? అని అడిగారు, అలా జరిగితే తమరు నన్ను చంపవచ్చు అన్నాడు కనానా. మహాప్రవక్త (స) ఆ ధనం ఎక్కడ దాచి ఉంచబడిందో త్రవ్వి చూడండని ఆదేశించగా ఆ ప్రదేశం నుండి కొంత ధనం వెలికివచ్చింది. మిగిలిన ధనం ఎక్కడా? అని

---

15. కాని సునన్ అబూ దావూద్ గ్రంథంలో దైవప్రవక్త (స), ముస్లిముల తరఫున ఖైబర్ నుండి వెళ్ళిపోయేటప్పుడు యూదులు తమ వాహనాలపై ఎంత సొత్తునైతే తీసుకొని వెళ్ళగలరో తీసుకు వెళ్ళమని అనుమతి ఇచ్చినట్లు ఉంది. అబూ దావూద్, ఖైబర్ అధ్యాయం-2/76.
16. జాదుల్ ముఆద్-2/136.

https://teluguislam.net



అడగగా అతడు నాకు తెలియదు అని మళ్ళీ బొంకాడు. ఆ తరువాత మహాప్రవక్త (స) అతనిని హజ్రత్ జుబైర్‌కు అప్పజెబుతూ అతను దాచిన ధనం బయటపడేవరకు అతనిని బాధించమని ఆదేశించారు. హజ్రత్ జుబైర్ అతనిని హింసించగా అతను చెప్పేశాడు. ఆ పిదప అతనిని దైవప్రవక్త (స) మహ్మూద్ బిన్ ముస్లిమాకు అప్పజెప్పగా ఆయన అతని తలను ఖండించారు. (మహ్మూద్ నీడ కోసం నాయిమ్ కోటను ఆనుకొని కూర్చుని ఉండగా అతడు ఆయనపై తిరుగలి బండ పడేసి చంపి ఉన్నాడు.)

ఇబ్నె ఖైమ్, దైవప్రవక్త (స) అబుల్ హుఖైఖ్ ఇద్దరు కుమారుల్ని, వారిద్దరు సొమ్ము దాచారని వారి పినతండ్రి కుమారుడు సాక్ష్యం ఇవ్వగా చంపించారని రాశారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) హుయ్ బిన్ అఖ్తబ్ కుమార్తె సఫియ్యాను ఖైదు చేశారు. ఆమె కనానా బిన్ హుఖైఖ్‌కు భార్యగా ఉన్నారు. అప్పుడామె నవ వధువు.

## విజయ ధన పంపకం

దైవప్రవక్త (స) యూదులను ఖైబర్ నుండి బహిష్కరించాలనుకున్నారు. సంధి షరతుల్లో ఇది కూడా ఓ షరతే. కాని యూదులు దైవప్రవక్త (స)తో, “ఓ ముహమ్మద్ (స)! మమ్మల్ని ఈ భూభాగంలోనే ఉండనివ్వండి. మేము దీన్ని కాపాడుతుంటాము. ఎందుకంటే, మీకంటే మాకే ఎక్కువ తెలుసు దీన్ని గురించి” అని విన్నవించుకున్నారు. ఇటు దైవప్రవక్త (స) వద్ద ఈ భూమిని దున్ని వేయడానికి, పంటలు పండించడానికి చాలినంత మంది బానిసలు కూడా లేరు. అదేకాకుండా సహాబా (ర) ఈ పని చూడడానికి వారి వద్ద సమయం కూడా లేదు. అందుకని అక్కడి పంట పొలాల్లో పండిన పంటను, తోటల ఫలసాయంలో సగం ఇస్తామని, దైవప్రవక్త (స)కు ఇష్టం ఉన్నంత మట్టుకు వారు అక్కడ ఉండి పంటలు పండించుకోవాలని, ఆయన కోరినప్పుడు ఆ ప్రాంతాన్ని వదలివెళ్ళిపోవాలనే షరతుపై ఆ ప్రాంతాన్ని యూదులకు తిరిగి అప్పగించడం జరిగింది. దాని తరువాత హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) ఖైబర్ పంటలు, ఫలసాయం లెక్క చూడడానికి అక్కడ ఉండిపోయారు.

https://teluguislam.net



ఖైబర్‌ను ముప్ఫై ఆరు భాగాలుగా విభజించడం జరిగింది. ఒక్కో భాగాన్ని తిరిగి వంద భాగాలుగా విడగొట్టారు. అలా మొత్తం కలిసి 3600 భాగాలయ్యాయన్న మాట. అందులో సగం అంటే 1800 భాగాలు దైవప్రవక్త (స) మరియు ముస్లిములవి. అందరు ముస్లిముల్లా దైవప్రవక్త (స)కూ ఒక భాగమే వచ్చింది. మిగిలిన 1800 భాగాలు గల రెండవ అర్ధ భాగాన్ని దైవప్రవక్త (స) ముస్లిముల సామూహిక అవసరాల్లో, గడ్డు సమయాల్లో పనికిరావడానికి గాను వేరు చేసి ఉంచబడింది. పద్దెనిమిది వందల భాగాలుగా ఖైబర్‌ను పంచడానికి గల కారణం, అది అల్లాహ్ తరఫున హుదైబియాకు వెళ్ళిన ముస్లిములకు కానుక. అప్పుడు అక్కడ హాజరుగా ఉన్నవారికి, హాజరుగా లేని వారి కోసమూ అన్నమాట. హుదైబియాకు వెళ్ళిన ముస్లిముల సంఖ్య మొత్తం పదునాల్గు వందలు. వారు ఖైబర్‌కు వస్తూ తమ వెంట రెండు వందల గుర్రాలను కూడా తెచ్చారు. గుర్రపు రౌతుకే కాకుండా గుర్రానికి కూడా ఒక భాగం లభిస్తుంది. గుర్రానికి లభించే భాగం రెండంతలు (అంటే ఇద్దరు పదాతులకు సమానమైన భాగం). అందుకని ఖైబర్‌ను పద్దెనిమిది వందల భాగాలుగా విభజించడం జరిగింది. ఇలా రెండు వందల అశ్వారూఢులకు మూడు భాగాల చొప్పున 600 భాగాలు లభించాయి. పన్నెండు వందల పదాతి దళానికి ఒక్కొక్క భాగం చొప్పున 1200 భాగాలు లభించాయి.[17]

సహీహ్ బుఖారీలో హజ్రత్ ఇబ్నె ఉమర్ (ర) గారి ఉల్లేఖనం ద్వారా ఖైబర్‌లో లభించిన విజయ ధనాన్ని అంచనా వేయవచ్చు. ఆయన ఇలా ఉల్లేఖిస్తారు:

"మేము ఖైబర్ జయించనంత మట్టుకు తృప్తిగా భోజనం చేసిన రోజు లేదు." అలాగే హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనంలో, ఖైబర్ జయించబడిన తరువాతగాని మేమనుకున్నాం, ఇక మాకు కడుపునిండా తినడానికి ఖర్జూరాలు లభిస్తాయని.[18]

అంతేకాదు, మహాప్రవక్త (స) మదీనాకు తిరిగి వచ్చిన తరువాత మక్కా నుండి హిజ్రత్ చేసి వచ్చిన ముహాజిర్లకు అన్సారులు ఏ ఖర్జూరపు చెట్లనైతే

17. జాదుల్ ముఆద్-2/137,138 వివరాలతో సహా
18. సహీ బుఖారి-3/603

https://teluguislam.net



ఇచ్చారో ముహాజిర్లు వాటిని వారికి ఇచ్చివేశారు. ఎందుకంటే, ఇప్పుడు వారికి ఖైబర్‌లో ధనం మరియు ఖర్జూరపు చెట్లు లభించాయి కదా![19]

## హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ మరియు అష్‌అరీ సహాబాల రాక

ఈ యుద్ధం సందర్భంగానే హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర) దైవ ప్రవక్త (స)గారి సన్నిధికి హాజరుకావడం జరిగింది. ఆయన వెంట అష్‌అరీ సహాబాలు అంటే, హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (ర) మరియు ఆయన సహచరులూ ఉన్నారు.

హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (ర)గారి కథనం ఇలా ఉంది: "మేము యమన్ దేశంలో ఉండగానే దైవప్రవక్త (స)గారి ప్రాభవం గురించి తెలిసింది. నేను, నా ఇద్దరు సోదరులు, ఇంకా, మా జాతికి చెందిన యాభై మంది అందరం కలసి మా మాతృభూమి అయిన యమన్‌ను వదిలేసి (అంటే హిజ్రత్ చేసి) ఓ పడవనెక్కి దైవప్రవక్త (స) సన్నిధికి హాజరయ్యాము. అయితే మా పడవ మమ్మల్ని నజాషీ చక్రవర్తి రాజ్యం అయిన అబీసీనియాలో విసరి వేసింది. అక్కడ మాకు హజ్రత్ జాఫర్ (ర), ఆయన సహచరులు కలిశారు. ఆయన మాతో, "దైవప్రవక్త (స) మమ్మల్ని ఇక్కడికి పంపించారు. మేము ఇక్కడే ఉండాలని ఆదేశాలిచ్చారు, మీరు కూడా మాతోపాటే ఇక్కడే ఉండి పోండి" అని అన్నారు. మేమందరం అక్కడనే ఉండిపోయాం. మహాప్రవక్త (స) ఖైబర్‌ను జయించిన తరువాతగాని మేము ఆయన సన్నిధికి రాలేదు. దైవప్రవక్త (స) ఆ విజయ ధనంలో మాకూ భాగం పంచిపెట్టారు. మాకు తప్ప ఖైబర్ యుద్ధంలో పాల్గొనని ఏ వ్యక్తికీ భాగం అందలేదు. అదంతా యుద్ధంలో పాల్గొన్న వారి భాగమే. కాని హజ్రత్ జాఫర్ (ర), ఆయన సహచరులు, మా పడవలో ఉన్న వారికి భాగం పంచిపెట్టడం జరిగింది. వారికీ విజయ ధనం నుండి బహూకరించడం జరిగింది."[20]

హజ్రత్ జాఫర్ (ర) దైవప్రవక్త (స) సన్నిధికి చేరగానే దైవప్రవక్త (స) ఆయన్ను ముద్దాడుతూ, "దైవసాక్షి! నాకు ఆనందం కలిగింది జాఫర్ రాక

---

*19. జాదుల్ ముఆద్ -2/148; సహీ ముస్లిమ్-2/96*

*20. సహీహ్ బుఖారి-1/443; ఫత్‌హుల్‌బారి-7/484-487 వరకు*

https://teluguislam.net



వలనా లేదా ఖైబర్ జయించబడినందునా" అనేది నేను చెప్పలేకపోతున్నాను అన్నారు.[21]

వీరిని పిలుచుకురమ్మని దైవప్రవక్త(స) హజ్రత్ అమ్రూ బిన్ ఉమయ్యాను నజాషీ వద్దకు పంపిన విషయం మనకు గుర్తుండే ఉంటుంది. వీరందరిని తమ వద్దకు పంపించమని చెప్పి పంపడం జరిగింది. అప్పుడు నజాషీ వీరిని రెండు పడవల్లోనికి ఎక్కించి పంపాడు. వీరంతా పదహారుగురు. వారి వెంట మిగిలినవారంతా పిల్లలు, స్త్రీలే. తక్కిన వారంతా ఇదివరకే మదీనాకు చేరుకొని ఉన్నారు.[22]

## హజ్రత్ సఫియ్యా (ర)తో వివాహం

హజ్రత్ సఫియ్యా (ర)గారి భర్త కనానా బిన్ అబిల్ హుఖైఖ్ సంధి షరతులు భంగపర్చినందుకు చంపబడిన విషయం మనం ఇదివరకే చెప్పుకున్నాం. హజ్రత్ సఫియ్యా (ర)ను ఖైదు చేసి స్త్రీ ఖైదీల్లోనికి పంపించడం జరిగింది. ఆ తరువాత స్త్రీ బందీలందరినీ ఓ చోట చేర్చగా, హజ్రత్ వహియా బిన్ ఖలీఫా కలబీ (ర) దైవప్రవక్తను, తనకు స్త్రీ బందీల నుండి ఓ స్త్రీ బానిసను ఇప్పించమని అర్థించారు. మహాప్రవక్త (స) ఆయనకు వారిలో నుంచి ఒకరిని తీసుకొమ్మని చెప్పగా, ఆయన సఫియ్యా బిన్తె హుయ్ (హుయ్ కుమార్తె సఫియ్యా)ను ఎంపిక చేసుకున్నారు. ఇది చూసిన ఓ వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, ఓ దైవప్రవక్తా! తమరు బనీ ఖురైజా మరియు బనూ నజీర్ తెగలకు చెందిన మహిళను వహియాకు అప్పజెప్పారేమిటి? ఆమె ఆయనకు తగిన మహిళ కాదు. అప్పుడు దైవప్రవక్త (స) వహియాను సఫియ్యాతో సహా ఇక్కడికి రమ్మని కబురు పంపారు. ఆయన వచ్చిన తరువాత మహాప్రవక్త(స), నీవు బందీల్లో నుండి మరో మహిళను ఎంచుకో అని చెప్పారు. ఆ తరువాత హజ్రత్ సఫియ్యా (ర) ముందు ఇస్లామ్ సందేశాన్ని ఉంచగా ఆమె ఇస్లామ్ ధర్మం స్వీకరించారు. పిదప ఆయన (స) ఆమెను స్వతంత్రురాలుగా చేసి ఆమెతో వివాహమాడారు. ఆమె స్వాతంత్ర్యమే ఆమెకు మహ్రాగా నిర్ణయించడం జరిగింది. మదీనాకు తిరుగు ప్రయాణంలో 'సహ్బా' అనే ప్రదేశానికి చేరి ఆమె ధర్మసమ్మతమయ్యారు. ఆ తరువాత ఉమ్మె

21. జాదుల్ ముఆద్-2/139

22. తారీఖె ఖిజ్రీ-1/128

https://teluguislam.net



సులైమ్ (ర) ఆమెను అలంకరించి రాత్రి ఆయన దగ్గరకు పంపించారు. దైవప్రవక్త (స) వరునిగా ఆమెతో రేయి గడిపారు. మరునాడు ఖర్జూరం, నెయ్యి మరియు సత్తూ (పేలపు పిండి) కలిపి వలీమా విందు భోజనాలు పెట్టారు. మార్గంలో మూడు రోజుల వరకు ఆమె వద్దనే ఉన్నారు.[23] ఈ సందర్భంలోనే ఆమె ముఖంపై ఓ పచ్చని గుర్తు చూశారు మహాప్రవక్త (స). ఇదేమిటీ? అని ప్రశ్నించగా, ఆమె, "దైవప్రవక్తా! తమరు ఖైబర్‌కు రాక పూర్వమే నేను ఓ కలగన్నాను. చంద్రుడు తన స్థానం నుండి దిగి నా ఒడిలో పడినట్లు కలగన్నాను. దైవసాక్షిగా చెబుతున్నాను. నాకు మీ గురించి ఎలాంటి ఊహ కూడా జనించలేదు. అయితే నేను ఈ కలను గురించి నా భర్త (కనానా)కు చెప్పగా, "ఏమిటీ? మదీనాలో ఉన్న ఆ రాజును కోరుకుంటున్నావా?" అని నా చెంప పగిలేటట్లు కొట్టాడు అన్నారు."[24]

## విషపూరితమైన మేక మాంసం

ఖైబర్‌పై విజయం లభించిన తరువాత దైవప్రవక్త (స) ఏకాగ్రచిత్తులై ఉన్నప్పుడు, సలామ్ బిన్ ముష్కమ్ భార్య, జైనబ్ బిన్తె హారిస్ ఆయన వద్దకు వేయించిన ఓ మేకను పంపించింది. దైవప్రవక్త (స) మేక మాంసంలో ఏ భాగాన్ని తినడానికి ఎక్కువ ఇష్టపడతారో అన్న విషయం గురించి ఆమె ఇదివరకే ఆరా తీసి ఉంది. ఆమెకు దైవప్రవక్త (స) 'దస్తా' అనే భాగం అంటే మహా ఇష్టమని తెలిసి అందులో బాగా విషం కలిపింది. తక్కిన మాంసంలోనూ విషం కలిపింది. దాన్ని తీసుకొని మహాప్రవక్త (స) వద్దకు వచ్చి దాన్ని ఆయన ముందు తినమని పెట్టింది. దైవప్రవక్త (స) (తమకు ఇష్టమైన) దస్తాను ఎత్తి ఓ ముక్క నోట్లో పెట్టుకుని నమిలేశారు. కాని మ్రింగే బదులు దాన్ని క్రింద ఊసేశారు. ఇందులో విషం కలిసి ఉందని నాకు ఈ ఎముక చెబుతోంది అంటూ జైనబ్‌ను పిలువనంపారు. ఆమె విషం కలిపానని ఒప్పుకుంది. అలా ఎందుకు చేశావు అని అడగగా మీరు గనుక రాజు అయితే మీ నుంచి మాకు ముక్తి కలుగుతుందని, లేదా మీరే ప్రవక్త అయితే ఈ విషయం మీకు తెలియజేయబడుతుందని చూడడానికే అలా చేశాను అన్నది. మహాప్రవక్త (స) ఆమెను క్షమించి వదిలిపెట్టారు.

---

*23. సహీహ్ బుఖారి-1/54, 2/604, 606; జాదుల్ ముఆద్-2/137*

*24. జాదుల్ ముఆద్-2/137; ఇబ్నె హష్షామ్- 2/336*

https://teluguislam.net



భోజనం చేసేటప్పుడు దైవప్రవక్త (స) వెంట హజ్రత్ బిష్ర్ బిన్ బరా బిన్ మారూర్ కూడా ఉన్నారు. ఆయన ఓ ముక్క మ్రింగేశారు. ఆ విషం ప్రభావం వల్ల ఆయన ప్రాణాలు వదిలేశారు.

ఆ స్త్రీని దైవప్రవక్త (స) క్షమించి వదిలిపెట్టరా లేదా హతమార్చారా అన్న విషయం గురించి ఉల్లేఖనాల్లో అభిప్రాయ భేదాలున్నాయి. అయితే ఆమెను ముందు క్షమించి వదిలిపెట్టడం జరిగిందని, ఆ తరువాత హజ్రత్ బిష్ర్ (ర)గారి మరణం ఆసన్నమవగా ఆమెను హతమార్చడం జరిగిందని చెప్పడం జరిగింది.[25]

## ఖైబర్ యుద్ధంలో హతులైన ఇరుపక్షాల వారు

ఖైబర్ యుద్ధానికి చెందిన వివిధ ఘట్టాల్లో ఏ ముస్లిములైతే అమరగతి నొందారో వారి సంఖ్య మొత్తం 16. నలుగురు ఖురైషువారు, ఒకరు అష్జఅ తెగవారు, ఒకరు అస్లమ్ తెగకు చెందిన వారు, ఒకరు ఖైబర్‌కు చెందిన వారు, మిగిలిన వారు అన్సారులు.

మరో ఉల్లేఖనంలో మొత్తం 18 మంది షహీద్ అయ్యారని ఉంది. అల్లామా మన్సూర్ పూరీ తమ గ్రంథంలో 19 మంది అని రాస్తూ, "సీరత్ చరిత్రకారులు చెప్పిన వారి సంఖ్య మొత్తం 15 మందే. అయితే నేను పరిశోధించగా నాకు 23 పేర్లు లభించాయి" అన్నారు. జనీఫ్ బిన్ వాయిలా పేరును వాఖిదీ రాస్తే, జనీఫ్ బిన్ హబీబ్ పేరును 'తిబ్రీ' గ్రంథస్థం చేశారు. బిష్ర్ బిన్ బరా బిన్ మారూర్ మరణం యుద్ధం ముగిసిన తరువాత విషపూరితమైన మేక మాంసం తినగా సంభవించింది. బిష్ర్ బిన్ అబ్దుల్ మున్జిర్ గురించి రెండు ఉల్లేఖనాలున్నాయి. ఆయన బద్ర్ యుద్ధంలో అమరగతి నొందారన్నది ఒకటయితే, ఖైబర్ యుద్ధంలో షహీద్ అయ్యారనేది రెండవది. నా దృష్టిలో మొదటి ఉల్లేఖనమే సరియైనది.[26]

రెండో పక్షమైన యూదుల హతుల సంఖ్య 93.

---

*25. చూడండి, జాదుల్ ముఆద్-2/139, 140; ఫత్‌హుల్ బారి-7/497; అసలు సంఘటన సహీహ్ బుఖారీ గ్రంథంలో విశదంగానూ, క్లుప్తంగానూ రెండు విధాలా ఉల్లేఖించబడింది. చూడండి-1/449, 2/160, 860. ఇబ్నె హష్షామ్-2/337, 338*

*26. రహ్మతుల్‌లిల్ ఆలమీన్-2/268, 269, 270*

https://teluguislam.net



## ఫిదక్

మహాప్రవక్త (స) ఖైబర్‌కు చేరగానే ముహయిసా బిన్ మస్‌ఊద్ (ర)ను, ఫిదక్ యూదుల వద్దకు ఇస్లామ్ సందేశమిచ్చి పంపించడం జరిగింది. కాని ఫిదక్ ప్రజలు ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరించారు. కాని అల్లాహ్ ముస్లిములకు ఖైబర్ విజయాన్ని చేకూర్చిన తరువాత వారిలో భయభీతులు చోటుచేసుకున్నాయి. వారు మహాప్రవక్త (స) వద్దకు మనిషిని పంపి, ఖైబర్ ప్రజలకు వలెనే మేము ఫిదక్ యొక్క అర్ధ పంటను ఇస్తామనే షరతుపై సంధి కుదుర్చుకోదలిచామని అనే ప్రతిపాదన పెట్టారు. మహాప్రవక్త (స) ఆ సంధి షరతులను ఒప్పుకోవడం జరిగింది. ఇలా ఫిదక్ భూభాగం పూర్తిగా దైవప్రవక్త (స) వశమైపోయింది. ఎందుకంటే ముస్లిములు ఆ భూభాగంపై తమ గుర్రాలను కాని, ఒంటెలను గాని పరుగెత్తించలేదు.[27] (అంటే దాన్ని బలప్రయోగం చేసి జయించలేదన్నమాట.)

## వాదియిల్ ఖుర్ఆ (ఖుర్ఆ లోయ)

ప్రవక్త మహనీయులు (స) ఖైబర్ యుద్ధం ముగించుకొని 'వాదియిల్ ఖుర్ఆ'కు వచ్చారు. అక్కడ కూడా యూదుల ఓ వర్గం నివాసం ఉంటోంది. వారి వెంట అరబ్బులకు చెందిన మరో వర్గం ఉంది. ముస్లిములు అక్కడకు చేరగానే యూదులు ముస్లిములను బాణాలు సంధించి ఆహ్వానించారు. వారు మొదటి నుండే యుద్ధానికి కాచుకొని వరుసలు తీరి ఉన్నారు. ఆ శరాఘాతాలకు దైవప్రవక్త(స)గారి ఓ బానిస బలి అయ్యాడు. ప్రజలు అది చూసి ఇతనికి స్వర్గం ప్రాప్తించింది అనగా దైవప్రవక్త (స), "కానేకాదు, ఏ దైవం చేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆయన సాక్షి! ఇతను ఖైబర్ యుద్ధంలో విజయ ధనం నుండి ఏ దుప్పటినైతే దొంగలించాడో, ఇప్పుడది అతని పాలిటి అగ్నిజ్వాలగా మారి అతణ్ణి దహించివేస్తోంది" అన్నారు. ఇక ప్రవక్త (స) నోట ఈ మాటలు వినగానే ఓ వ్యక్తి చెప్పుక్రింద వేసి కుట్టే తోలు తస్మాలను (ఒకటో రెండో) ముక్కలు తెచ్చి ఇచ్చాడు. మహాప్రవక్త (స) వాటిని చూసి ఈ ఒకటి లేదా రెండు తస్మాలు అగ్నివే అన్నారు.[28]

ఆ తరువాత దైవప్రవక్త (స) యుద్ధం కోసం సహాబాను తీర్చిదిద్దారు. సర్వసైన్య పతాకాన్ని హజ్రత్ సఅద్ బిన్ ఉబాదాకు అందించి, రెండోదాన్ని

27. ఇబ్నె హష్షామ్-2/337,353 28.సహీ బుఖారి-2/608

https://teluguislam.net



హుబాబ్ బిన్ మున్జిర్ (ర)కు, మూడోదాన్ని ఉబాదా బిన్ బిష్ర్ (ర)కు ఇచ్చారు. ఆ తరువాత యూదులకు ఇస్లామ్ వైపు రమ్మని ఆహ్వానించారు. వారు దాన్ని స్వీకరించలేదు. వారిలో ఒకడు యుద్ధ మైదానంలోనికి దిగగా ఇటు నుండి హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ ప్రత్యక్షమయ్యారు. వచ్చీరాగానే అతణ్ణి చంపివేశారు. తరువాత రెండవవాడు బయటకురాగా హజ్రత్ జుబైర్ అతణ్ణి కూడా తుదముట్టించారు. ఆ తరువాత ఇంకొకడు ముందుకు వచ్చాడు. అతనిని ఢీకొనడానికి హజ్రత్ అలి (ర) వరుసల్లో నుండి బయటకు వచ్చి అతని పీచమణిచేశారు. అలా వరుసగా యూదులకు చెందిన పదకొండుగురు హతులైపోయారు. ఒక్కొక్క యూదుడు చనిపోతున్నప్పుడల్లా మహాప్రవక్త (స), యూదుల్ని ఇస్లామ్ వైపునకు రమ్మని ఆహ్వానిస్తూ ఉండేవారు.

ఆ రోజు నమాజు వేళ కాగానే దైవప్రవక్త (స) సహాబాలకు నమాజు చేయించడం, నమాజు ముగిసిన వెంటనే యూదుల ఎదురుగా వెళ్ళి ఇస్లామ్, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) సందేశాన్ని వినిపించేవారు. అలా యుద్ధం చేస్తూనే ప్రొద్దుక్రుంకింది. రెండో రోజు మహాప్రవక్త (స) మళ్ళీ యుద్ధరంగానికి వెళ్ళారు. ప్రొద్దు బారెడు ఎక్కిందోలేదో యూదులు తమ వద్ద ఉన్నదంతా ప్రవక్త (స)కు స్వాధీనం చేసేశారు. అంటే మహాప్రవక్త (స) తమ శక్తితో వారిపై విజయం సాధించినట్లయింది. అల్లాహ్ వారి విజయ ధనాన్ని దైవప్రవక్త(స)కు ఇచ్చాడు. సహాబాలకు ఆ విజయధనం నుండి పెద్ద మొత్తంలో వాటాగా లభించింది.

మహాప్రవక్త (స) వాదియిల్ ఖుర్ఆలో నాల్గు రోజులు మకాం వేశారు. చేతికి చిక్కిన విజయ ధనాన్ని సహాబా (ర)కు పంచిపెట్టారు. అయితే పంట భూములు, ఖర్జూరపు తోటలు యూదుల వద్దనే ఉంచి అందుండి క్రితం ఖైబర్ ప్రజల పంట నుండి ఎలా సగభాగం పొందే ఒప్పందం చేసుకున్నారో వీరితోనూ అలాంటి ఒప్పందాన్నే కుదుర్చుకున్నారు.[29]

## తైమా

తైమా యూదులకు, ఖైబర్, ఫిదక్ మరియు వాదియిల్ ఖుర్ఆ ప్రజలు ఎలా లొంగిపోయింది తెలియగానే వారు ఎలాంటి ప్రతిఘటన లేకుండానే ఓ మనిషిని పంపించి సంధికి దిగివచ్చారు. మహాప్రవక్త (స) వారి ఈ సంధి

29. జాదుల్ ముఆద్-2/146, 147.

https://teluguislam.net



ప్రస్తావనను స్వీకరించారు. దాని ప్రకారం యూదులు తమ ఆస్తిపాస్తులతో సుఖంగా ఉండిపోయారు.[30] ఈ విషయంలో ఓ సంధి పత్రం కూడా వారికి రాసిచ్చారు దైవప్రవక్త (స).

ఆ పత్రం ఇలా ఉంది: "ఇది ముహమ్మద్ రసూలుల్లాహ్ తరపున బనూ ఆదియా వారి కోసం రాసిన పత్రం. వారి కోసం బాధ్యతలున్నాయి. వారిపై జిజియా ఉంది. ఇక నుండి వారిపై ఎలాంటి వత్తిడిగాని, వారిని దేశ బహిష్కరణకు గురి చేయడం గాని జరగదు. రాత్రి వారికి సహకారిగా, పగలు దృఢమైనదిగా ఉంటుంది (అంటే ఈ ఒప్పందం శాశ్వతమైనది అని అర్థం). దీన్ని ఖాలిద్ బిన్ సయీద్ (ర) రాశారు.[31]

## మదీనాకు తిరుగు ప్రయాణం

అనంతరం మహాప్రవక్త (స) మదీనాకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వారు ఓ లోయకు దాపుగా చేరగానే అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్ అంటూ నినదించారు ఆయన సహచరులు. ఇది విన్న దైవప్రవక్త (స), "ఎందుకు అంత కష్టబడతారు. మీరు ఏ చెవిటి వాణ్ణిగానీ, అప్రత్యక్షమైన వాణ్ణిగానీ పిలవడం లేదు. మీరు పిలిచేది వినేవాణ్ణి, మీకు దగ్గరగా ఉన్నవాణ్ణి" అన్నారు.[32]

ఇదే కాకుండా ప్రయాణిస్తూ ఆయన (స) చివరి రోజు రాత్రి ఓ ప్రదేశంలో విడిది చేశారు. నిద్రకు ఉపక్రమిస్తూ ఆయన, హజ్రత్ బిలాల్ (ర)ను పిలిచి, "నేను నిద్రపోతున్నాను. నీవు మా కోసం రేయిని కాచుకొని ఉండు" (అంటే ఉదయం కాగానే ఫజ్ర్ నమాజు కోసం మమ్మల్ని మేల్కొలుపు) అని తాకీదు చేశారు. కాని హజ్రత్ బిలాల్ (ర)గారికి కూడా కన్ను మలిగింది. ఆయన (తూర్పు వైపున ముఖం పెట్టి) తన స్వారీకి ఆనుకొని కూర్చుని ఉండగా నిద్రలోకి జారిపోయారు. వారిలో ఏ ఒక్కరూ మేల్కొనలేదు. వారిపై ఎండ వేడిమి పడగా మొట్టమొదట దైవప్రవక్త (స)గారే నిద్ర నుండి మేల్కొన్నారు. (ఆ తరువాత అందరినీ లేపారు) ఆ లోయ నుండి బయటకు కొంత దూరం వచ్చి ఆగిపోయారు. అప్పుడు ఆయన(స) అందరిచేత ఫజ్ర్

*30. జాదుల్ ముఆద్-2/147 31. ఇబ్నె సఅద్-1/279*
*32. సహీహ్ బుఖారి-2/605*

https://teluguislam.net



నమాజు చేయించారు. ఈ సంఘటన మరో ప్రయాణంలో జరిగిన సంఘటన అని కూడా చెప్పుకోవడం జరుగుతోంది.[33]

ఖైబర్‌లో జరిగిన యుద్ధాల వివరాలను అధ్యయనం చేస్తే, దైవప్రవక్త (స) ఖైబర్ నుండి మదీనాకు (హి.శ.7 చివరన) సఫర్ మాసాంతంలోనో లేదా రబీవుల్ అవ్వల్ నెలలోనో తిరిగివచ్చినట్లు గ్రహించవచ్చు.

## సరియ్యా అబాన్ బిన్ సయీద్

దైవప్రవక్త (స), హరామ్ నెలలు (నిషిద్ధ మాసాలు) పూర్తికాగానే మదీనాను సైనికులు లేకుండా ఖాళీగా వదిలేయడం దూరదృష్టికి వ్యతిరేక మైనది అన్న విషయం ఇతర సైన్యాధ్యక్షులకంటే బాగా ఎరుగుదురు. మదీనా చుట్టుపట్ల దారి దోపిడీలు, హింసాదౌర్జన్యాలకు పాల్పడే బద్దూలు ఉన్నారన్న విషయం, ముస్లిములు ఎప్పుడు ఏమరుపాటుగా ఉంటారా అనే అవకాశం కోసం వారు ఎదురు చూస్తూ ఉంటారన్నది ఆయనకు బాగా తెలుసు. అందుకని ఆయన ఏ కాలంలోనయితే ఖైబర్‌కు బయలుదేరి వెళ్ళారో ఆ రోజుల్లోనే ఆ బద్దూలను భయభీతులుగా చేయడానికి 'అబాన్ బిన్ సయీద్ (ర)' సారథ్యంలో నజద్ వైపునకు ఓ సరియ్యాను పంపించారు. అబాన్ బిన్ సయీద్ తన విధిని నిర్వహించి వెనుదిరిగి దైవప్రవక్త (స)ను ఖైబర్‌లో వచ్చి కలిశారు. అప్పటికే ఖైబర్ జయించబడింది.

బహుశా ఈ సరియ్యా హి.శ. 7 సఫర్ నెలలో పంపించబడి ఉంటుంది. దీని ప్రస్తావన సహీ బుఖారీలోనూ ఉంది.[34] హాఫిజ్ ఇబ్నె హజర్ తన గ్రంథంలో, "ఈ సరియా గురించి నాకు ఎలాంటి ఆధారం లభించలేదని" అంటారు.[35]

---

*33. ఇబ్నె హష్షామ్-2/340; జాదుల్ ముఆద్-2/147*

*34. చూడండి, సహీహ్ బుఖారి, ఖైబర్ యుద్ధ అధ్యాయం-2/608,609*

*35. ఫత్‌హుల్ బారి-7/491*

https://teluguislam.net



# గజ్వయె జాతుర్రిఖాఖ్

## ( జాతుర్రిఖాఖ్ యుద్ధం- హి.శ. 7 )

మహాప్రవక్త (స) అహ్జాబ్ యుద్ధంలో పాల్గొన్న మూడు పటిష్టమైన పక్షాల్లో రెండింటిని విరిచేసిన తరువాత మూడో పక్షం అయిన బద్దూల వైపునకు దృష్టిని సారించారు. వీరు నజద్ ఎడారిలో నివాసం ఉంటూ అదను చూసి దోపిడీలు, హత్యలకు పాల్పడుతూ ఉండేవారు.

ఈ బద్దూలు ఏ బస్తీకో లేదా ఏ పట్టణానికో చెందినవారు కాదు కాబట్టి వారు ఇండ్లలోను, కోటల్లోను నివసించకుండా పూర్తి ఎడారిలో విస్తరించి ఉండే దేశదిమ్మర్లు. మక్కావాసులు, ఖైబర్ వాసులకు మల్లే వీరిని ఓడించి వారిపై నియంత్రణ సాధించడం, వారి ఆగడాలను పూర్తిగా అణచివేయడం కష్టసాధ్యమైన పని. కాబట్టి వారిని భయభీతులుగా చేయడానికి దండనా విధానాన్నే అవలంబించడం ప్రయోజనకరమైనది.

వారికి ముస్లిముల పేరు వినగానే భయం పుట్టుకొచ్చేందుకూ - మరో ఉల్లేఖనం ప్రకారం, మదీనా చుట్టుపట్ల దాడి చేయడానికి సమాయత్తమవు తున్న బద్దూలను చెల్లాచెదరు చేయడానికీ- దైవప్రవక్త (స) ఓ సైనిక చర్యను చేపట్టారు. ఇదే గజ్వయె జాతుర్రిఖాఖ్గా పేరుగాంచింది.

చరిత్రకారులు ఈ గజ్వా గురించి రాసిన వివరాల సారాంశం ఇలా ఉంది:

దైవప్రవక్త (స), అన్మార్ తెగ లేదా బనూ గత్ఫాన్ తెగకు చెందిన రెండు శాఖలు బనీ సఅలబా మరియు బనీ ముహారిబ్లు సమాయత్తమవు తున్నారన్న వార్త విని మదీనా బాధ్యతలను హజ్రత్ అబూజర్ (ర) లేదా హజ్రత్ ఉస్మాన్ (ర)కు అప్పగించి నాల్గు వందలు లేదా ఏడు వందల మంది సహాబా (ర)ను వెంట బెట్టుకొని నజద్ ఎడారిలోని పల్లెల వైపునకు బయలు దేరారు. మదీనాకు రెండు రోజుల ప్రయాణ దూరంలో ఉన్న 'నక్ల్'

https://teluguislam.net



అనే ప్రదేశానికి చేరినప్పుడు బనూ గత్ఫాన్‌కు చెందిన ఓ సైనిక పటాలం ఎదురైంది వారికి. యుద్ధం మాత్రం జరగలేదు. అయితే ఈ సందర్భంలోనే సలాతె ఖౌఫ్ (యుద్ధం జరిగేటప్పుడు చేసే నమాజు) మాత్రం చేయించారు ప్రవక్త(స).

సహీ బుఖారీ గ్రంథంలో హజ్రత్ అబూ మూసా అష్అరీగారి ఉల్లేఖనం ఇలా ఉంది: "దైవప్రవక్త (స) వెంట మేము మొత్తం ఆరుగురం బయలు దేరాం. మా దగ్గర ఉన్న వాహనం ఒకే ఒక ఒంటె. దాని మీద మేము వంతులవారీగా ఎక్కి ప్రయాణించాం. ఇలా నడవడం వలన మా కాళ్ళు గాయాలమయమయ్యాయి. నా రెండు కాళ్ళు బాగా గాయపడి ఓ గోరు కూడా ఊడిపోయింది. మేము, మా కాళ్ళపై గుడ్డ పేలికలను చుట్టుకొని ప్రయాణం సాగించవలసి వచ్చింది. అందుకనే ఈ ప్రయాణం జాతుర్రిఖాఖ్‌గా పేరుగాంచింది (అంటే గుడ్డ పేలికల ప్రయాణం). ఎందుకంటే మేము మా కాళ్ళకు గుడ్డ పేలికలు కట్లుగా వేసి నడిచాం కాబట్టి.[1]

సహీహ్ బుఖారీలోనే హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం కూడా ఇలా ఉంది: "మేము జాతుర్రిఖాఖ్‌లో దైవప్రవక్త (స) వెంట ఉన్నాం. ఎక్కడైనా నీడనిచ్చే చెట్టు కనబడితే దాన్ని దైవప్రవక్త (స) కోసం కేటాయించేవాళ్ళం. (ఓసారి) దైవప్రవక్త (స) విడిది చేయగా సహచరులు నీడ కోసం ఇటూ అటూ ముళ్ళ పొదల్లోనికి చెల్లాచెదురైపోయారు. మహాప్రవక్త (స) కూడా ఓ చెట్టు నీడన విడిది చేశారు. ఆ చెట్టుకే తన కరవాలాన్ని వ్రేలాడదీసి నిద్రించారు. మాకు కన్ను మలిగింది. అంతలోనే ఓ ముష్రిక్ (బహు దైవారాధకుడు) వచ్చి దైవప్రవక్త (స)గారి కరవాలాన్ని ఒర నుండి లాగి ఎదురుగా నిలబడ్డాడు. కరవాలం చూపిస్తూ, "నీవు నాకు భయపడతావా?" అని అడగ్గా, "లేదు" అని సమాధానమిచ్చారు దైవప్రవక్త (స).

"అయితే నిన్ను ఇప్పుడు ఎవరు రక్షిస్తారు?" అడిగాడు ఆ ముష్రిక్కు.

"అల్లాహ్" అన్నారు మహాప్రవక్త (స).

హజ్రత్ జాబిర్ (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, మేము హఠాత్తుగా మహాప్రవక్త (స) పిలుపు విని అక్కడికి పరుగున చేరాము. ఓ ఆరా (బద్దూ)

1. *సహీ బుఖారి, గజ్వాయె జాతుర్రిఖాఖ్ అధ్యాయం-2/592; సహీ ముస్లిమ్-2/118*

https://teluguislam.net



ఆయన వద్ద కూర్చుని ఉన్నాడు. మమ్మల్ని చూసి ఆయన ఇలా అన్నారు:

"నేను నిద్రిస్తున్నప్పుడు ఇతను నా ఖడ్గాన్ని ఒర నుండి తీసి నా ఎదురుగా నిలబడ్డాడు. అంతలోనే నేను మేలుకొనగా ఇతని చేతిలో నా నగ్న కరవాలాన్ని చూశాను. అతడు నాతో 'నిన్ను ఎవరు రక్షిస్తారు' అని అడగ్గా నేను అల్లాహ్ (రక్షిస్తాడు) అన్నాను. ఇప్పుడు చూడండి, ఇతను ఇక్కడ కూర్చుని ఉన్నాడు" అని సెలవిచ్చారు. దైవప్రవక్త (స) అతనిపై ఎలాంటి ఆగ్రహాన్ని ప్రదర్శించలేదు.

అబూ అవానా ఉల్లేఖనంలో ఈ వివరణ కూడా ఉంది: (దైవప్రవక్త (స) అతని ప్రశ్నకు జవాబుగా అల్లాహ్ అని అనడంతోనే) అతని చేతి నుండి కరవాలం జారిపడిపోయింది. ఆ కరవాలాన్ని మహాప్రవక్త (స) చేతబట్టుకొని అడిగారు, "ఇప్పుడు చెప్పు, నిన్ను ఎవరు రక్షిస్తారో?" అని. అతడు, "నాపై కరుణ చూపండి" అని విన్నవించుకున్నాడు.

"సరే, అల్లాహ్ తప్ప వేరే పూజ్యుడు లేడని, నేను అల్లాహ్ ప్రవక్తనని నీవు సాక్ష్యం ఇస్తావా?" అని అడిగారు దైవప్రవక్త (స).

"నేను మీతో యుద్ధం చేయనని, మీతో యుద్ధం చేసే వారికి సహాయపడనని మాటిస్తున్నా"నన్నాడతడు.

ఆ తరువాత దైవప్రవక్త (స) అతణ్ణి కరుణించి వదిలేశారు. అతడు తన జాతిలోనికి వెళ్ళి, "నేను మీ దగ్గరకు వచ్చింది అందరికంటే మేలైన మనిషి దగ్గర నుండి" అని చెప్పుకున్నాడు.[2]

సహీ బుఖారీలోని ఓ ఉల్లేఖనంలో, నమాజు కొరకు అఖామత్ చెప్పగా దైవప్రవక్త (స) రెండు రకాఅత్‌ల నమాజు చేయించారు. వారంతా వెనక్కు వెళ్ళిపోయిన తరువాత మరో వర్గం వచ్చి నమాజుకు నిలుచోగా తక్కిన రెండు రకాఅత్‌ల నమాజు చేయించారు. ఇలా దైవప్రవక్త (స) నమాజు నాలుగు రకాఅత్‌లైంది. సహాబా (ర) గార్ల నమాజు రెండేసి రకాఅత్‌లైంది.[3] ఈ ఉల్లేఖనం సందర్భాన్ని బట్టి చూస్తే ఈ నమాజు, పైన చెప్పిన సంఘటన తరువాతనే చేయబడిందని అర్థం అవుతుంది.

---

2. ముక్తరుసీరత్-షేఖ్ అబ్దుల్లాహ్ నజదీ, పుట. 266; ఫత్‌హుల్ బారి-7/416
3. సహీ బుఖారి-1/407,408; 2/593

https://teluguislam.net



సహీ బుఖారీలో ఉల్లేఖించబడిన ఓ ఉల్లేఖనాన్ని మస్‌దూద్ (ర), అబూ అవానా ద్వారా, ఆయన అబూ బషీర్ ద్వారా విని ఉల్లేఖించారని ఉంది. దాని ప్రకారం, ఆ వ్యక్తి పేరు గౌరిస్ బిన్ హారిస్.[4] ఇబ్నె హజర్, వాఖిదీ ఈ సంఘటనను వివరిస్తూ ఆ పల్లెవాసి (బద్దూ) పేరు దాషూర్ అని రాశారు. అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించినట్లు చెప్పబడి ఉంది. కాని వాఖిదీ కథనాన్ని తరచి చూస్తే ఇవి వేరువేరుగా జరిగిన రెండు సంఘటనలని, అవి వేరువేరు గజ్వాలలో జరిగాయని తెలుస్తుంది.[5] వల్లాహు ఆలం (దైవానికే బాగా తెలుసు).

ఈ గజ్వా నుండి తిరిగి వచ్చేటప్పుడు సహాబా (ర), ఓ ముష్రిక్ స్త్రీని (బహు దైవారాధకురాలు) బంధించడం జరిగింది. అలా చేసినందుకు ఆమె భర్త, ముహమ్మద్ అనుచరుల్లో రక్తపాతం సృష్టిస్తానని మ్రొక్కుకున్నాడు. అతను రాత్రి పూట అక్కడికి వచ్చాడు. దైవప్రవక్త (స) శత్రువు ఏమరుపాటులో దాడి చేయకుండా ఇద్దరు మనుషుల్ని, ముస్లిములకు అంటే అబ్బాద్ బిన్ బిష్ర్ (ర) మరియు అమ్మార్ బిన్ యాసిర్ (ర)ను పహరా కాయడానికి నియమించారు. ఆ వ్యక్తి అక్కడికి వచ్చినప్పుడు హజ్రత్ అబ్బాద్ (ర) నిలబడి నమాజు చేస్తున్నారు. అతను ఆయన్ను ఆ స్థితిలోనే బాణం వేసి గాయ పరిచాడు. అదే పరిస్థితిలో ఆయన నమాజును భంగపర్చకుండా ఆ బాణాన్ని తీసి ప్రక్కకు పారవేశారు. ఆ తరువాత రెండవ బాణాన్ని, మూడవ బాణాన్ని కూడా వదిలాడు. అయినా ఆయన నమాజును భంగపర్చలేదు. సలాం చేసి దాన్ని పూర్తి చేసే తన అనుచరుణ్ణి నిద్రలేపారు. (ఈ పరిస్థితిని చూసి) ఆ రెండవ అనుచరుడు, "సుబ్‌హానల్లాహ్! మీరు నన్నెందుకు మేల్కొల్పలేదు?" అని అడగగా, ఆయన, "నేను ఓ సూరాను స్తోత్రం చేస్తున్నాను. మధ్యలోనే ఆపడం నాకు ఇష్టం లేదు" (అందుకనే అలా చేశాను) అన్నారు.[6]

కఠినాత్ములైన ఆ రాజులను (బద్దూలను) భయభీతులుగా చేసి లొంగిపోయేటందుకు ఈ గజ్వా మంచి ప్రభావాన్నే చూపింది. మనం గనక

---

4. *సహీ బుఖారి-2/593*

5. *ఫత్‌హుల్ బారి-7/428*

6. *జాదుల్ ముఆద్-2/112; ఇంకా ఈ గజ్వా వివరాల కోసం చూడండి. ఇబ్నె హిషామ్-2/203 నుండి 209 వరకు. జాదుల్ ముఆద్-2/110, 111, 112; ఫత్‌హుల్ బారి -7/417 నుండి 428 వరకు*

https://teluguislam.net



ఈ గజ్వా తరువాత జరిగిన సరియ్యాలు (పోరాటాలు) వాటి వివరాలపై దృష్టిని సారిస్తే, గత్ఫాన్ తెగలు ఈ గజ్వా తరువాత తల ఎత్తడానికి సాహసించ లేదని, కాగా పూర్తిగా బలహీనమైపోవడం, ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం జరిగిందన్న విషయాన్ని గమనించగలం. అదే కాకుండా, చివరికి ఈ ఆరాబులకు సంబం ధించిన అనేక తెగలు మక్కా విజయం మరియు హునైన్ యుద్ధంలో ముస్లిముల వెంట రావడం, వారికి హునైన్ యుద్ధంలో లభించిన విజయ ధనం నుండి వాటా కూడా ఇవ్వడం; మక్కాను జయించి వెనుదిరిగేటప్పుడు వారి నుండి సదఖాత్ (జకాత్ ధనం) వసూలు చేయడానికి ఇస్లామీయ ప్రభుత్వం తన రెవెన్యూ అధికారుల్ని పంపించడం, వారు చట్టం ప్రకారం సదఖాలు చెల్లించడం కూడా జరిగిందన్న విషయాన్ని మనం తెలుసుకోగలం. మొత్తానికి ఈ యుద్ధ వ్యూహం వల్ల, కందకం యుద్ధం (అగడ్త యుద్ధం)లో పాల్గొన్న మూడు పటిష్టమైన పక్షాల పీచం అణిగి పోయింది. ఈ ప్రాంతం అంతటా శాంతి అలుముకున్నట్లయింది. ఆ తరువాత ఏ తెగలైతే కొన్ని ప్రాంతాల్లో కల్లోలాన్ని రేకెత్తించడానికి ప్రయత్నం చేశాయో వాటిని ముస్లిములు సునాయాసంగా అణిచిపారవేయడం జరిగింది. కాగా ఈ గజ్వా తరువాత పెద్ద పెద్ద పట్టణాలు మరియు దేశాలను జయించే మార్గం సుగమం కానారం భించింది. కారణం, ఈ గజ్వా తరువాత అరేబియా ద్వీపంలో పరిస్థితులు పూర్తిగా ముస్లిములకు అనుకూలంగా మారిపోవడమే.

## హిజ్రీ శకం 7కు సంబంధించిన కొన్ని సరియ్యాలు

గజ్వా జాతుర్రిఖాఖ్ నుండి తిరిగివచ్చిన తరువాత దైవప్రవక్త (స), షవ్వాల్ నెల (హి.శ. 7) వరకు మదీనాలోనే ఉండిపోయారు. ఈ మధ్య కాలంలో ఆయన అనేక సరియ్యాలను (సైనిక పటాలాలను) పంపించడం జరిగింది. వాటి వివరాలు ఇక్కడ ఇవ్వడం జరుగుతోంది.

## 1. సరియ్యా ఖదీద్ (సఫర్ లేదా రబీవుల్ అవ్వల్ మాసం, హి.శ. 7)

ఈ సరియ్యా బహుశా గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసీ (ర)గారి సారథ్యంలో, బనీ మలూహ్ తెగను అణచడానికి పంపించబడిన సరియ్యా. దీనికి కారణం, బనూ మలూహ్ (మలూహ్ తెగవారు) బిష్ర్ బిన్ సువైద్ (ర) మరియు ఆయన సహచరుల్ని హతమార్చడమే. ఈ హత్యలకు పగ తీర్చుకునే

https://teluguislam.net



ఉద్దేశ్యంతోనే ఈ సరియ్యాను పంపించడం జరిగింది. ఈ సైనిక పటాలం రాత్రి పూట దాడి చేసి చాలా మందిని సంహరించింది. వారికి సంబంధించిన పశువులను తోలుకొని వచ్చింది. వెనుక నుండి శత్రువుకు చెందిన ఓ పెద్ద సైన్యం ముస్లిములను వెంటాడి వచ్చింది కాని వారు ముస్లిముల దగ్గరికి చేరగానే కుంభవర్షం కురవనారంభించింది. చూస్తూ ఉండగానే పెద్ద వరదలు వచ్చి ఇరుపక్షాల నడుమ అడ్డుగా నీరు ప్రవహించనారంభించింది. ఇలా ముస్లిములు మిగిలిన దూరాన్ని కూడా నడిచి క్షేమంగా వచ్చేశారు.

### 2. సరియ్యా హుస్మీ (జమాదిల్ ఉఖ్రా మాసం, హి.శ.7)

దీని గురించిన వివరాలు, దైవప్రవక్త (స) రాజులకు రాసిన ఉత్తరాల సందర్భంలో చెప్పుకున్నాం.

### 3. సరియ్యా తర్బా (షాబాన్, హి.శ. 7)

ఇది హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)గారి సారధ్యంలో పంపించబడిన సరియ్యా. ఆయన వెంట మొత్తం ముప్ఫై మంది ఉన్నారు. వీరు రాత్రి పూట ప్రయాణం చేస్తూ, పగలు దాగి ఉండేవారు. కాని ఈ విషయం బనూ హవాజిన్ తెగకు తెలిసి వారంతా పారిపోయారు. హజ్రత్ ఉమర్ (ర) వారి ప్రాంతానికి చేరినప్పుడు ఏ ఒక్కడూ వారికి దొరకనందున తిరిగి మదీనాకు వచ్చేశారు.

### 4. ఫిదక్ పరిసరాలకు పంపిన సరియ్యా (షాబాన్ నెల, హి.శ.7)

ఇది హజ్రత్ బషీర్ బిన్ సఅద్ అన్సారీ (ర)గారి నేతృత్వంలో ముప్ఫై మందినిచ్చి 'బనూ ముర్రా' తెగను అణచడానికి పంపించబడిన సరియ్యా. హజ్రత్ బషీర్ (ర) వారి ప్రాంతానికి వెళ్ళి గొర్రెలను, మేకలను, పశువుల్ని తోలుకొని తిరుగు ప్రయాణం చేసేటప్పుడు రాత్రి పూట శత్రువులు వారిపైకి వచ్చిపడ్డారు. ముస్లిములు స్థిరంగా నిలబడి బాణాల వర్షం కురిపించారు. చివరకు వారి బాణాలు అయిపోగా శత్రువులు వారందరినీ హతమార్చేశారు. కేవలం ఒక బషీర్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. గాయాలపాలైన బషీర్ (ర)ను ఫిదక్‌కు తీసుకొచ్చారు వారు. ఆయన అక్కడనే యూదుల దగ్గర ఉండిపోయారు. చివరికి ఆయన గాయాలు మానిన తరువాత మదీనాకు తిరిగి వచ్చారు.

https://teluguislam.net



## 5. సరియ్యా మైఫా (రమజాన్ నెల, హి.శ. 7)

ఈ సరియ్యా హజ్రత్ గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసీ (ర)గారి నాయకత్వంలో బనూ అవాల్‌నూ, బనూ అబ్ద్ బిన్ సాలిబానూ అణచడానికీ, మరో ఉల్లేఖనంలో, జుహ్నియా తెగకు చెందిన ఓ శాఖ హర్ఖాత్‌ను అణచడానికీ పంపించ బడిన సరియ్యా. ముస్లిముల సంఖ్య మొత్తం నూటా ముప్ఫై. వారు శత్రువులపై ఒకేసారి దాడి చేశారు. ఎదురుతిరిగిన వారినందరినీ చంపేశారు. వారి గొర్రెలను, మేకలను తోలుకొని వచ్చేశారు. ఈ సరియ్యాలోనే హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర), 'నహీక్ బిన్ మర్దాస్' అనే వ్యక్తిని, అతను 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే సద్వచనం పఠించినప్పటికీ హతమార్చారు. ఈ విషయం తెలిసిన దైవప్రవక్త (స) ఆయనపై కోపాన్ని ప్రదర్శిస్తూ, "నీవు అతని గుండె చీల్చి చూడకపోయావా, అతను నిజం చెప్పాడో, అబద్ధం పలికాడో తెలుసుకోవటానికి" అని అడిగారు.

## 6. సరియ్యా ఖైబర్ (షవ్వాల్ నెల, హి.శ. 7)

ఈ సరియ్యాకు వెళ్ళిన వారి సంఖ్య మొత్తం ముప్ఫై మంది. ఇది హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర) నేతృత్వంలో పంపబడిన సరియ్యా. అసీర్ లేదా బషీర్ బిన్ జరామ్, బనూ గత్ఫాన్‌ను ముస్లిములకు వ్యతిరేకంగా కూడగడుతున్నాడనే వార్త అందడం వలన పంపబడింది ఇది. ముస్లిములు అక్కడికి వెళ్ళి దైవప్రవక్త (స) అతణ్ణి ఖైబర్‌కు గవర్నరుగా చేస్తారని చెప్పి అతణ్ణి, అతనితో ఉన్న ముప్ఫై మందిని మదీనాకు వచ్చేటట్లు ఒప్పించారు. కాని 'కర్కరా నియార్'కు చేరిన తరువాత ముస్లిములకు, అతనికి మధ్య అనుమానాలు పొడసూపాయి. దీని ఫలితంగా అసీర్ మరియు అతని 30 మంది సహచరులూ ప్రాణాలు వదలాల్సి వచ్చింది.

## 7. సరియ్యా యమన్ మరియు జబార్ (షవ్వాల్ నెల, హి.శ. 7)

'జబార్' అనేది బనూ గత్ఫాన్- మరో ఉల్లేఖనంలో బనూ ఫరాజా మరియు బనూ ఇజ్రా - తెగలకు చెందిన ప్రాంతం. ఇక్కడికి, హజ్రత్ బషీర్ బిన్ కఅబ్ అన్సారీ (ర) సారథ్యంలో మూడొందల మంది ముస్లిములనిచ్చి పంపబడిన సరియ్యా ఇది. మదీనాపై దండెత్తడానికి సిద్ధమవుతున్న ఓ పెద్ద సైనిక పటాలాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఉద్దేశించినది. ముస్లిములు రాత్రి

https://teluguislam.net



పూట ప్రయాణిస్తూ పగలు దాగి ఉండేవారు. శత్రువుకు హజ్రత్ బషీర్ రాక గురించి తెలిసి పారిపోయాడు. ఆయన శత్రువులకు చెందిన పశువుల్ని వశపర్చుకున్నారు. ఇద్దరు వ్యక్తుల్ని కూడా బందీలుగా పట్టుకెళ్ళారు. వారిద్దరినీ దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరుపర్చగా వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించి ముస్లిములైపోయారు.

## 8. సరియ్యా గాబా

ఇమామె ఇబ్నె ఖైమ్ ఈ సరియ్యా 'ఉమ్రయె ఖజా' కంటే పూర్వం హి.శ.7లో జరిగిన సరియ్యాల్లోని ఒకటిగా అభివర్ణించారు. దీని వివరాల్లోనికి వెడితే, జష్మ్ బిన్ ముఆవియా తెగకు చెందిన ఓ వ్యక్తి చాలా మందిని తోడ్కొని 'గాబా'కు వచ్చాడు. అతను బనూ ఖైస్ తెగకు ముస్లిములపైకి ఉసిగొల్పాలన్నది అతని ఉద్దేశ్యం. దైవప్రవక్త (స), హజ్రత్ అబూ హద్రద్ (ర)కు కేవలం ఇద్దరు మనుషులనిచ్చి పంపించారు. హజ్రత్ అబూ హద్రద్ (ర) అవలంబించిన యుద్ధవ్యూహం కారణంగా శత్రువుకు ఘోర పరాజయం ఎదురైంది. ఆయన శత్రువులకు చెందిన ఒంటెల్ని, గొర్రెల్ని, మేకలను తోలుకొని తిరిగి వచ్చారు.[7]

---

7. జాదుల్ ముఆద్-2/149,150; ఈ సరియ్యాల వివరాలు, రహ్మతుల్ లిల్ ఆలిమీన్-2/229-231; జాదుల్ ముఆద్-2/148-150; తఫీముల్ ఫహూమ్ అదఃసూచికతో సహా పుట. 31; ముఖ్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్ నజదీ, పుట. 322-324 లలో చూడవచ్చు.

https://teluguislam.net



# ఉమ్రయే ఖజా

ఇమామె హాకిమ్ ఇలా అంటున్నారు: "జీఖాదా మాసం చంద్రవంక అగుపడగానే దైవప్రవక్త (స) తమ అనుచరగణానికి, తప్పిపోయిన తమ ఉమ్రాను 'ఖజా'గా పూర్తి చేయండని, హుదైబియాలో హాజరైన వారిలో ఏ ఒక్కడూ ఆగిపోవడానికి వీల్లేదని ఓ ఆదేశాన్ని జారీ చేయగా, (ఈ మధ్య కాలంలో) ఎవరైతే అమరగతినొందారో వారు తప్ప మిగిలిన వారందరూ ఉమ్రా చేయడానికి బయలుదేరారు. హుదైబియాలో పాల్గొన్న వారే కాకుండా ఇంకా కొందరు ఉమ్రా చేయడానికిగాను వెంట రావడం జరిగింది. వారందరి సంఖ్య మొత్తం రెండు వేలకు చేరింది. స్త్రీలు, పిల్లలు వారికి అదనం.[1]

ఈ సందర్భంగా మహాప్రవక్త (స), అబూ రహ్మ్ (ర)ను తమ స్థానంలో మదీనా బాగోగులను చూడడానికి నియమించడం జరిగింది. అరవై ఒంటెలను వెంటబెట్టుకొని వాటిని పరిరక్షించేందుకు నాజియా బిన్ జుందుబ్ (ర)ను నియమించారు. 'జుల్ హులీఫా' అనే ప్రదేశం నుండి ఉమ్రా 'ఎహ్రామ్' కట్టి 'లబ్బైక్' పలికారు. ఆయనతో సహా ముస్లిములందరూ లబ్బైక్ అన్నారు. ఖురైష్‌వారు ఏదైనా వాగ్దానభంగానికి పాల్పడతారేమోననే ఉద్దేశ్యంతో అందరూ ఆయుధధారులై మరీ బయలుదేరారు. 'యాజిజ్' లోయకు చేరగానే ఆయుధాలన్నిటినీ అంటే ఢాళ్ళు, బాణాలు, బల్లేలు వగైరాలన్నిటిని ఆ ప్రదేశంలో ఉంచి, వాటిని సంరక్షించడానికి అవస్ బిన్ ఖౌలీ అన్సారీ (ర) గారి నాయకత్వంలో రెండొందల మందిని నియమించి, అశ్వారూఢులు ఉపయోగించే ఆయుధం మరియు ఒరలో ఉంచిన ఖడ్గం మాత్రమే తీసుకొని మక్కాలో ప్రవేశించారు.[2]

దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించేటప్పుడు 'కస్వా' పేరుగల ఒంటెపై

---

1. ఫత్‌హుల్ బారి-7/500.
2. ఫత్‌హుల్ బారి-7/500; జాదుల్ ముఆద్-2/151తో సహా.

https://teluguislam.net



స్వారీ చేస్తున్నారు. ముస్లిములు ఖడ్గాలను మెడలకు తగిలించుకొని దైవప్రవక్త (స)ను చుట్టుముట్టి లబ్బైక్ పలుకుతున్నారు.

ముష్రిక్కులు ముస్లిములను చూడడానికి తమ ఇండ్ల నుండి బయటకు వచ్చి కాబాకు ఉత్తరాన ఉన్న 'జబ్లె ఖైకాన్' కొండ పైకి ఎక్కి కూర్చున్నారు. వారు పరస్పరం మాట్లాడుకుంటూ, "మీ వద్దకు వస్తున్న వారిని యస్రిబ్ జ్వరం పూర్తిగా నీరసులుగా చేసివేసింది" అని అనుకోజొచ్చారు. దైవప్రవక్త (స) తమ అనుచరులకు (సహాబాకు) ఆదేశమిస్తూ, ప్రదక్షిణ లేక తవాఫ్‌లో మొదటి మూడు ప్రదక్షిణలు పరుగెత్తుతూ చేయండని, అయితే 'రుక్నె యమాని' మరియు 'హజ్రె అస్వద్' (యమన్ వైపున ఉన్న కాబా గృహం మూల మరియు హజ్రె అస్వద్ ఉన్న ప్రదేశానికి నడుమ ఉన్న చోటు అంటే కాబా దక్షిణ గోడ) వరకు నడుస్తూ వెళ్ళమని చెప్పారు. ఈ ఆదేశం ఇవ్వడానికి కారణం కేవలం దైవకారుణ్యం పొందడమే కాకుండా, ముష్రిక్కులు వారి శక్తిని కూడా అంచనా వేసుకోవాలనే ఉద్దేశ్యం కూడా ఆ ఆదేశంలో ఉంది.[3] ఇదేకాక ఆయన(స) సహాబాకు 'ఇజ్‌తిబా' చేసే ఆదేశం కూడా ఇచ్చారు. ఇజ్‌తిబా అంటే కుడి భుజంపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా చేయడం. (పైన కప్పుకున్న అంగవస్త్రం అంచును కుడి చంక క్రింది నుండి తీసి వెనుకా ముందుగా రెండో అంచును ఎడమ భుజంపై వేసుకోవడం).

దైవప్రవక్త (స) మక్కాలోనికి ప్రవేశించిన మార్గం, కొండ లోయగుండా వెళ్ళి 'హజూన్'కు చేరే మార్గం. ముష్రిక్కులు మహాప్రవక్త (స) మరియు ఆయన అనుయాయుల్ని చూసేందుకు వరుసకట్టి నిలబడి ఉన్నారు. ఆయన (స) ఆపకుండా లబ్బైక్ పలుకుతూ (హరమ్ లోనికి చేరి) తన చేతికర్రతో హజ్రె అస్వద్‌ను తాకారు. అక్కడి నుండి ప్రదక్షిణ ప్రారంభించారు. తక్కిన ముస్లిములు కూడా ఆయన్ను అనుసరించారు. అప్పుడు అబ్దుల్లా బిన్ రవాహా (ర) తన కరవాలాన్ని ధరించి దైవప్రవక్త (స) ముందు నడుస్తున్నారు. అలా నడుస్తూ ఈ యుద్ధ గీతాన్ని ఆలపిస్తున్నారు.

"దైవ తిరస్కారుల మనుమల్లారా! ఈయన కోసం మార్గాన్ని వదలండి. సకల శ్రేయాలు ఈ ప్రవక్త (స) వద్దే ఉన్నాయి కాబట్టి ఆయన మార్గానికి అడ్డుతొలగండి. ఆ శ్రేయం రహ్మాన్ తన గ్రంథంలో అవతరింపజేశాడు. అంటే,

3. సహీహ్ బుఖారి-1/218, 2/610,611; సహీ ముస్లిమ్-1/412.

https://teluguislam.net



అయన ప్రవక్తపై పఠించబడే గ్రంథం అన్నమాట. ఓ ప్రభూ! నేను వీటిని విశ్వసిస్తున్నాను. దాన్ని స్వీకరించడమే సత్యమార్గం అని నాకు తెలుసు- మేలైన హత్య అల్లాహ్ మార్గంలో చేసే హత్య. నేడు అవతరించిన ఈ గ్రంథం ప్రకారం మేము మీపై వేసే వ్రేటుకు మీ కపాళం బ్రద్దలవుతుంది. ఈ దెబ్బ స్నేహాన్ని త్రెంచేస్తుంది."[4]

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), హజ్రత్ రవాహాతో, "ఓ రవాహా! నీవు దైవప్రవక్త (స) ఎదుట, అల్లాహ్ గృహంలోనా ఈ పద్యపాదాల్ని వల్లిస్తున్నావు?" అని అడిగారు. దీనికి మహాప్రవక్త (స), "ఓ ఉమర్! వల్లించనీ! ఈ పద్య పాదాలు వారికి బాణాలకంటే ఎక్కువగా గ్రుచ్చుకొని బాధిస్తున్నాయి" అన్నారు.[5]

మహాప్రవక్త (స) మరియు ముస్లిములంతా మూడు ప్రదక్షిణలు పరుగిడుతూ చేయగా, ముష్రిక్కులు అది చూసి, "వీరి గురించి మనం జ్వరం వారిని నిర్వీర్యం చేసేసిందని అనుకున్నాంగాని వారు ఫలానా, ఫలానా వారి కంటే కూడా బలవంతులు" అని అనుకోజొచ్చారు.[6]

తవాఫ్ పూర్తి అయిన పిదప ఆయన(స) సఫా మరియు మర్వా కొండల నడుమ సయీ చేశారు. అప్పుడు ఆయన హదీ అంటే ఖుర్బానీ పశువులు మర్వా వద్ద నిలబడి ఉన్నాయి. ఆయన సయీ పూర్తి చేసిన తరువాత "ఇది బలి స్థానం, మక్కా వీధులన్నీ బలి స్థానాలే" అని సెలవిచ్చారు. ఆ తరువాత మర్వా వద్దనే ఖుర్బానీ పశువులను బలి ఇవ్వటం జరిగింది. ఆ చోటే తమ తలను గొరిగించుకున్నారు. ముస్లిములు కూడా తమ తల వెంట్రుకలను గొరిగించుకున్నారు. కొందరిని 'యాజిజ్'కు పంపి అక్కడున్న ఆయుధాల సంరక్షణా బాధ్యతను తీసుకొని అక్కడున్న వారిని ఉమ్రా కోసం పంపించమని చెప్పి పంపారు.

మహాప్రవక్త (స) మక్కాలో మూడు రోజుల వరకు మకాం వేశారు. నాల్గవ రోజు తెల్లారిన తరువాత ముష్రిక్కులు హజ్రత్ అలీ (ర) వద్దకు

---

4. ఉల్లేఖనాల్లో ఈ పద్యపాదాలు వాటి క్రమం వేరువేరుగా ఉంది. వాటన్నిటినీ ఓ చోట చేర్చి రాయడం జరిగింది.
5. జామె తిర్మిజీ, అబ్వాబుల్ ఇస్తీజాన్ వల్ అదబ్, జాబుత్ మాజా అఫీర్రిన్షా వష్షేర్-2/107.
6. సహీ ముస్లిమ్-1/412.

https://teluguislam.net



వచ్చి, "మీ నాయకునితో, గడువు తీరిపోయింది వెనక్కు వెళ్ళిపొమ్మని చెప్పండి" అని అన్నారు. పిదప దైవప్రవక్త (స) మక్కా నుండి బయలుదేరి సర్ఫ్ అనే ప్రదేశంలోనికి వచ్చి విడిది చేశారు.

మక్కా నుండి బయలుదేరేటప్పుడు, హజ్రత్ హమ్జా (ర)గారి కుమార్తె బాబాయి, బాబాయి అంటూ వెంటబడింది. ఆమెను హజ్రత్ అలీ (ర) ఎత్తుకున్నారు. ఆ తరువాత ఆమె గురించి హజ్రత్ అలీ (ర), హజ్రత్ జాఫర్ (ర) మరియు హజ్రత్ జైద్ (ర) నడుమ వివాదం వచ్చింది (ప్రతి వ్యక్తీ తానే ఆ అమ్మాయి పోషణకు హక్కుదారుణ్ణని వాదించసాగాడు). దైవప్రవక్త (స) హజ్రత్ జాఫర్(ర) గారికి అప్పగించారు. ఎందుకంటే ఆ అమ్మాయి చిన్నమ్మ ఆయనకు భార్య కాబట్టి.

ఈ ఉమ్రా సందర్భంలోనే దైవప్రవక్త (స)కు, హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ ఆరియా (ర)తో వివాహం జరిగింది. దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించక ముందే, హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ (ర)ను వివాహ సంబంధం గురించి మాట్లాడమని మైమునా (ర) వద్దకు పంపించి ఉన్నారు. ఆమె ఈ వ్యవహారాన్ని హజ్రత్ అబ్బాస్ (ర) కు అప్పగించారు. అప్పటికే హజ్రత్ మైమునా సోదరి హజ్రత్ ఉమ్ముల్ ఫజల్ ఆయన వివాహ బంధంలో ఉన్నారు. హజ్రత్ అబ్బాస్ (ర) మైమునా (ర) గారిని దైవప్రవక్త (స)కు ఇచ్చి వివాహం చేశారు. మక్కా నుండి తిరిగి వచ్చేటప్పుడు, హజ్రత్ మైమునా (ర)ను తోడ్కొని రమ్మని హజ్రత్ అబూ రాఫె (ర)ను అక్కడే వదిలి వచ్చేశారు. దైవప్రవక్త (స) సర్ఫ్‌కు చేరేటప్పటికి ఆయన మైమునా (ర)ను సన్నిధికి గొనివచ్చారు.[7]

ఈ ఉమ్రా పేరు 'ఉమ్రయె ఖజా'గా పడిపోవడానికి కారణం, బహుశా ఇది హుదైబియా ఉమ్రాకు బదులుగా చేసిన ఉమ్రా అయినా కావచ్చు లేదా హుదైబియా ఒప్పందంలో నిర్ణయించిన షరతులకు అనుగుణంగానైనా జరిగి ఉండవచ్చు. రెండో కారణాన్నే పరిశోధకులు సరియైనదిగా తలుస్తారు.[8] అదేకాకుండా దీన్ని నాల్గు రకాలుగా కూడా పిలుస్తారు. 1. ఉమ్రయె ఖజా, 2. ఉమ్రయె ఖజియా, 3. ఉమ్రయె ఖిసాస్, 4. ఉమ్రయె సులాహ్.

7. జాదుల్ మఆద్-2/152

8. జాదుల్ మఆద్-1/172; ఫత్‌హుల్ బారి-7/500

https://teluguislam.net



## మరికొన్ని సరియ్యాలు

### 1. సరియ్యా అబుల్ ఇవజా (జిల్‌హజ్జా మాసం, హి.శ. 7)

దైవప్రవక్త (స), యాభై మందిని హజ్రత్ అబుల్ ఇవజాకు ఇచ్చి బనూ సులైమ్ తెగవారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించమని పంపించారు. కాని బనూ సులైమ్‌కు ఇస్లామ్ వైపునకు రమ్మని పిలుపునివ్వగా వారు, “మీరు దేని వైపునకైతే మమ్మల్ని పిలుస్తున్నారో అది మాకు అవసరం లేదు” అంటూ వారితో యుద్ధానికి దిగారు. భీకర పోరాటం జరిగింది. ఆ పోరాటంలో హజ్రత్ అబుల్ ఇవజా గాయపడ్డారు. అయినప్పటికీ ముస్లిములు శత్రువులకు చెందిన ఇద్దరిని బందీలుగా పట్టుకొని వచ్చారు.

### 2. సరియ్యా గాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ (సఫర్ నెల, హి.శ. 8)

ఈయనకు రెండొందల మందినిచ్చి ఫిదక్ చుట్టుపట్ల హజ్రత్ బషీర్ బిన్ సఅద్ సహచరులు అమరగతినొందిన ప్రదేశానికి పంపించారు మహాప్రవక్త (స). వీరు శత్రువుల పశువులను హస్తగతం చేసుకుని అనేక మందిని హత మార్చారు.

### 3. సరియ్యా జాతె అత్లహ్ (రబీవుల్ అవ్వల్ నెల, హి.శ. 8)

ఈ సరియ్యా వివరాలు ఇలా ఉన్నాయి. బనూ ఖుజాఅ వారు ముస్లిములపై దాడి చేయడానికి పెద్ద సైన్యాన్ని సమీకరించుకొని ఉన్నారు. ఈ వార్త మహాప్రవక్త (స)కు తెలిసింది. ఆయన ‘కఅబ్ బిన్ ఉమైర్ (ర)’ గారి నేతృత్వంలో కేవలం పదిహేను మంది సహాబాలనే అటు వైపునకు పంపించారు. సహాబా (ర)కు వారు ఎదురుపడినప్పుడు వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించడం జరిగింది. కాని వారు ఇస్లామ్ స్వీకరించడానికి బదులు సహాబా (ర)ను బాణాలు సంధించి అందరినీ షహీద్ చేశారు. కేవలం ఒకే ఒక వ్యక్తి బ్రతికి ఉండగా ఆయనను హతుల నడుమ నుండి ఎత్తుకు రావడం జరిగింది.[9]

---

9. *రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/231*

https://teluguislam.net



## 4. సరియ్యా జాతె అర్థ్ (రబీవుల్ అవ్వల్ హి.శ. 8)

బనూ హవాజిన్ తెగ ఎడతెగకుండా శత్రువుకు సహాయం అందిస్తూ ఉండేది. అందుకని పాతిక మందిగల ఓ పటాలాన్ని హజ్రత్ షుజా బిన్ వహబ్ అసదీ (ర)గారికిచ్చి అటు పంపించడం జరిగింది. వీరు శత్రువులకు చెందిన పశువులను మాత్రమే తోలుకొని వచ్చారు. పోరాటం జరిగే అవకాశం కలుగలేదు.[10]

10. *రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/231; తల్ఖీహుల్ ఫహూమ్-పుట.33 (అధఃస్సూచిక)*

https://teluguislam.net



# 'మూతా' పోరాటం

'మూతా' జోర్డాన్‌లోని బల్కా దాపులో ఉన్న ఓ జనవాసం పేరు. ఇక్కడి నుండి 'బైతుల్ మగ్దిస్' రెండు మజిలీల దూరంలో ఉంది. ఇప్పుడు చెప్పబోతున్న యుద్ధం ఈ ప్రదేశంలోనే జరిగింది.

ఇది అన్నిటికంటే భయంకరమైన, రక్తపాతంతో కూడిన పోరాటం. మహాప్రవక్త (స) సజీవంగా ఉన్న కాలంలోనే జరిగింది. ఈ పోరాటమే క్రైస్తవ దేశాల విజయానికి నాంది పలికింది. ఈ పోరాటం జరిగిన కాలం జమాదిల్ ఊలా హి.శ. 8లో (అంటే క్రీ.శ. 629, ఆగస్టు లేదా సెప్టెంబరు నెలలో జరిగింది.)

## పోరాటానికి గల కారణాలు

జరిగిందేమిటంటే, దైవప్రవక్త (స) హారిస్ బిన్ ఉమైర్ అజ్దీ (ర)కు తన లేఖనిచ్చి బస్రా పాలకుని వద్దకు పంపించారు. ఆయన్ను రోమన్ చక్రవర్తికి గవర్నరు అయిన షర్జీల్ బిన్ అమ్రూ గస్సానీ- ఇతను అప్పుడు బల్కా గవర్నరుగా ఉన్నాడు- బంధించి త్రాళ్ళతో కట్టి ఆయన మెడ నరికివేశాడు.

దూతలను, సందేశం తెచ్చే వ్యక్తులను చంపడం ఘోరమైన నేరంగా పరిగణించబడుతుంది. అది ఒక విధంగా యుద్ధ ప్రకటనే కాకుండా అంతకు మించినదిగా భావించబడేది. దైవప్రవక్త (స)కు ఈ వార్త అందగా, అది ఆయన్ను బాగా కలిచివేసింది. మహాప్రవక్త (స) ఆ ప్రాంతంపై దండెత్తడానికి మూడు వేల మందితో కూడిన ఓ సైన్యాన్ని సమాయత్తపరిచారు.[1] ఇంత పెద్ద సైన్యం ఇంతకు పూర్వం ఒక అహ్జాబ్ యుద్ధంలో తప్ప మరే యుద్ధంలోనూ సమీకరించబడలేదు.

1. జాదుల్ ముఆద్-2/155; ఫత్‌హుల్ బారి-7/511.

https://teluguislam.net



## సైన్యాధ్యక్షులు, వారికి దైవప్రవక్త (స) గారి హితబోధ

దైవప్రవక్త (స) ఈ సైన్యానికి సైన్యాధ్యక్షునిగా హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర)ను నియమించారు. వారికి హితబోధ చేస్తూ, ఒకవేళ జైద్ (ర) చంపబడితే జాఫర్ (ర), జాఫర్ (ర) చంపబడితే అబ్దుల్లా బిన్ రవాహా సైన్యాధ్యక్షులవుతారు.[2]

మహాప్రవక్త (స) సైన్యం కొరకు తెల్లజెండా కట్టి దాన్ని హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర)గారి చేతికి అందించారు.[3] వెళ్ళే సైన్యానికి హితబోధ చేస్తూ, "ఆ ప్రదేశానికి చేరగానే ప్రజలను ఇస్లామ్ వైపునకు ఆహ్వానించండి. ఒకవేళ వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే మంచిదే. అలా జరగని పక్షంలో వారు దైవ సహాయాన్ని కోరండి. యుద్ధం ప్రారంభించండి." మహాప్రవక్త (స) ఇలా కూడా హితబోధ చేశారు వారికి; "మీరు అల్లాహ్ పేరుతో, అల్లాహ్ మార్గంలో, అల్లాహ్‌ను తిరస్కరించేవారితో పోరాడండి. చూడండి! వాగ్దానభంగం చేయ కూడదు. బాధ్యతలను విస్మరించవద్దు. ఏ స్త్రీనిగానీ, చిన్నపిల్లలనుగానీ, వృద్ధుల్ని గానీ, చర్చిల్లో ఉంటూ సన్యాసం పుచ్చుకున్న ఏ ఒక్కరిని గాని హత మార్చవద్దు. ఖర్జూరపు చెట్టును గానీ, మరే వృక్షాన్నిగాని నరకివేయకూడదు. అలాగే ఏ కట్టడాన్ని కూడా కూల్చకూడదు."[4]

## ఇస్లామీయ సైన్యం బయలుదేరడం - అబ్దుల్లా బిన్ రవాహా (ర) గారి దుఃఖం

ఇస్లామీయ సైన్యం బయలుదేరడానికి సిద్ధమైంది. ప్రజలందరూ వచ్చి మహాప్రవక్త (స) గారు నియమించిన సైన్యాధ్యక్షులను సాగనంపుతూ వారికి సలాములు చెబుతున్నారు. అదే సమయంలో సర్వ సైన్యాధ్యక్షులైన హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) దుఃఖించనారంభించారు. "మీరెందుకు ఏడుస్తున్నారు?" అని ప్రజలు ఆయన్ను అడగగా, "చూడండి దైవసాక్షి! (ఈ ఏడ్పుకు) ప్రపంచ వ్యామోహం లేదా మీతో గల సంబంధం అసలు దీనికి కారణం కాదు. నేను దైవప్రవక్త (స)ను దివ్యఖుర్ఆన్‌లోని ఓ ఆయత్‌ను పఠిస్తూ ఉండగా విన్నాను. ఆ ఆయత్‌లో నరక ప్రస్తావన ఉంది. ఆ ఆయత్ ఇది:

---

2. సహీ బుఖారి- మూతా యుద్ధ అధ్యాయం-2/611.
3. ముక్తసిరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్-పుట.327
4. ముక్తసిరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లాహ్- పుట.327; రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/271

https://teluguislam.net



"మీలో నరకం దరిదాపులకు పోనివాడు ఎవడూ లేడు. ఇది ఓ నిర్ణీత విషయమే." (19 : 71)

"నరకం దాపుకు వెళ్ళిన తరువాత అక్కడి నుండి నేను ఎలా వెనక్కి వస్తానో నాకు తెలియదు. అందుకనే ఈ దుఃఖం" అన్నారాయన.

"అల్లాహ్ మీకు తోడుంటాడు. మిమ్మల్ని క్షేమంగా పరిరక్షిస్తాడు. ఆయన మిమ్మల్ని కాపాడుగాక! విజయ ధనంతో మిమ్మల్ని మా వద్దకు తీసుకువచ్చుగాక!" అని దీవించడం నారంభించారు వారందరు. హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ్ (ర) మాత్రం కొన్ని పద్యపాదాలను చదివారు. వాటి అర్థం ఇలా ఉంది:

"కాని నేను రహ్మాన్ నుండి కోరుకునేదల్లా ఆయన మన్నింపును, నా ఎముకలను విరిచే, నా తలను నరికే లేదా ఓ బల్లెం విసిరే వాని చేత విసరబడిన బల్లెం నా శరీరం నుండి ఆవలికి వెళ్ళే ప్రహారాలను కోరుకుంటున్నాను. నేను చనిపోయిన తరువాత నా సమాధిని చూసి వెళ్ళేవారు, అయ్యో. ఇది అల్లాహ్ చేత మార్గం చూయించబడిన వ్యక్తి సమాధి" అని అనుకోవాలి.

ఆ తరువాత సైన్యం బయలుదేరింది. మహాప్రవక్త (స) దాన్ని సాగనంపుతూ సనియతుల్ విదా వరకు వెళ్ళారు. అక్కడ నుండే ఆ సైన్యానికి వీడ్కోలు పలికారు.[5]

## ఇస్లామీయ సైన్యం ముందడుగు- అనుకోకుండా ఎదురైన గడ్డు పరిస్థితి

ఇస్లామీయ సైన్యం ఉత్తరం వైపునకు పయనిస్తూ 'ముఆన్' అనే ప్రదేశానికి చేరింది. ఇది ఉత్తర హిజాజ్‌కు అనుకొని ఉన్న సిరియా (జోర్డాన్) ప్రాంతంలోని ఓ ప్రదేశం. ఇక్కడ సైన్యం విడిది చేసింది. వేగులవారు, రోమన్ చక్రవర్తి హిరక్ల్, 'బల్కా' ప్రాంతంలోని 'మాఆబ్'లో లక్ష మంది రోమను సైన్యంతో సహా విడిది చేసి ఉన్నాడని, అతని జెండా క్రింద లక్మ్, జిజామ్, బల్కీన్, బహ్రా మరియు బలీ అరబ్బు తెగలకు చెందిన మరో లక్ష మంది కూడా ఉన్నారని వార్త అందించారు.

---

5. ఇబ్నె హిషామ్ *2/373, 374* జాదుల్ మఆద్-*2/156* ముక్తరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లా *327*

https://teluguislam.net



## 'మఆన్'లో సలహా సంఘం భేటీ

ఇంత పెద్ద సైన్యాన్ని ఎదుర్కోవలసి వస్తుందని ముస్లిములు ఊహించనైనా ఊహించలేదు. ఓ సుదూర ప్రాంతంలో అనుకోకుండా అలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఎవ్వరూ అనుకోలేదు. ప్రస్తుతం వారి ముందున్న ప్రశ్నల్లా, మూడు వేల మంది సైనికులు, రెండు లక్షల సైన్యంగల ఓ మహా సముద్రంలాంటి సేనతో ఢీకొనడం ఎలా అన్నదే. ముస్లిములు ఈ పరిస్థితిలోనే 'మఆన్'లో రెండు రాత్రిళ్ళు సలహాలతోనే గడిపేశారు. కొందరు మాత్రం, మనం దైవప్రవక్త (స)కు లేఖ రాసి శత్రువు సేన బలం గురించి తెలియజేయాలన్నారు. ఆ తరువాత ఆయన మదీనా నుండి సైన్యాన్ని సహాయంగా పంపించవచ్చు, లేదా మరే ఆదేశం అయినా ఇవ్వవచ్చు వేచి చూద్దాం అని సలహా ఇచ్చారు.

కాని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర) వారి ఈ సలహాలను వ్యతి రేకిస్తూ, "ప్రజలారా! దైవసాక్షి! దేని గురించైతే మీరు వెనకా ముందాడు తున్నారో అది 'షహాదత్' (అమరత్వం), ఆ షహాదత్ పొందడానికే కదా మీరు ఇంత దూరం వచ్చింది? చూడండి! శత్రువుతో మన పోరాటం దాని సంఖ్యా బలం, ఆయుధ బలం ఆధారంగా కాదు. కేవలం మనం పోరాడేది అల్లాహ్ మనకు మార్గం చూపిన ఆ ధర్మబలం ఆధారంగానే. పదండి! ముందుకు ఉరకండి. మనకు రెండు మేళ్ళలో ఏదో ఒకటి లభించి తీరుతుంది. మనమైనా వారిపై ఆధిక్యతను పొందగలం లేదా అమరగతి అయినా నొందుదాం" అని సైన్యానికి క్రొత్త ఊపిరి పోశారు. చివరికి అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర)గారు ప్రతిపాదించిన విషయమే ఖరారు అయింది.

## శత్రువు వైపునకు ముందడుగు వేసిన ఇస్లామీయ సైన్యం

ఎలాగైతేనేమి ఇస్లామీయ సైన్యం మఆన్‌లో రెండు రాత్రులు గడిపిన తరువాత శత్రువు వైపునకు కదిలి వెళ్ళింది. బల్కాలోని ఓ బస్తీ 'మషారిఫ్' వద్ద హిరక్ల్ సైన్యంతో ముఖాముఖిగా నిలిచింది. శత్రువు మరింత చేరువకు రాగానే ముస్లిములు 'మూతా' వైపునకు వెళ్ళి అక్కడ విడిది చేశారు. ఆ పిదప సైన్యాన్ని యుద్ధం చేసేందుకు తీర్చిదిద్దారు దాని సైన్యాధ్యక్షులు. మైమనా (కుడి పార్శ్వం)కు ఖుత్బా బిన్ ఖతాదా అజ్రీ (ర) నియమితులవగా, మైసరా (ఎడమ పార్శ్వం)కు ఉబాదా బిన్ మాలిక్ అన్సారి (ర) నియమించ బడ్డారు.

https://teluguislam.net



## యుద్ధారంభం - సైన్యాధ్యక్షులు ఒకరి తరువాత మరొకరు అమరత్వం పొందడం

మూతాలోనే ఉభయ సేనల్లో పోరు ప్రారంభం అయింది. అది అతిభయంకరమైన పోరాటం. మూడు వేల మందిగల చిన్న సైనిక పటాలం, రెండు లక్షల మిడతల దండులాంటి అపార సేనావాహిని ప్రహారాలను ఎదుర్కొంటోంది. అది ఓ విచిత్రమైన పోరాటం. ఆశ్చర్యంగా గమనిస్తోంది ప్రపంచం. అయితే విశ్వాసం గాలి వీస్తున్నప్పుడు ఇలాంటి విచిత్ర పరిస్థితులే ఉనికిలోనికి వస్తాయి మరి.

అందరికంటే ముందు దైవప్రవక్త (స) గారికి ప్రియాతి ప్రియులైన హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) జెండా పుచ్చుకున్నారు. ఆ జెండా చేతికి రాగానే, ఇస్లామీయ యోధుల్లో తప్ప మరెవ్వరిలోనూ కానరాని సాహసంలా ప్రాణాలకు తెగించి పోరాడనారంభించారు. అలా యుద్ధం చేస్తూ ఆయన శత్రువుల బల్లేలకు నేల ఒరిగి షహీద్ అయిపోయారు.

ఆ తరువాత హజ్రత్ జాఫర్ (ర) వంతు వచ్చింది. ఆయన పడిపోయిన జెండాను చేతబట్టి పైకి ఎత్తి భీకరంగా పోరాడనారంభించారు. యుద్ధం బాగా ఊపందుకున్నప్పుడు ఆయన ఎరుపు, తెలుపు మచ్చలుగల గుర్రం మీది నుండి దూకేశారు. ఖడ్గ ప్రహారాలు చేస్తూ తమపై బడుతున్న దెబ్బలను దానితో అడ్డుకోనారంభించారు. చివరికి శత్రువు వేసిన దెబ్బకు ఆయన కుడి చేయి తెగిపోయింది. జెండాను ఆయన ఎడమ చేతబట్టుకొని క్రిందపడకుండా ఆపుతున్నారు. చివరికి ఎడమ చేయి కూడా తెగిపోయింది. ఇక తెగిపోయి మొండాలైన బాహువుల సహాయంతో ఆ జెండాను తన ఒడిన ఉంచుకొని అమరత్వం పొందే వరకు అలానే లేపి ఉంచారు. ఓ రోము సైనికుడు వేసిన ఖడ్గప్రహారంతో ఆయన రెండు ముక్కలుగా తెగిపోయారని చెప్పడం జరుగుతోంది. అల్లాహ్ ఆయన తెగిన రెండు చేతులకు బదులు స్వర్గంలో రెండు రెక్కలను ప్రసాదించాడు. వాటి సహాయంతో ఆయన స్వర్గంలో ఎక్కడికైనా ఎగిరి వెళ్ళగలరు. అందుకనే ఆయన బిరుదు 'జాఫరె తయ్యార్' మరియు 'జాఫరె జుల్ జినాన్'గా పడిపోయింది.

(తయ్యార్ అంటే ఎగిరేవాడు అని, జుల్ జినాన్ అంటే రెండు రెక్కలు గలవాడు అని అర్థం.)

https://teluguislam.net



ఇమామె బుఖారి, 'నాఫె' ద్వారా ఇబ్నె అబ్బాస్ (ర)గారి ఈ కథనాన్ని ఉటంకించారు. ఆ కథనంలో హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర)గారు ఇలా అంటారు.

"నేను మూతా యుద్ధం జరుగుతూ ఉండగా హజ్రత్ జాఫర్ (ర)గారి వద్దకు వెళ్ళి చూడగా ఆయన అమరగతిని పొంది ఉన్నారు. నేను ఆయన మృతదేహం వద్ద నిలబడి ఆయన శరీరంపై బడిన ఖడ్గ ప్రహారాలను, శూలాలు దిగిన గాయాలను లెక్కించగా అవి మొత్తం యాభై గాయాలున్నాయి. వాటిలో ఏ గాయం కూడా వెనుక వైపు నుండి తగిలిన గాయం కాదు."[6]

మరో ఉల్లేఖనంలో ఇబ్నె ఉమర్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది.

"నేను ముస్లిముల వెంట ఉన్నాను. మేమందరం హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్‌ను వెతుకుతూ ఉండగా ఆయన్ను మేము హతుల్లో పడి ఉండగా కనుగొన్నాము. ఆయన శరీరంపై ఖడ్గం మరియు బల్లేల గాయాలు తొంభై కంటే ఎక్కువగానే ఉన్నాయి."[7] నాఫె ద్వారా ఉమర్ (ర) గారి ఉల్లేఖనంలోనే ఈ విషయం అదనంగా ఉంది; "ఆ గాయాలన్నీ ఆయన శరీరానికి ఎదుటి భాగంలో అయిన గాయాలే".[8]

ఇలా ధైర్యం ఉట్టిపడేలా చేసిన యుద్ధంలో హజ్రత్ జాఫర్ (ర) కూడా అమరగతిని పొందారు. ఇప్పుడు హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) జెండాను ఎత్తుకొని తన గుర్రమెక్కి ముందుకు కదిలారు. కాని కొంత ఆలోచనలో పడిపోయారు. కాని ఆ తరువాత ఇలా అంటూ శత్రువును ఢీకొన్నారు.

"ఓ మనసా! నీవు తప్పకుండా వారిని ఢీకొను, ఇష్టంగానైనా, అయిష్టంగానైనా. వీరు యుద్ధాన్ని రగిలిస్తున్నారు. శూలాలను నీ వైపునకు గురిపెట్టి ఉన్నారు. మరి నీవెందుకు స్వర్గాన్ని కాదంటున్నావు?"

అంతలోనే ఆయన పినతండ్రి కుమారుడు మాంసం ఉన్న ఓ ఎముకను ఆయనకు అందిస్తూ దీన్ని తిని కొంత శక్తిని కూడగట్టుకోండి.

---

6. సహీ బుఖారి, సిరియాలో జరిగిన మూతా యుద్ధ అధ్యాయం-2/611.
7. సహీ బుఖారి, సిరియాలో జరిగిన మూతా యుద్ధ అధ్యాయం-2/611.
8. ఫత్‌హుల్ బారి-7/512. చూడ్డానికి రెండు ఉల్లేఖనాల్లో సంఖ్య గురించి తేడా ఉంది. అయితే ఆ సంఖ్యలో బాణాలు గుచ్చుకోగా అయిన గాయాలను కలుపు కుంటే ఆ సంఖ్య పెరిగిపోతుంది.

https://teluguislam.net



మీరు ఈ కాలంలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు అని అన్నాడు. ఆయన ఆ ఎముకను తీసుకొని ఓసారి నోటబెట్టి మాంసాన్ని పీకి నమిలారు. ఆ తరువాత దాన్ని పారవేసి యుద్ధం చేస్తూ అమరగతిని పొందారు.

## దైవకరవాలాల్లో ఓ కరవాలం చేతిలో ఇస్లామీయ యుద్ధ పతాకం

జెండా క్రిందపడిపోగానే బనూ అజ్లాన్‌కు చెందిన సాబిత్ బిన్ అర్కమ్ అనే సహాబీ ఒకరు దాన్ని పైకి ఎత్తి, "ముస్లిములారా! మీలోని మరొక్కరిని సైన్యాధ్యక్షునిగా చేసుకోండి" అని అరిచాడు.

"మీరే ఆ పని చేయండి" అని చెప్పారు ముస్లిములు.

"కాదు! నేను ఈ పని చేయలేను" అన్నారు సాబిత్.

అనంతరం సహాబాలందరూ కలసి ఖాలిద్ బిన్ వలీద్ (ర)ను సైన్యాధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఆయన జెండాను ఎత్తుకుంటూనే భయంకరంగా శత్రువుపై విరుచుకుపడ్డారు.

సహీ బుఖారీలో స్వయంగా హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)గారి ఉల్లేఖనం ఇలా గ్రంథస్థమై ఉంది;

"మూతా యుద్ధం జరిగిన నాడు నా చేతిలో మొత్తం తొమ్మిది కరవాలాలు విరిగిపోయాయి. చివరికి నా చేతిలో కేవలం ఒకే ఒక యమనీ ఖడ్గం (చిన్న ఖడ్గం) మాత్రం మిగిలిపోయింది."[9]

ఇంకో ఉల్లేఖనంలో ఆయన ఇలా ఉల్లేఖిస్తున్నారు.

"మూతా యుద్ధం జరిగిన రోజున నా చేతిలో తొమ్మిది కరవాలాలు విరిగిపోయాయి. కేవలం ఒక్క 'యమనీ బానా' అనే చిన్న కత్తి మాత్రం నా చేతిలో మిగిలిపోయింది."[10]

ఇటు దైవప్రవక్త (స)కు ఆ యుద్ధం జరిగిన రోజున్నే- అప్పటికి యుద్ధ రంగం నుండి ఎలాంటి వార్త అందలేదు- వహీ (దివ్యవాణి)ద్వారా అల్లాహ్ అక్కడి పరిస్థితుల్ని తెలియజేయగా సహాబా (ర) నుద్దేశించి ఇలా సెలవిచ్చారు.

"జెండాను జైద్ తీసుకున్నారు. ఆయన షహీద్ అయిపోయారు. ఆ తరువాత జాఫర్ దాన్ని ఎత్తి పట్టుకోగా ఆయన కూడా అమరగతిని పొందారు. పిదప దాన్ని ఇబ్నె రవాహా తీసుకున్నారు. ఆయన కూడా అమరత్వం

---

*9. సహీ బుఖారి-మూతా యుద్ధ అధ్యాయం-2/611.*

*10. సహీహ్ బుఖారి; గజ్వయె మూతా మిన్ అర్దుష్షామ్ అధ్యాయం-2/611.*

https://teluguislam.net



పొందారు."-మహాప్రవక్త (స)కళ్ళ వెంట అశ్రుధారలు రాలుతున్నాయి- చివరికి జెండాను అల్లాహ్ కరవాలాల్లోని ఒక కరవాలం దాన్ని చేతబూనింది. (ఆయన చేసిన యుద్ధం వల్ల) అల్లాహ్ ఆయనకు విజయం చేకూర్చాడు."[11]

## యుద్ధాంతం

ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలు ప్రదర్శించి యుద్ధం చేసినప్పటికీ, ముస్లిముల ఈ చిన్న సైనిక దళం, రోమనుల సేనావాహిని ముందు ఎలా నిలబడగలిగింది? అన్నది ఆశ్చర్యకరమైన విషయం. ఈ గడ్డు పరిస్థితిలో హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ముస్లిములను ఆ యుద్ధం సుడిగుండం నుంచి బయటపడవేయడానికి స్వయంగా తానే అందులోకి దుమికేశారు. తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

ఈ యుద్ధ పరిణామాలు ఎలాగున్నాయి అనే విషయంలో ఉల్లేఖనాల్లో చాలా తేడా అగుపడుతున్నప్పటికీ, ఆ ఉల్లేఖనాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని చూస్తే పరిస్థితి ఏమిటో మనకు అర్థం అవుతుంది.

యుద్ధం మొదటి రోజు ఖాలిద్ బిన్ వలీద్ (ర) రోమనులను ధైర్యంగా అడ్డుకున్నారు. కాని ఆయన, రోమనులను భయభీతులుగా చేసి ముస్లిము లను వారి బారి నుండి ఎలా తప్పించాలి? ముస్లిములను తరమ కుండా వారిని ఎలా నిలువరించాలి? అనే యుద్ధవ్యూహరచనను గురించి ఆలోచి స్తూనే ఉన్నారు. ముస్లిములే గనక పారిపోనారంభిస్తే, రోమనులు వారిని తరుముకు వస్తే వారిని కాపాడడం ఎంతో కష్టం మరి.

రెండో రోజు పొద్దు పొడవగానే, ఆయన తన సేనాబలాన్ని, దాని రూపురేఖల్నీ మార్చిపారేశారు. దాన్ని కొత్త తరహాలో తీర్చిదిద్దారు. మొదటి వరుసను వెనుకటి వరుసలోనూ, వెనుకటి వరుసను ముందు వరుసలోనూ నియమించారు. అలాగే కుడి పార్శ్వాన్ని ఎడమ పార్శ్వంలోనికి, ఎడమ పార్శ్వాన్ని కుడి పార్శ్వం స్థానంలోనికి మార్చివేశారు. ఇది చూసిన శత్రువులు నివ్వెరపోయారు. వారు పరస్పరం, "ముస్లిములకు సైనిక సహాయం అందింది" అని అనుకోనారం భించారు. ఎలాగైతేనేమి రోమనులు మొదట్లోనే ముస్లిములంటే భయపడ నారంభించారు. ఆ తరువాత రెండు సైన్యాలు ఢీకొనగా కొంతసేపు యుద్ధం జరిగింది. అప్పుడు ఖాలిద్ తన సైన్యాన్ని ఓ

11. సహీహ్ బుఖారి-గజ్వయె మూతా మిన్ అర్దుష్షామ్ అధ్యాయం-2/611.

https://teluguislam.net



సురక్షిత ప్రదేశంలో ఉంచుతూ, ముస్లిములను కొంత వెనక్కు తగ్గమని ఆదేశించారు. ముస్లిములు అలా వెనక్కు తగ్గుతున్నప్పుడు రోమనులు, ముస్లిములు వారిని మోసగిస్తున్నారని, వారు ఎడారి యుద్ధానికి సంబంధించిన ఏదో ఒక ఎత్తుగడ వేస్తున్నారని భావించి ముస్లిములను తరమడం మానివేశారు. దీని ఫలితంగా శత్రువులు తిరిగి తమ ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఇటు ముస్లిములు విజయ పతాకాన్ని ఎగురవేస్తూ సురక్షితంగా వెనకకు తగ్గి మదీనాకు వచ్చి చేరారు.[12]

## ఇరుపక్షాలకు చెందిన హతుల సంఖ్య

ఈ యుద్ధంలో పన్నెండుగురు ముస్లిములు షహీద్ అయ్యారు. రోమను హతుల సంఖ్య ఎంతో తెలియరాలేదు. అయితే జరిగిన యుద్ధం తీరు గురించి తెలుసుకున్నదేమిటంటే, వారు పెద్ద సంఖ్యలోనే హతులై ఉండవచ్చు. కేవలం హజ్రత్ ఖాలిద్ (ర) గారి చేతిలోనే తొమ్మిది కరవాలాలు విరిగిపోతే హతులు, క్షతగాత్రుల సంఖ్య ఎంత ఉంటుందో ఊహించు కోవచ్చు.

## ఈ యుద్ధ ప్రభావం

ఈ యుద్ధం కోసం ముస్లిములు ఏ కష్టాలను అనుభవించారో, ఆ కష్టాలకు తగినట్లుగా శత్రువుపై పగ తీర్చుకోలేకపోయినప్పటికీ, ఈ పోరాటం వలన ముస్లిముల భయం, వారి ప్రఖ్యాతి చాలా మటుకు పెరిగిపోయిందని చెప్పవచ్చు. దీనికి కారణం లేకపోలేదు. ఎందుకంటే, రోమనులు ప్రపంచంలో కెల్లా ఓ సూపర్ పవర్‌గా వెలుగొందుతున్న కాలమది. వారితో కయ్యం పెట్టుకోవడం ఆత్మహత్యాసదృశంగా తలచేవారు ఆనాటి అరబ్బులు. అందు కని మూడు వేల మంది గలిగిన ఓ చిన్న సైనిక దళం రెండు లక్షల ఓ భారీ సైన్యాన్ని ఢీకొని ఎలాంటి నష్టం వాటిల్లకుండా తిరిగిరావడం అరబ్బులందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది. అప్పటి వరకు అరబ్బులకు ఎవరి గురించి అయితే తెలుసో, ముస్లిములు వారికంటే కూడా భిన్నమైనవారుగా, భిన్నమైన మనస్తత్వం గలవారుగా తెలియవచ్చింది. ముస్లిములు అల్లాహ్ ద్వారా

12. చూడండి, ఫత్‌హుల్ బారి-7/513, 514; జాదుల్ ముఆద్-2/156. యుద్ధం వివరాలు ఆధారాలతో సహా ఈ రెండు గ్రంథాల నుండి గ్రహించడం జరిగింది.

https://teluguislam.net



సహాయం పొందారని, వారి నాయకుడు నిజంగానే ఓ ప్రవక్త అని తెలిసి వచ్చింది వారికి. ముస్లిములతో ఎడతెగకుండా పోరుసలిపే మంకుపట్టుగల ఏ అరబ్బు ఆటవిక తెగలైతే ఉన్నాయో అవన్నీ ఈ పోరాటం తరువాత ఇస్లామ్ ధర్మం వైపునకు మొగ్గు చూపనారంభించాయి. బనూ సులైమ్, అష్జ, గత్ఫాన్, జీబాన్ మరియు ఫరాజా తెగలన్నీ ఆ తరువాతనే ఇస్లామ్ ఛత్రఛాయ ల్లోనికి వచ్చేశాయి.

రోమనులతో జరిగిన ఈ రక్తపాత సహిత పోరాటం, భవిష్యత్తులో రోమను సామ్రాజ్య దేశాలపై విజయ దుందుభులు మ్రోగించడానికి, సుదూర తీరాల వరకు ముస్లిముల అధికారం బలపడడానికి కారణభూతం అయింది.

## సరియ్యా జాతుస్సలాసిల్

మూతా పోరాటం సందర్భంగా సిరియాలో నివసించే అరబ్బు తెగలు ముస్లిములతో యుద్ధం చేయడానికిగాను రోమనుల పతాకం క్రిందికి వచ్చారన్న విషయం తెలిసిన మహాప్రవక్త (స)కు, ఆ అరబ్బు తెగలకు, రోమనులకు నడుమ చీలిక తెచ్చి వారు తిరిగి ముస్లిములకు వ్యతిరేకంగా అంత పెద్ద సైన్యాన్ని కూడగట్టకుండా ఉంచడానికిగాను ఓ వ్యూహాన్ని పన్నవలసి ఉందనే తలంపు కలిగింది.

దీని కోసమని ఆయన (స) హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర)ను ఎంపిక చేశారు. కారణం, ఆయన నాయనమ్మ బలీ తెగకు చెందినది కావడం. మూతా యుద్ధం తరువాత, అంటే జమాదిల్ ఉఖ్రా నెల హి.శ. 8లో వారిని మార్చ డానికిగాను హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర)ను అక్కడికి పంపించడం జరిగింది. ఈలోపు వేగులవారు, బనూ ఖుజాఅ తెగవారు మదీనా పరిసరాలపై దాడి చేయడానికి మనుషుల్ని సమీకరిస్తున్నారనే వార్తను అందించినట్లుగా చెప్పుకోవడం జరుగుతోంది. కాబట్టి ఆయన (స) హజ్రత్ అమ్రూ బిన్ ఆస్(ర)ను అటు వైపునకు పంపించి ఉండవచ్చు. బహుశా ఈ రెండు కారణాలు కూడా ఆయన్ను పంపించడానికి పురికొల్పి ఉండవచ్చు.

మొత్తానికి, దైవప్రవక్త (స), అమ్రూ బిన్ ఆస్(ర) కోసం శ్వేత పతాకాన్ని కట్టి, దానికి తోడు నల్ల జెండాలను కూడా ఇచ్చారు. ఆయన నేతృత్వంలో అన్సారులకు చెందిన ప్రముఖులు మూడొందల మంది ఉన్నారు. వారి

https://teluguislam.net



వెంట ముప్ఫై గుర్రాలు కూడా ఉన్నాయి. వెళ్ళేటప్పుడు మహాప్రవక్త (స) ఆయన్ను ఆదేశిస్తూ, బలీ, ఇజ్రా, బల్కేన్ తెగలకు చెందినవారితో కలిసి వారి సహాయ సహకారాలను కోరాలని చెప్పారు. వారంతా రాత్రి పూట ప్రయాణిస్తూ పగలు దాగి ఉండేవారు. చివరికి శత్రు సైన్యం వరకు చేరగా అది సంఖ్యాపరంగా పెద్ద సైనిక పటాలం అని తెలిసింది. అందుకని ఆయన హజ్రత్ రాఫె బిన్ ముకీస్ జుహ్నీని మరింత సైనిక సహాయం అందించమని దైవప్రవక్త (స) సన్నిధికి పంపించారు. మహాప్రవక్త (స) హజ్రత్ అబూ ఉబైదా (ర) బిన్ జర్రాహ్‌కు జెండా ఇచ్చి ఆయన నేతృత్వంలో మరి రెండొందల మంది సైనికులనిచ్చి పంపించడం జరిగింది. ఆ సైన్యంలో ముహాజిర్ ప్రముఖులు- అబూ బక్ర్(ర) మరియు ఉమర్(ర)లు- అన్సారు సర్దారులు కూడా ఉన్నారు. అబూ ఉబైదాకు, అమ్రూ బిన్ ఆస్ (ర)ను కలుసుకొని ఇద్దరు కలసి కార్యాన్ని సాధించుకురమ్మని, విభేదాలు సృష్టించుకోవద్దని చెప్పి పంపించారు. అక్కడికి వెళ్ళిన హజ్రత్ అబూ ఉబైదా (ర) నమాజుకు ఇమామత్ చేయబోగా హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర), "మీరు నా వద్దకు మద్దతుగా వచ్చిన వారు, నేను అమీరును (నాయకుణ్ణి)" అనగా అబూ ఉబైదా (ర) ఆయన మాటలను స్వీకరించారు. నమాజు హజ్రత్ అమ్రూ బిన్ ఆస్ (ర) గారే చేయిస్తూ ఉండేవారు.

సహాయం అందగానే ఈ సైన్యం మరికొంత ముందుకు నడిచి 'ఖజా' అనే ప్రాంతానికి చేరుకుంది. ఆ ప్రాంతాన్ని దాటి చాలా దూరం వరకు వెళ్ళిపోయింది. చివరకు అక్కడ శత్రు సైన్యం ఎదురైంది. ముస్లిములు ఆ సైన్యంపై దాడిచేయగా అది పారిపోయి తలదాచుకోవలసివచ్చింది.

అనంతరం అవుఫ్ బిన్ మాలిక్ అష్జయీ (ర)ను దూతగా చేసి దైవప్రవక్త (స) సన్నిధికి పంపించారు. ఆయన ముస్లిములు తిరుగుముఖం పట్టి క్షేమంగా వస్తున్నారని, ఆ పోరాటం ఎలా జరిగిందో ఆ వివరాలన్నీ మహాప్రవక్త (స)కు పూస గ్రుచ్చినట్లు విశదీకరించారు.

జాతుస్సలాసిల్, వాదియిల్ ఖుర్ఆ అవల ఉన్న ఓ భూభాగం పేరు. ఇక్కడి నుండి మదీనా పది రోజుల ప్రయాణ దూరంలో ఉంది. ఇబ్నె ఇస్‌హాక్ కథనం ప్రకారం, ముస్లిములు జిజామ్ తెగకు చెందిన ప్రాంతంలోని ఓ

https://teluguislam.net



ఊటబావి దగ్గర విడిది చేశారు కాబట్టి ఆ సైనిక చర్య పేరు జాతుస్సలాసిల్‌గా పడిపోయింది.[13]

## సరియ్యా ఖిజ్రా (షాబాన్ నెల, హి.శ. 8)

ఈ సరియ్యాను పంపించడానికి గల కారణం, మహారిబ్ తెగ ప్రాంతంలో ఖిజ్రా పేరుగల ఓ ప్రదేశంలో బనూ గత్ఫాన్ సైన్యాన్ని సమీకరిస్తున్నారనే వార్త అందడమే. దాన్ని అణచడానికి మహాప్రవక్త (స), హజ్రత్ అబూ ఖతాదా (ర)గారికి పదిహేనుగురు మనుషులనిచ్చి అక్కడికి పంపించారు. వారు శత్రువుకు చెందిన అనేకుల్ని హతమార్చారు. చాలా మందిని బందీలుగా చేసి విజయ ధనంతో తిరిగి వచ్చారు. ఈ సైనిక చర్య సందర్భంగా వారు మదినాకు వెలుపల పదిహేను రోజులు గడపవలసివచ్చింది.[14]

13. చూడండి, ఇబ్నె హిషామ్ -2/623-626; జాదుల్ మఆద్-2/157
14. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/233; తల్ఖీహుల్ ఫహూమ్- పుట.33

https://teluguislam.net



# మక్కా విజయం

ఇమామె ఇబ్నె ఖైమ్ తన గ్రంథం జాదుల్ ముఆద్‌లో ఈ విజయం గురించి ఇలా రాస్తున్నారు.

"మక్కా విజయం ఓ ఘనమైన విజయం. అల్లాహ్ దీని ద్వారా తన ధర్మానికీ, తన ప్రవక్త (స)కూ, తన సైన్యానికీ, అమానత్తుదారు అయిన తన వర్గానికి శాశ్వత గౌరవాన్ని ప్రసాదించిన ఘన విజయం. తన నగరాన్ని, ప్రపంచ ప్రజలకు మార్గదర్శకమైన తన గృహాన్ని, దైవ తిరస్కారులు, ముష్రిక్కుల నుండి అల్లాహ్ ముక్తిని ప్రసాదించిన విజయమది. ఈ విజయం వల్ల ఆకాశ వాసులు ఆనందడోలికలలో ఓలలాడారు. దాని గౌరవం ఆకాశాన్నంటింది. ఈ విజయం కారణంగానే ప్రజలు అల్లాహ్ ధర్మంలో గుంపులు గుంపులుగా ప్రవేశించారు. భూపటలం అంతా ఆనందంతో వెల్లివిరిసింది.[1]

## ఈ గజ్వాకు దారితీసిన కారణాలు

సులే హుదైబియా (హుదైబియా ఒప్పందం) జరిగినప్పుడు ఆ ఒప్పందంలోని ఓ షరతు ప్రకారం, ఎవరైతే ముహమ్మద్ (స)గారితో మైత్రి చేసుకోదలుస్తారో వారు ఆయనతో మైత్రీ సంబంధాలు పెట్టుకోవచ్చని, అలాగే ఎవరైతే ఖురైషులతో కలసి ఉండేందుకు సిద్ధపడతారో, వారు ఖురైషులతోనే ఉండవచ్చు. అలాగే ఏ తెగ అయితే వాటిలో ఏ పక్షం వైపు ఉంటుందో అది ఆ పక్షంగానే గుర్తించబడుతుంది. కాబట్టి ఏ తెగ అయినా దౌర్జన్యానికి బలి అయితే ఆ దౌర్జన్యం ఆ పక్షంపై జరిగినట్లుగానే భావించబడుతుంది అన్నది మనం చదువుకున్న విషయమే.

ఈ షరతుకు లోబడి బనూ ఖుజాఅ తెగ దైవప్రవక్త (స) పక్షాన, బనూ బక్ర్ ఖురైష్ పక్షాన చేరిపోయాయి. అలా ఈ రెండు తెగలు కూడా ఒకదాని పీడనకు మరొకటి బలి కాకుండా ప్రశాంతంగా ఉంటున్నాయి. కాని ఈ

1. జాదుల్ ముఆద్

https://teluguislam.net



రెండు తెగల్లోనూ అజ్ఞాన కాలం నుండే శత్రుత్వం, సంఘర్షణలు బాగా వ్రేళ్ళూనుకొని ఉన్నందున, ఆ ఒప్పందం జరిగిన తరువాత ఈ ప్రశాంత వాతావరణ అవకాశాన్ని ఆసరాగా తీసుకొని బనూబక్ర్, బనూ ఖుజాఅతో పాత పగతీర్చుకోడానికి పూనుకున్నారు. 'నౌఫిల్ బిన్ ముఆవియా వేలీ' అనే వ్యక్తి బనూ బక్ర్‌కు చెందిన ఓ వర్గాన్ని వెంట బెట్టుకొని షాబాన్ నెల హి.శ. 8లో రాత్రి సమయంలో 'బనూ ఖుజాఅ'పై దాడి చేశాడు. ఆ సమయంలో బనూ ఖుజాఅ 'వతీర్' అనే ఒయాసిస్సు వద్ద గుడారాలు వేసుకొని ఉన్నారు. బనూ ఖుజాఅకు చెందిన అనేకమంది హతులయ్యారు. ఇటు ఖురైష్ వారు ఈ దాడిలో బనూ బక్ర్‌కు ఆయుధాలిచ్చి సహాయపడడమే కాకుండా చీకటిని ఆసరాగా చేసుకొని వారు కూడా ఆ పోరాటంలో పాల్గొన్నారు. ఎలాగైతేనేమి, దాడి చేసిన వారు బనూ ఖుజాఅను ఓడించడం వలన వారు దైవగృహానికి వచ్చి చేరారు. హరమ్ (దైవగృహం)లోనికి చేరిన బనూ బక్ర్ నౌఫిల్‌తో, "ఓ నౌఫిల్! మనమిప్పుడు హరమ్‌లోనికి వచ్చేశాము. ఇది మీ ఆరాధ్య దైవగృహం" అన్నారు. దానికి నౌఫిల్ జవాబిస్తూ, "బనూ బక్ర్! నేడు ఏ దేవుడూ లేడు. కావాలంటే పగ తీర్చుకోండి. నా అనుభవం సాక్షి! మీరు దైవగృహంలో దొంగతనం చేస్తూ ఉండేవాళ్ళు కదా? మరి మీ పగను తీర్చుకోలేరా?" అని ప్రశ్నించాడు.

ఇటు బనూ ఖుజాఅ మక్కా చేరి, 'బుదైల్ బిన్ వర్కా ఖుజాయి' మరియు వారిచే స్వాతంత్ర్యం పొందిన బానిస రాఫె ఇండ్లల్లో రక్షణ పొందారు. అమ్రూ బిన్ సాలిమ్ ఖుజాయీ హుటాహుటిన మదీనాకు బయలుదేరి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి నిలబడ్డారు. అప్పుడు మహాప్రవక్త (స) మస్జిదె నబవీలో సహాబా (ర) మధ్యన కూర్చుని ఉన్నారు. రాగానే అమ్రూ బిన్ సాలిమ్ పద్యరూపంలో తన గోడును ఇలా చెప్పనారంభించారు. ఆ పద్యాల భావం ఇలా ఉంది:

"ఓ ప్రభూ! నేను ముహమ్మద్ (స) మరి ఆయన తండ్రి గారితో చేసుకున్న ఒప్పందం సాక్షి[2] చెబుతున్నాను. మీరంతా మా సంతానం. మేము

---

2. బనూ ఖుజాఅ మరియు బనూ హాషిమ్ నడుమ అబ్దుల్ ముత్తలిబ్ కాలం నుండి కొనసాగుతూ వస్తున్న ఒప్పందం. దీని వివరాలు ఈ గ్రంథం ప్రారంభంలోనే చెప్పడం జరిగింది.

https://teluguislam.net



మిమ్మల్ని కన్నవారం.[3] ఆ తరువాత మేము మిమ్మల్ని విధేయించి ఎప్పుడూ వెనకాడలేదు. అల్లాహ్ మీకు మార్గం చూయించుగాక! మీరు మాకు గట్టి మద్దత్తునివ్వాలి. దైవదాసుల్ని పిలువండి, వారూ మా సాయానికి వస్తారు. దైవప్రవక్త (స) వారిలో ఉంటారు. ఆయుధధారులై పైకి వచ్చిన పున్నమి చంద్రునిలా అందంగా వచ్చి నిలుస్తారు, ఖురైషులు మీతో చేసుకున్న ఒప్పందాన్ని భంగపరిచారు. మీకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారు. వారు నా కోసం కిదాలో మాటువేశారు. నేను ఎవరినీ సాయానికి పిలువననే ఉద్దే శ్యంతో వచ్చారు వారు. వారు చాలా నీచమైనవారు. సంఖ్యలోను అతి అల్పులు. వారు 'వతీరా'లో మేము నమాజు చేస్తూ ఉండగా దాడి చేశారు. మమ్మల్ని హతమార్చారు."

ఇది విన్న మహాప్రవక్త (స), "ఓ అమ్రూ బిన్ సాలిమ్! పో! నీకు సహాయం అందింది" అని అన్నారు. ఆ తరువాత ఆకాశంలో ఓ మబ్బు తునక అగుపడగా, "ఈ మబ్బు తునక బనూ కఅబ్ సహాయ శుభవార్తనంది స్తోంది" అని అన్నారు.

ఆ తరువాత బుదైల్ బిన్ వర్కా ఖుజాయీ నేతృత్వంలో బనూ ఖుజాఅ చెందిన ఓ ప్రతినిధి వర్గం మదీనాకు వచ్చి దైవప్రవక్త (స)కు, ఎవరెవరు చంపబడిందీ, ఖురైష్, బనూ బక్ర్‌కు ఎలా సహాయం అందించింది పూసగ్రుచ్చి నట్లు చెప్పి మక్కాకు వెళ్ళిపోయారు.

## ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి అబూ సుఫ్యాన్ మదీనా రాక

ఖురైష్ మరియు దాని మిత్రపక్షాలు దేనికైతే పాల్పడ్డారో అది ఓ ప్రస్ఫుటమైన వాగ్దాన భంగం మరియు సంధి సూత్రాలను త్రెంచేసే కార్యం. అందుకని ఖురైషులు తాము చేసిన తప్పును గ్రహించి నాలుక కర్చుకున్నారు. వారు దీని విషయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఓ సలహా సంఘాన్ని నిర్వహించి తమ సర్దారు అయిన అబూ సుఫ్యాన్‌ను ఆ ఒప్పందాన్ని తిరిగి పునరుద్ధరించుకు రమ్మని మదీనాకు పంపించారు.

ఇటు మదీనాలో దైవప్రవక్త (స), సహాబాలందరినీ సమావేశపరచి, ఖురైషులు తాము చేసుకున్న ఒప్పందాన్ని భంగపర్చారు కాబట్టి ముందు

---

3. అబ్దె మునాఫ్ తల్లి బనూ ఖుజాఅ తెగకు చెందిన మహిళ. అందుకని దైవప్రవక్త వంశం బనూ ఖుజాఅ సంతానమే.

https://teluguislam.net



కార్యక్రమం ఏమిటో తెలియ చేస్తూ, "తిరిగి ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి, దాని గడువును పెంచడానికి అబూ సుఫ్యాన్ మీ దగ్గరకు వస్తున్నట్లుగా నేను చూస్తున్నాను" అని అన్నారు.

అబూ సుఫ్యాన్ మక్కాలో జరిగిన తీర్మానం ప్రకారం బయలుదేరి గస్ఫాన్ అనే ప్రదేశానికి చేరాడు. అక్కడ అతనికి బుదైల్ బిన్ వర్కా ఎదురయ్యాడు. ఆయన మదీనా నుండి తిరిగివస్తున్నాడు. బుదైల్ దైవప్రవక్త (స) వద్దకు వెళ్ళి వస్తున్నాడని గ్రహించి అబూ సుఫ్యాన్, "ఎక్కడి నుండి వస్తున్నావు?" అని అడిగాడు.

"నేను ఖుజాఅ వెంట ఆ సముద్ర తీరానికి, అక్కడి నుండి ఫలానా లోయకు వెళ్ళి వస్తున్నాను" అన్నాడు బుదైల్.

"నీవు ముహమ్మద్ (స) దగ్గరకు వెళ్ళలేదా?" రెట్టించాడు అబూ సుఫ్యాన్.

"లేదు" జవాబిచ్చాడు బుదైల్.

కాని బుదైల్ మక్కా వైపునకు వెళ్ళిపోగానే అబూ సుఫ్యాన్‌కు అనుమానం వచ్చింది. అతనే గనక మదీనాకు వెళ్ళి ఉంటే తన ఒంటెకు గింజలు గల దాణా పెట్టి ఉండాలి అని అనుకొని వెనక్కు వెళ్ళి బుదైల్ తన ఒంటెను కట్టేసిన చోటికి వెళ్ళి చూశాడు. ఒంటె పెంటికలను త్రుంచి చూడగా వాటిలో ఖర్జూరపు విత్తనం అగుపడింది. అప్పుడు అబూ సుఫ్యాన్, "దైవసాక్షి! బుదైల్ తప్పకుండా ముహమ్మద్ (స)దగ్గరకు వెళ్ళే వస్తున్నాడని" గొణిగాడు.

మొత్తానికి అబూ సుఫ్యాన్ మదీనా చేరి తన కుమార్తె ఉమ్ముల్ మోమినీన్ (ముస్లిముల మాతృమూర్తి) హజ్రత్ ఉమ్మె హబీబా (ర) ఇంటికి వచ్చాడు. అతను దైవప్రవక్త (స) పడుకునే పడకపై కూర్చోబోగా ఆమె దాన్ని వెంటనే చుట్టి వేశారు. అది చూసిన అబూ సుఫ్యాన్, "అమ్మాయి! ఆ పడకపై నేను కూర్చోడానికి అర్హుణ్ణికానా?" అని అడిగాడు.

"ఇది దైవప్రవక్త (స) గారి పడక. ఓ అశుద్ధుడు, అపవిత్రుడైన ముష్రిక్ (బహుదైవారాధకుడు) కూర్చునే పడక కాదు" అని మొహమాటపడకుండా బదులిచ్చారు హజ్రత్ ఉమ్మె హబీబా (ర).

https://teluguislam.net



"ఓహో! నా తరువాత నీకు చెడే కలిగిందే" అంటూ అబూ సుఫ్‌యాన్ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అతను దైవప్రవక్త (స)తో కలిసి మాట్లాడాడు. కాని మహాప్రవక్త (స) అతనికి ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు.

పిమ్మట అతను హజ్రత్ అబూ బక్ర్ (ర) దగ్గరికి వెళ్ళి, ఆయన్ను మహాప్రవక్త (స)తో మట్లాడమని అడిగాడు. ఆయన అతనితో, నేను అలా చేయలేను అని అనగా, నేరుగా హజ్రత్ ఉమర్ (ర) గారి దగ్గరికి చేరాడు. ఆయన కూడా, నేను మీ గురించి దైవప్రవక్త (స)కు సిఫార్సు చేయాలా? విను! దైవసాక్షి! మరేది కాకపోయినా నాకు కేవలం ఓ కర్రముక్క లభించినా సరే మీతో జిహాద్ చేస్తూనే ఉంటాను అన్నారాయన. చివరగా అతను హజ్రత్ అలీ (ర) గారింటికి వెళ్ళాడు. అక్కడ హజ్రత్ ఫాతిమా (ర) కూడా ఉన్నారు. హజ్రత్ హసన్ ఇంకా చిన్న పిల్లవాడు. తల్లిదండ్రుల ముందు కూర్చుని ఆడుకుంటున్నారు.

"ఓ అలీ (ర)! నా వంశం, మీ వంశం ఒక్కటే. నేను ఓ పని ఉండి మదీనాకు వచ్చాను. మీరు నా గురించి ముహమ్మద్ (స)తో సిఫార్సు చేయరా?" అని అడిగాడు అబూ సుఫ్‌యాన్.

"అయ్యో! దైవప్రవక్త (స)గారి మాట మాటే. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోబోము" అని బదులిచ్చారు హజ్రత్ అలీ (ర).

ఆ తరువాత అతను హజ్రత్ ఫాతిమా (ర) గారి వైపునకు తిరిగి, "మీరు మీ ఈ చిన్నారి కుమారుని ద్వారా మాకు రక్షణ కల్పించామన్న ప్రకటన చేయించండి. అలా చేస్తే ఆయన అరబ్బులకే సర్దారు అయి పోగలడు" అని అడిగాడు.

"దైవసాక్షి! నా కుమారుడు మీకు రక్షణ ఇచ్చాననేటంతటి హోదాకు చేరలేదు. దైవప్రవక్త (స) తప్ప మరెవ్వరూ మీకు రక్షణను కల్పించలేరు" అన్నారు హజ్రత్ ఫాతిమా (ర).

తన ప్రయత్నాల్లో విఫలమైన తరువాత అబూ సుఫ్‌యాన్‌కు ప్రపంచమే అంధకారంగా అగుపడసాగింది. అతను హజ్రత్ అలీ (ర) గారితో నిరాశగా,

"అబుల్ హసన్! పరిస్థితులు విషమించిపోతున్నాయన్న విషయాన్ని నేను గమనిస్తున్నాను. మీరే నాకు ఏదైనా మార్గం చూపించాలి" అని వేడు కున్నాడు.

https://teluguislam.net



"దైవసాక్షి! నీ ఈ వ్యవహారంలో నీకు మేలు జరిగేది ఏదీ లేదు. అయితే నీవు బనూ కనానా సర్దారువి. కనుక ప్రజల్లో నిలబడి శాంతి ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నానహో! అంటూ బహిరంగంగా ప్రకటించి మక్కాకు వెళ్ళిపో" అన్నారు హజ్రత్ అలి (ర).

"ఇలా ప్రకటించడం మేలు కలిగించగలదంటారా?" అడిగాడు అబూ సుఫ్యాన్.

"దైవసాక్షి! అది ప్రయోజనాన్ని కలిగిస్తుందని నేనైతే అనుకోనుగాని, అంతకంటే మార్గం మరొకటి లేదు కదా?" అన్నాడు అలీ (ర).

ఆ తరువాత అబూ సుఫ్యాన్ మస్జిద్‌లో నిలబడి, "ప్రజలారా! నేను మీ నడుమ ఒడంబడిక పునరుద్ధరించబడిందని ప్రకటిస్తున్నాను" అని ప్రకటించి ఒంటెనెక్కి మక్కాకు వెళ్ళిపోయాడు.

ఖురైషుల వద్దకు వెళ్ళిన అబూ సుఫ్యాన్‌ను వారు, ఏం జరిగింది అని అడిగారు.

"నేను ముహమ్మద్ (స) దగ్గరకు వెళ్ళాను. ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఆ తరువాత అబూ ఖహాఫా కుమారుని వద్దకు వెళ్ళగా అతనూ నాకు ఎలాంటి సహాయమూ చేయలేదు. తరువాత నేను ఉమర్ (ర) దగ్గరకు వెళ్ళగా అతను మన పట్ల బాగా శత్రుత్వం వహించి ఉన్నాడన్న విషయం తెలిసింది. హజ్రత్ అలీ (ర) దగ్గరకు వెళ్ళగా ఆయనలో కొంత మెత్తదనాన్ని గమనించాను. అయితే ఆయన ఇచ్చిన సలహా ప్రయోజనాన్ని ఇస్తుందో లేదో తెలియదు.

"ఆ సలహా ఏమిటీ?" అని అడిగారు ఖురైషులు.

"ప్రజల్లో నిలబడి ఒడంబడిక పునరుద్ధరించబడిందని ప్రకటన చేయమన్నదే ఆయన సలహా. నేను ఆయన చెప్పినట్లే నిలబడి ప్రకటించి వస్తున్నాను" అన్నాడు అబూ సుఫ్యాన్.

"మరైతే నీ ఈ ప్రకటన అమలవుతుందని ముహమ్మద్ (స) అన్నారా?" అడిగారు ఖురైషులు.

"లేదు" సమాధానమిచ్చాడు అబూ సుఫ్యాన్.

"నీవు నాశనం కాను! ఆ వ్యక్తి (అలి-ర) నిన్ను ఆటపట్టించడానికే అలా అన్నాడు" అన్నారు ఖురైషులు.

https://teluguislam.net



"కానీయండి! అంతకంటే నేను మరేదీ చేయలేని పరిస్థితి అది" బదులిచ్చాడు అబూ సుఫ్యాన్.

## గజ్వా (పోరాటం) కోసం సిద్ధపడడం- దాన్ని రహస్యంగా ఉంచే ప్రయత్నం చేయడం

తిబ్రానీ ఉల్లేఖనంలో, ఒడంబడిక భంగం అయిన వార్త రావడానికి మూడు రోజుల ముందే దైవప్రవక్త (స), హజ్రత్ ఆయిషా (ర)కు ప్రయాణ సన్నాహాలు చేయమని, దాన్ని రహస్యంగా ఉంచమని ఆదేశం ఇచ్చినట్లు ఉంది. ఆ తరువాత ఆయిషా (ర)గారి దగ్గరికి ఆమె తండ్రి హజ్రత్ అబూ బక్ర్(ర) వచ్చారు. ఆమె ప్రయాణ సన్నాహాలు చేయటాన్ని చూసి, "అమ్మా! ఏమిటీ ఈ సన్నాహాలు?" అని అడిగారు.

"నాన్నగారూ! నాకైతే ఏమీ తెలియదు" అన్నారు హజ్రత్ ఆయిషా(ర).

"బనూ అజ్గర్ (అంటే రోమనులు)తో యుద్ధం చేసే సమయం రాలేదే? మరి దైవప్రవక్త (స) ఎటు వెళ్ళాలని ఈ సన్నాహాలు చేయిస్తున్నారు?" అని సంశయాన్ని వెలిబుచ్చారు అబూ బక్ర్ (ర).

"నాకు తెలియదు" అని జవాబిచ్చారు హజ్రత్ ఆయిషా (ర).

తండ్రీ కుమార్తెల్లో ఈ సంభాషణ జరిగిన మూడు రోజుల తరువాత ఉదయాన్నే అమ్రూ బిన్ సాలిమ్ తన నలభై మంది ఉష్ట్రారోహులతో రావడం, ఒప్పందం భంగం జరిగిన విషయం చెప్పడం వగైరా అంతా జరిగిపోయాయి. ఆ తరువాత బుదైల్ రావడం, ఆ పిదప అబూ సుఫ్యాన్ వచ్చి ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి చేసిన ప్రయత్నం వల్ల అందరికీ ఈ విషయం తెలిసిపోయింది.

ఆ తరువాత మహాప్రవక్త (స) మక్కాపై దండయాత్ర చేయడానికి సహాబా (ర)కు ఆదేశమిచ్చి అల్లాహ్‌ను ఇలా వేడుకున్నారు.

"ఓ అల్లాహ్! మేము ఆ ప్రాంతంలోనికి వెళ్ళి వారిపై విరుచుకుబడేంత వరకు వారి వేగులవారిని, వార్తాహరుల్ని అడ్డుకో."

ఎంతో రహస్యంగా, ఎవరికీ తెలియకుండా మహాప్రవక్త (స) రమజాన్ నెల ఆరంభ దినాల్లో (హి.శ. 8) హజ్రత్ అబూ ఖతాదా బిన్ రబీ నేతృత్వంలో

https://teluguislam.net



ఎనిమిది మందితో కూడిన ఓ సైనిక పటాలాన్ని 'సరియ్యయె బత్న్' వైపునకు పంపించారు. ఈ ప్రదేశం 'జిల్ మర్వా'కు నడుమ మదీనాకు 36 అరబిక్ మైళ్ళ దూరంలో ఉంది. దీని ఉద్దేశ్యం, చూసేవారికి దైవప్రవక్త (స) అటు వైపు వెడుతున్నారని తెలియాలని, ఆ వార్తలు ఖురైషులకు చేరాలన్నదే. కాని అది తన గమ్యస్థానం చేరగా, దైవప్రవక్త (స) మక్కా వైపునకు బయలుదేరారని తెలిసి వారు కూడా మక్కా వైపునకు బయలుదేరారు.[4]

ఇటు హాతిబ్ బిన్ అబీ బల్తఆ (ర), ఖురైషులకు ఓ లేఖ రాసి, దైవప్రవక్త(స) దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్న విషయం తెలియ జేయడం జరిగింది. ఆయన ఆ లేఖను ఓ మహిళకు ఇచ్చి పంపించారు. దాన్ని ఖురైషుల వరకు చేరవేయడానికి ప్రతిఫలం కూడా ఖరారు చేసుకు న్నారు. ఆ స్త్రీ ఆ లేఖను తన జుట్టు ముడిలో భద్రంగా ఉంచుకొని బయలు దేరింది. కాని మహాప్రవక్త (స)కు హాతిబ్ చేసిన ఈ నిర్వాకం గురించి దైవవాణి ద్వారా తెలియజేయబడింది. ఆయన (స) హజ్రత్ అలి (ర), హజ్రత్ మెగ్దాద్ (ర), హజ్రత్ జుబైర్(ర), హజ్రత్ అబూ మర్సిద్ గనవి (ర)లను రౌజయె ఖాఖ్ ప్రదేశానికి వెళ్ళండి. అక్కడ మీకు అంబారీలో కూర్చుని ఉన్న ఓ స్త్రీ కనబడు తుంది. ఆమె వద్ద ఖురైషుల పేరున ఉన్న ఓ లేఖ ఉంది అని చెప్పారు. వీరందరూ గుర్రాలను అటు వైపునకు దౌడు తీయిం చారు. అక్కడకు చేరగా ఆ స్త్రీ వారికి అగుపడింది. వారు ఆమెను క్రిందికి దిగి రమ్మని ఆదేశించారు. ఆమె క్రిందికి రాగానే, "నీవద్ద ఏదైనా లేఖ ఉందా?"

---

4. *ఈ సరియ్యా అక్కడకు వెళ్ళగా ఆమిర్ బిన్ అజ్బత్ ఎదురై వారికి ఇస్లామీయ విధానం ప్రకారం సలామ్ చేశాడు. కాని ముహ్లిమ్ బిన్ జసామా ఏదో పాత కక్షల కారణంగా అతణ్ణి సంహరించాడు. అతని ఒంటెలను, అతని సొత్తునంతటిని హస్తగతం చేసుకున్నాడు. దీని కోసం ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ అవతరించింది. "ఎవరైనా నీకు సలామ్ చేస్తే, అతను మోమిన్ (విశ్వాసి) కాదు అని అనకు." ఆ తరువాత సహాబా, ముహ్లిమ్‌ను, అతని మన్నింపు కోసం దుఆ చేయమని దైవ ప్రవక్త (స)గారి సన్నిధికి తీసుకురాగా, ఆయన మూడుమార్లు, "ఓ అల్లాహ్! ముహ్లిమ్‌ను మన్నించకు" అన్నారు. ఆ తరువాత ముహ్లిమ్ తన చొక్కా అంచుతో తన కన్నీటిని తుడుచుకుంటూ లేచి వెళ్ళిపోయాడు. ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, ఆ తరువాత మహాప్రవక్త (స) అతని మన్నింపు కోసం దుఆ చేశారని అతని జాతి ప్రజలు చెప్పారు అని ఉంది. జాదుల్ ముఆద్-2/150; ఇబ్నె హిషామ్-2/626, 627, 628.*

https://teluguislam.net



అని అడిగారు. "నా దగ్గర ఎలాంటి లేఖా లేదు" అని ఆమె బొంకింది. వారు ఆమె కూర్చుని ప్రయాణం చేస్తున్న అంబారీని పూర్తిగా శోధించారు. అక్కడ వారికి ఏ లేఖా లభించలేదు. చివరకు హజ్రత్ అలి (ర) ఆమెతో, "నేను దైవంపై ప్రమాణం చేసి చెబుతున్నాను. మహాప్రవక్త (స)గాని, మేముగాని అసత్యం పలకటం లేదు, నీవు ఆ ఉత్తరాన్నయినా తీసి మాకు ఇచ్చెయ్యి లేదా మేము నిన్ను నగ్నంగా చేసి అయినా ఆ ఉత్తరాన్ని నీ నుండి హస్తగతం చేసుకుంటాము" అంటూ కొంత కఠినంగానే అడిగారు. ఆమె వీరి వాలకం చూసి, "సరే, మీరు మీ ముఖాలను అటు వైపునకు త్రిప్పుకోండి" అని చెప్పగా వారు అలాగే చేశారు. ఆమె తన జుట్టు ముడి విప్పి అందుండి ఆ లేఖను తీసి వారికి అందించింది. వీరు ఈ లేఖను తీసుకొని దైవప్రవక్త (స)గారి దగ్గరకు వచ్చారు. లేఖను విప్పి చదవగా అందులో "ఇది హాతిబ్ బిన్ బల్తఆ తరపున ఖురైషులకు రాసిన ఉత్తరం" అంటూ దైవప్రవక్త (స) మక్కాపై దండెత్తి వచ్చే విషయం అందులో పూసగ్రుచ్చినట్లుగా రాసి ఉంది.[5]

మహాప్రవక్త (స) హజ్రత్ హాతిబ్‌ను పిలిచి, "ఇదేమిటీ?" అని అడిగారు. దానికి ఆయన, "దైవప్రవక్తా! నా గురించి తమరు తొందరపాటుకు గురి కాకూడదు. దైవసాక్షిగా చెబుతున్నాను. అల్లాహ్‌పై, ఆయన ప్రవక్త(స)పై నాకు విశ్వాసం ఉంది. నేను ధర్మభ్రష్టుణ్ణి కాలేదు, నాలో ఏ మార్పూ రాలేదు. నేను ఖురైషుల మనిషినీ కాదు. కాని వారితో ముడిపడి ఉండేవాడిని. నా భార్యాపిల్లలు అక్కడే ఉన్నారు. ఖురైషులతో నాకు ఎలాంటి బంధుత్వమూ

---

5. *సహీలీ కొందరు యుద్ధం గురించిన రాసే చరిత్రకారుల మాధ్యమంగా ఆ ఉత్తరం లోని సారాంశాన్ని ఇలా ఉల్లేఖించారు. అమ్మాబాద్ (తరువాతను). ఓ ఖురైష్ వర్గమా! దైవప్రవక్త (స) మీపైకి ఓ సేనావాహినిగొని వస్తున్నారు. ఆయన ఒక్కరే మీ దగ్గరకు వచ్చినా ఆయనకు అల్లాహ్ సహాయపడగలడు. ఆయనతో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటాడు. కాబట్టి మీరు మీ గురించి ఆలోచించు కోండి. వస్సలాం.*
*వాఖిదీ కథనం ప్రకారం, హజ్రత్ హాతిబ్, సుహైల్ బిన్ అమ్రూ, సుఫ్వాన్ బిన్ ఉమయ్యా, ఇక్రమాలకు రాసిన లేఖ ఇలా ఉంది.*
*"మహాప్రవక్త (స) ప్రజల్లో యుద్ధం గురించి ప్రకటన చేశారు. మీ వైపు తప్ప మరెవ్వరితోను యుద్ధానికి వెళుతున్నారని నేననుకోను. నేను కోరేదల్లా నేను చేసిన ఈ సహాయాన్ని మీరు మరువరనేదే." (ఫత్‌హుల్ బారి-7/521)*

https://teluguislam.net



లేదు, వారు నా భార్యాపిల్లల్ని పరిరక్షించడానికి, దీనికి భిన్నంగా తమతో ఉన్న వారికి అక్కడ బంధువులు, మిత్రులు ఉన్నారు. వారి భార్యాపిల్లల క్షేమాన్ని వారు చూస్తున్నారక్కడ. అందుకని నేను వారికి ఏదో ఒక సహాయం చేసినందుకు వారు నా భార్యాపిల్లల బాగోగులు చూస్తారని ఆశించాను" అని విన్నవించుకున్నారు.

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), "దైవప్రవక్తా! ఇతని మెడను నరకడానికి నాకు అనుమతి ఇవ్వండి. ఇతను అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (స)కూ ద్రోహం చేశాడు. ఇతను మునాఫిక్ అయిపోయాడు" అన్నారు కోపంగా.

దానికి మహాప్రవక్త (స), "చూడండి! ఇతను బద్ర్ యుద్ధంలో మనతో పాటే పాల్గొన్న వ్యక్తి. బహుశా బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారిని గురించి అల్లాహ్, "మీరు ఏమి చేసినా మిమ్మల్ని క్షమించను అని ఉండవచ్చు కదా?" అన్నారు.

దైవప్రవక్త (స) నోట ఈ మాటలు వెలువడగానే హజ్రత్ ఉమర్ (ర) కళ్ళు చెమ్మగిల్లాయి. ఆయన, "దైవప్రవక్తా! ఇది తమకూ, అల్లాహ్‌కే బాగా తెలిసిన విషయం"[6] అని అక్కడి నుండి వెళ్ళిపోయారు.

ఇలా అల్లాహ్ వేగులవారి ఎత్తుగడల్ని అడ్డుకొన్నాడు. ముస్లిముల యుద్ధసన్నాహాలు ఏమాత్రం ఖురైషులకు చేరలేకపోయాయి.

## మక్కా వైపునకు తరలివెళ్ళిన ఇస్లామీయ సైన్యం

రమజాన్ నెల 10వ తారీఖు (హి.శ.8)న మహాప్రవక్త (స) మదీనాను వదిలి మక్కా వైపునకు బయలుదేరారు. ఆయన (స) వెంట పది వేల మంది సహాబాలు (ర) ఉన్నారప్పుడు. మదీనాను సంరక్షించడానికి అబూ అర్హమ్ గిఫ్ఫారీ (ర)ను నియమించడం జరిగింది.

'హజ్ఫా' లేదా ఇంకొంత దూరం వెళ్ళాక దైవప్రవక్త (స)కు ఆయనగారి పినతండ్రి హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వచ్చి కలిశారు. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి తన భార్యాపిల్లలతో సహా హిజ్రత్ చేసి మదీనాకు బయలు దేరారాయన. 'అబ్వా' అనే ప్రదేశంలో తమ పినతండ్రి కుమారుడు అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్ మరియు మేనత్త కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ ఉమయ్యా వచ్చి కలిశారు. మహాప్రవక్త (స) వారిద్దరిని చూసి ముఖం త్రిప్పు

---

*6. సహీ బుఖారి-1/422; 2/612.*

https://teluguislam.net



కున్నారు. ఎందుకంటే వారు దైవప్రవక్త (స)ను తీవ్రమైన హింసలకు గురిచేసినవారు. ఈ పరిస్థితిని చూసి హజ్రత్ ఉమ్మె సల్మా (ర), "దైవప్రవక్తా! మీ పినతండ్రి కుమారుడు, మీ మేనత్త కుమారుడు మీ దృష్టిలో అంత దురదృష్టవంతులు, దుష్టులుగా ఉండకూడదు" అని అన్నారు. ఇటు హజ్రత్ అలి (ర), అబూ సుఫ్యాన్ బిన్ హారిస్‌కు, "నీవు మహాప్రవక్త (స)గారి ఎదుటకు వెడితే నీవు చెప్పవలసిందల్లా హజ్రత్ యూసుఫ్ (అ) గారి సోదరులు హజ్రత్ యూసుఫ్‌తో అన్న మాటలు. **"అల్లాహ్ తోడు! అల్లాహ్ మాకంటే నీకు ఎక్కువ ఔన్నత్యాన్ని ప్రసాదించాడు"** (12-91) అని పలకాలి. ఎందుకంటే ఇంతకంటే మంచి సమాధానాన్ని ఆయన (స) ఒప్పుకోరు సుమా" అన్నారు. అబూ సుఫ్యాన్ బిన్ హారిస్ వెంటనే ఆ పదాలను పలకగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు. **"ఈ రోజు మిమ్మల్ని నిందించడం జరగదు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! ఆయన అందరికంటే అధికంగా కరుణించేవాడు."** (12-92)

ఇది విని అబూ సుఫ్యాన్ సంబరపడిపోతూ కొన్ని పద్యపాదాలను చదివాడు. వాటి భావం ఇలా ఉంది:

"నీ వయస్సు సాక్షి! లాత్ దేవుని సైన్యం ముహమ్మద్ సైన్యాన్ని జయిస్తుంది అనే ఉద్దేశ్యంతో నేను జెండా ఎత్తుకున్నప్పుడు నా పరిస్థితి అగమ్యగోచరంగా చీకటిలో కొట్టుమిట్టాడే ఆ బాటసారిలా మారిపోయింది. కాని నాకు సన్మార్గం లభించే సమయం ఆసన్నమైనందున నేను మార్గదర్శకత్వం పొందుతున్నాను. నా మనోవాంఛలకు బదులు నాకు ఓ మార్గదర్శకుడు మార్గాన్ని చూపెడుతున్నాడు. అది అల్లాహ్ వైపునకు పురోగమించే మార్గం. ఈ మార్గదర్శకుణ్ణి క్రితం నేను ప్రతి సందర్భంలోను చీదరించుకునేవాణ్ణి."

ఇది విన్న దైవప్రవక్త (స) అతని వక్షస్థలంపై కొడుతూ, "అవును, నీవు నన్ను అన్ని సందర్భాల్లోనూ చీదరించుకున్నావు"[7] అన్నారు.

---

*7. ఆ సంఘటన తరువాత అబూ సుఫ్యాన్ బిన్ హారిస్‌లో మంచి మార్పు వచ్చేసింది. సిగ్గు వల్ల మహాప్రవక్త (స) వైపునకు కన్నెత్తయినా చూళ్ళేదాయన. దైవప్రవక్త (స) కూడా ఆయన ఎడల ప్రేమగా మెలిగేవారు. ఆయనకు స్వర్గం లభిస్తుందనే శుభవార్త కూడా అందించేవారు. ఇంకా ఇలా అనేవారు, "ఈయన హజ్రత్ హమ్జా (ర) గారికి ప్రత్యామ్నాయం అవుతాడు" అని. అబూ సుఫ్యాన్ మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన, "నా గురించి ఏడవకండి ఇస్లామ్ స్వీకరిం చిన తరువాత నేను ఎలాంటి చెడు మాటను నా నోట వెలువరించలేదు." (జాదుల్ ముఆద్-2/162, 163.)*

https://teluguislam.net



## మర్రజ్జహ్రాన్‌లో ఇస్లామీయ సైన్యం

మహాప్రవక్త (స) తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఆయన (స) మరియు ఆయన అనుచరులంతా రోజా పాటిస్తున్నారు. కాని 'అస్ఫాన్' మరియు 'ఖుదైద్' నడుమ గల 'కదీద్' పేరుగల ఊట బావికి చేరగానే ఆయన తన ఉపవాస వ్రతాన్ని భంగపరిచారు.[8] అది చూసిన ఆయన సహచరులంతా రోజాను భంగపరిచారు. ఆ తరువాత ప్రయాణం కొనసాగిస్తూ రాత్రి మొదటి ఝామున మర్రజ్జహ్రాన్- వాదియె ఫాతిమా- చేరి అక్కడ విడిది చేశారు. అక్కడకు చేరి వేరువేరుగా అగ్నిని రాజేయమని ఆదేశించగా వారంతా ఆయన ఆదేశాన్ని శిరసావహించి విశాల మైదానంలో దూరదూరాల వరకు తమ వంట పొయ్యిలను రాజేశారు. దైవప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (ర)ను పహరాదారునిగా నియమించారు ఆ సమయంలో.

## అబూ సుఫ్యాన్ దైవప్రవక్త (స) సన్నిధిలోనికి

మర్రజ్జహ్రాన్‌లో విడిది చేసిన తరువాత హజ్రత్ అబ్బాస్ (ర) దైవప్రవక్త (స) గారి తెల్ల కంచర గాడిదనెక్కి బయలుదేరారు. కట్టెలు కొట్టేవాడెవడైనా కనబడితే ఈ వార్తను ఖురైషులకు అందించాలన్నదే ఆయన ధ్యేయం. దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశిస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని ఎవరైనా వచ్చి ఆయన శరణు వేడుకుంటారేమో అనేదే ఆయన కోరుకున్న విషయం.

ఇటు అల్లాహ్ ఖురైషులకు ఏ వార్తా తెలియకుండా అడ్డుకొని ఉన్నాడు. అందుకని వారికి పరిస్థితులను గురించి ఎలాంటి అవగాహనా లేదు. అయితే వారు భయం వల్ల సతమతమవుతూనే ఉన్నారు. అబూ సుఫ్యాన్ బయటకు వెళ్ళి వార్తలను సేకరిస్తూనే ఉన్నాడు. ఆ సమయంలోనే అబూ సుఫ్యాన్, బుదైల్ బిన్ వర్కా, హకీమ్ బిన్ హిజామ్ ముగ్గురూ కలిసి వార్తలు సేకరించే ఉద్దేశ్యంతో మక్కా నగరాన్ని విడిచి బయటకు వచ్చారు.

---

*శుభవార్త కూడా అందించేవారు. ఇంకా ఇలా అనేవారు, "ఈయన హజ్రత్ హమ్జా (ర) గారికి ప్రత్యామ్నాయం అవుతాడు" అని. అబూ సుఫ్యాన్ మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన, "నా గురించి ఏడవకండి, ఇస్లామ్ స్వీకరించిన తరు వాత నేను ఎలాంటి చెడు మాటను నా నోట వెలువరించ లేదు." (జాదుల్ మఆద్-2/162, 163)*

8. *సహీ బుఖారి-2/613*

https://teluguislam.net



హజ్రత్ అబ్బాస్(ర) గారి ఉల్లేఖనం ఇలా ఉంది ఈ విషయంలో:

"దైవసాక్షి! నేను దైవప్రవక్త (స) గారి కంచర గాడిదనెక్కి వెడుతూ ఉండగా అబూ సుఫ్యాన్ మరియు బుదైల్ బిన్ వర్కా నడుమ జరుగుతున్న సంభాషణను విన్నాను. వారు పరస్పరం ఒకరి మాటలను మరొకరు ఖండించుకుంటున్నారు. అబూ సుఫ్యాన్ మరియు బుదైల్ బిన్ వర్కా నడుమన జరిగిన సంభాషణ ఇలా ఉంది:

అబూ సుఫ్యాన్: దైవసాక్షి! ఈ రోజు రాత్రి వెలుగుతున్నట్టి మంటలను, ఇలాంటి సైన్యాన్ని నేనెన్నడూ చూడలేదు.

బుదైల్: దైవసాక్షిగా చెబుతున్నాను. వీరు బనూ ఖుజాఅ తెగవారు. యుద్ధం వాళ్ళను బాగా కృంగదీసింది.

అబూ సుఫ్యాన్: ఖుజాఅ వాళ్ళ సైన్యం ఇంత గొప్పది కాదు. వీరు రాజేసిన అగ్ని అంత పెద్దదిగా ఉండదు.

నేను వారిద్దరి గొంతుల్ని గుర్తు పట్టాను. వారిని పిలుస్తూ అబూ హంజలానా? అని అడిగాను. అతను కూడా నా గొంతును గుర్తు పట్టి, ఓహో అబుల్ ఫజల్వా? అన్నాడు.

"అవును" అన్నాన్నేను.

"ఏమిటి విశేషం?" అడిగాడు అతను.

"వీరు దైవప్రవక్త (స)కు చెందినవారు. అయ్యో ఖురైష్ దురదృష్టం! దైవసాక్షి! వారు నాశనం కాక తప్పదు" అన్నాన్నేను.

"మరిప్పుడేం చేయాలి?" అడిగాడతను.

"అల్లాహ్ తోడు! వారే నిన్ను పట్టుకుంటే నీ మెడ నరికేయడం ఖాయం. కాబట్టి రా, ఈ గాడిదపై నా వెనుకాల కూర్చో. నేను నిన్ను దైవప్రవక్త (స) వద్దకు గొనిపోతాను. నీ కోసం ఆయన శరణాన్ని కోరుతాను" అన్నాను.

పిదప అబూ సుఫ్యాన్ నా వెనుకాల గాడిదనెక్కి కూర్చున్నాడు. అతనితో వచ్చిన ఆ ఇద్దరు సహచరులు వెనక్కు వెళ్ళిపోయారు.

నేను అబూ సుఫ్యాన్ను వెంటబెట్టుకొని నడుస్తున్నాను. ప్రతి అగ్నిగుండం దాపు నుండి వెడుతూ ఉంటే అక్కడి వారు ఇతనెవరు? అని అడగడం, ఇది దైవప్రవక్త (స)గారి కంచర గాడిద అని, దానిపై నేను ఎక్కి

https://teluguislam.net



ఉండడం చూసి, ఓహో, ఈయన దైవప్రవక్త (స)గారి పినతండ్రి అనడం మారుమాట్లాడకపోవడం జరిగిపోతూనే ఉంది. చివరకు నేను హజ్రత్ ఉమర్(ర) గారి అగ్నిగుండం ప్రక్కగా వెడుతున్నప్పుడు, "ఎవరూ?" అంటూ లేచి మా దగ్గరకు వచ్చారాయన. నా వెనుకాల అబూ సుఫ్యాన్‌ను చూసి, "అబూ సుఫ్యానా? ఓ దైవ విరోధి! అల్‌హమ్‌దులిల్లాహ్! ఆయన ఎలాంటి ఒప్పందం లేకుండానే నిన్ను మాకు అధీనం చేశాడు" అంటూ బయలుదేరి దైవప్రవక్త (స) ఉంటున్న గుడారం వైపునకు చకచకా వెళ్ళిపోయారు. నేను కూడా నా కంచర గాడిదను వేగంగా తోలుకుంటూ ఆయన కంటే ముందే దైవప్రవక్త (స) సన్నిధికి చేరిపోయాను. గాడిదపై నుండి దూకి పరుగున ఆయన దగ్గరకు వెళ్ళిపోయాను. అంతలోనే హజ్రత్ ఉమర్ (ర) మమ్మల్ని వెంబడిస్తూ గుడారంలో చొరబడ్డారు.

"దైవప్రవక్తా! ఇతను అబూ సుఫ్యాన్. ఇతని మెడ నరకడానికి నాకు అనుమతినొసగండి" అన్నారాయన.

"ఓ ప్రవక్తా! నేను ఇతనికి శరణమిచ్చాను" అని చెప్పాన్నేను.

ఆ తరువాత మహాప్రవక్త (స) దగ్గర కూర్చుని ఆయన తలను పట్టుకొని, "దైవసాక్షి! ఈ రాత్రి నేను తప్ప మరెవ్వరూ తమతో మాట్లాడడానికి వీల్లేదు" అన్నాను. అబూ సుఫ్యాన్ విషయంలో హజ్రత్ ఉమర్ మాటిమాటికి దైవప్రవక్త (స)ను అడుగుతూ ఉండగా నేను, "ఉమర్ ఆగు! దైవసాక్షి! ఒకవేళ ఇతను బనీ అద్దీ బిన్ కఅబ్ మనిషి అయితే నీవు అలా అనకపోయేవాడివి" అని మందలించాను.

"అబ్బాస్ ఆగు! అల్లాహ్ తోడు! నీవు ఇస్లామ్ స్వీకరించడం నా దృష్టిలో ఖత్తాబ్ ఇస్లామ్ స్వీకరించడంకంటే- ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరించి ఉండి ఉన్నట్లయితే-మేలైన విషయం. దానికి కారణం దైవప్రవక్త (స) దృష్టిలో నీ ఇస్లామ్ స్వీకారం ఖత్తాబ్ ఇస్లామ్ స్వీకారం కంటే మిన్న అయినది కనుక."

చివరకు మహాప్రవక్త (స) నాతో, "అబ్బాస్! ఇతణ్ణి డేరా లోనికి తీసుకువెళ్ళి రేపు ఉదయాన్నే నా వద్దకు తీసుకురండి" అని చెప్పారు. ఆ ఆదేశాన్ని అనుసరించి నేను మరుసటి రోజు ప్రవక్త (స) సన్నిధికి హాజరుపరిచా నతడిని. ఆయన (స) అతణ్ణి చూసి, "అబూ సుఫ్యాన్! అల్లాహ్ తప్ప

https://teluguislam.net



మరే పూజ్యుడు లేడు అన్న విషయాన్ని తెలుసుకునే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?" అని అడిగారు.

"నా తల్లిదండ్రులు తమపై అర్పితం. తమరు ఎంత దయాళురు! ఎంత సహనశీలురు. నేను బాగా తెలుసుకున్నాను. ఒకవేళ అల్లాహ్ కాకుండా మరెవరైనా ఆరాధ్యుడు ఉంటే ఇప్పటి వరకు నాకు సహాయపడి ఉండేవాడే" అన్నాడు అబూ సుఫ్యాన్.

"అయ్యో అబూ సుఫ్యాన్! నేను అల్లాహ్ ప్రవక్త అన్న విషయం అర్థం చేసుకునే సమయం ఇంకా రాలేదా?" అని అడిగారు మహాప్రవక్త (స).

"నా తల్లిదండ్రులు తమపై అర్పితం! మీరు ఎంత గొప్పవారు, ఎంత కరుణామయులు, మరెంత బంధుజనప్రీతి కలిగినవారో! ఈ విషయంలో ఇంకా నా మనస్సు సంశయిస్తూనే ఉంది" అన్నాడు. ఈ మాటలు విన్న నేను, "ఒరేయ్! నీ మెడ నరకబడక పూర్వమే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించు. అల్లాహ్ తప్ప ఇంకెవరూ ఆరాధనకు అర్హులుకారని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని సాక్ష్యం ఇవ్వు" అన్నాను.

నా మాటలు విన్న అబూ సుఫ్యాన్ వెంటనే కలిమా పఠించి ఇస్లామ్ స్వీకరించారు. ఆ తరువాత నేను దైవప్రవక్త (స)తో, "మహాప్రవక్తా! ఇతను బహుమానాన్ని కాంక్షించేవాడు. అతనికి ఏదైనా బహుమానం ఇవ్వరా?" అని అడిగాను.

"సరే! ఎవరైతే అబూ సుఫ్యాన్ ఇంట జొరబడతారో వారికి నా రక్షణ లభిస్తుంది. మరెవరైతే తమ తలుపులు లోన్నుండి మూసుకుంటారో వారికీ నా రక్షణ ఉంది. అలాగే ఎవరైతే మస్జిదె హరామ్‌లో చొరబడతారో వారందరికీ నా రక్షణ ఇవ్వడం జరుగుతుంది" అని అన్నారు.

## మర్రజ్జహ్రాన్ నుండి బయలుదేరి మక్కావైపు పయనమైన ఇస్లామీయ సేన

అదే రోజు ఉదయం - అంటే మంగళవారం, రమజాన్ నెల 17వ తారీఖు హి.శ. 8 నాటి ఉదయం- దైవప్రవక్త (స) మర్రజ్జహ్రాన్ నుండి బయలుదేరారు. అలా బయలుదేరుతూ హజ్రత్ అబ్బాస్ (ర)ను, "అబూ

https://teluguislam.net



సుఫ్యాన్, దైవమార్గంలో బయలుదేరిన సైన్యాన్ని వీక్షించేందుకు వీలుగా ఈ లోయ చివరన ఉన్న ఇరుకైన మార్గం దగ్గర నిలబెట్టి ఉంచండి" అని ఆదేశించారు. ఆయన ప్రవక్త ఆదేశాలను శిరసావహించి అతడిని అక్కడికి తీసుకువెళ్ళి నిలబెట్టారు.

ఆ మార్గంగుండా వెళ్ళే ప్రతి తెగను చూస్తూ, "వీరెవరూ?" అని అడగనారంభించాడు అబూ సుఫ్యాన్. జవాబుగా ఆ తెగల గురించి పరిచయం చేస్తూపోతున్నారు హజ్రత్ అబ్బాస్ (ర). వాటిని చూసి వీరితో నాకేమిటి పని అంటున్నాడు అబూ సుఫ్యాన్. చివరకు దైవప్రవక్త (స) తన ఆకుపచ్చ రంగు గల దుస్తుల సైనిక పటాలం వెంట అక్కడికి చేరుకున్నారు. ఆయన (స) వెంట ముహాజిర్లు మరియు అన్సారులు ఉన్నారు. వీరు మనుషుల్లా కాకుండా ఓ ఉక్కువాహినిలా అగుపిస్తున్నారు అబూ సుఫ్యాన్‌కు. ఇది చూసిన అబూ సుఫ్యాన్, "సుబ్‌హానల్లాహ్! ఓ అబ్బాస్, వచ్చేవారు ఎవరు?" అని అడిగాడు.

"అన్సారులు మరియు ముహాజిర్ల వెంట 7 మహాప్రవక్త (స) అరుదెస్తున్నారు" అన్నారు అబ్బాస్.

"వీరితో తలపడే ధైర్యం ఎవరికి ఉంది? అబుల్ ఫజల్! నీ సోదర కుమారుని రాచరికం ఎంత ఘనమైనది?" అని ఆశ్చర్యాన్ని ప్రకటించాడు అబూ సుఫ్యాన్. దీనికి సమాధానంగా హజ్రత్ అబ్బాస్ (ర), "అబూ సుఫ్యాన్, ఇది ప్రవక్త పదవి" అన్నారు.

"అవును, అది నిజమే" అని ఒప్పుకున్నాడు అబూ సుఫ్యాన్.

ఈ సందర్భంలోనే ఓ సంఘటన జరిగింది. అన్సార్ పతాకం హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా (ర)గారి చేతిలో ఉంది. ఆయన అబూ సుఫ్యాన్ ముందు నుండి పోతూ ఇలా అన్నారు.

"ఈ రోజు రక్తపాతం జరిగే రోజు. ఈ రోజు నిషిద్ధమైనది ధర్మసమ్మతంగా మార్చబడే రోజు. ఈ రోజు అల్లాహ్ ఖురైష్‌ను అగౌరవానికి గురిచేస్తాడు."

మహాప్రవక్త (స) అక్కడికి రాగానే అబూ సుఫ్యాన్, "ఓ మహాప్రవక్తా! తమరు సఅద్ అన్న మాటలు వినలేదా?" అని అడిగాడు.

"సఅద్ ఏమన్నాడు?" అడిగారు దైవప్రవక్త (స).

https://teluguislam.net



సఅద్ అన్న మాటలు ఏవో మహాప్రవక్త (స)కు వినిపించాడు అబూ సుఫ్‌యాన్. ఇది విన్న హజ్రత్ ఉస్మాన్ మరియు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)లు, "దైవప్రవక్తా! సఅద్ ఖురైష్‌లో రక్తపాతాన్ని సృష్టిస్తారేమో అని మాకు భయంగా ఉంది" అని విన్నవించుకోగా ఆయన, "లేదు, ఈ రోజు కాబా గృహాన్ని గౌరవించే రోజు. ఈ రోజు అల్లాహ్ ఖురైష్‌కు గౌరవం ప్రసాదించే రోజు" అంటూ సఅద్ వద్దకు మనిషిని పంపించి ఆయన చేతిలో ఉన్న జెండాను వెనక్కి తెప్పించుకున్నారు. దాన్ని ఆయన కుమారుడు 'ఖైస్' చేతికి అందించారు. అంటే జెండా మాత్రం హజ్రత్ సఅద్ చేతి నుండి మరొకరి చేతిలోనికి పోలేదన్నట్లే.

మరో ఉల్లేఖనంలో జెండాను హజ్రత్ జుబైర్ (ర)గారికి అందించినట్లు ఉంది.

## హఠాత్తుగా ఖురైష్ పైకి వచ్చిపడ్డ ఇస్లామీయ సైన్యం

మహాప్రవక్త (స) అబూ సుఫ్‌యాన్‌ను దాటి వెళ్ళగా, హజ్రత్ అబ్బాస్ (ర) అతనితో, "అబూ సుఫ్‌యాన్ వెంటనే మక్కా వెళ్ళు" అని చెప్పారు. అతను రొప్పుతూ మక్కాకు వెళ్ళి పెద్దగా అరుస్తూ, "ఖురైష్ ప్రజలారా! ముహమ్మద్ మీ వద్దకు పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చేశారు. ఆ సైన్యాన్ని అడ్డుకునే శక్తి మీకు లేదు. కాబట్టి ఎవరైతే నా ఇంట చొరబడతారో వారికి రక్షణ లభిస్తుంది" అని అన్నాడు. ఈ మాటలు విన్న అతని భార్య లేచి అతని మీసాలను పట్టుకుని,

"అధిక ప్రేలాపన చేసే వీణ్ణి పట్టుకొని చంపేయండి. ఓరి నీ బండబడా! ఎలా శరీరాన్ని పెంచావురా. ఇలాంటి కబురారా నీవు తీసుకువచ్చింది?" అని తిట్టింది.

"మీరు నాశనం కాను. చూడండి, ఈ దెయ్యం మీ ప్రాణాల విషయంలో మిమ్మల్ని మోసగిస్తోంది. మోసపోకండి. ఎందుకంటే ముహమ్మద్ వెంట వచ్చిన సైన్యాన్ని అడ్డుకోవడం మీ తరం కాదు. కాబట్టి ఎవరైతే అబూ సుఫ్‌యాన్ ఇంట రక్షణ పొందుతాడో అతనికి రక్షణ లభిస్తుంది" అన్నాడు అబూ సుఫ్‌యాన్ మళ్ళీ,

https://teluguislam.net



"ఒరేయ్ నీవు చావా! నీ ఇల్లు మా ఎంత మందికి రక్షణ ఇస్తుందిరా?" అడిగారు వారు.

"అదేకాదు, ఎవరైతే తమ ఇండ్లల్లో ఉండి లోన గడియ వేసుకుంటారో వారికీ రక్షణ లభిస్తుంది. మరెవరైతే మస్జిదె హరామ్‌లో చొరబడతారో వారికీ రక్షణ లభిస్తుంది" అన్నాడు అబూ సుఫ్యాన్.

ఈ మాటలు విన్న ప్రజలు తమ ఇండ్ల వైపునకు, మస్జిదె హరామ్ వైపునకు పరుగులు తీశారు. అయితే ఖురైష్, తమ పోకిరిగాళ్ళను మాత్రం ముస్లిములను అడ్డుకునేందుకు ముందుకు పంపించారు. ఒకవేళ వారికి ఏదైనా సాఫల్యం లభిస్తే సరేసరి లేదా వారేగనక వెనక్కు తగ్గితే ముస్లిముల డిమాండులను ఒప్పుకుందాం అనే ఉద్దేశ్యం వారిది. ఖురైషులు ముస్లిము లను ఎదుర్కోవడానికి ఏ రౌడీలనైతే ముందుకు పంపారో ఆ రౌడీమూకలు సుఫ్వాన్ బిన్ ఉమయ్యా మరియు సుహైల్ బిన్ అమ్రూ నేతృత్వంలో 'ఖంద్‌మా' అనే ప్రదేశంలో బారులు తీరి ఉన్నారు. వీరిలో బనూ బక్రకు చెందిన ఓ వ్యక్తి హమాస్ బిన్ ఖైస్ కూడా ఉన్నాడు. ఇతను ఇదివరకు ఆయుధాలకు సానపెట్టే పనిచేస్తూ ఉండేవాడు. అతను ఆయుధాలకు సానపెట్టడం చూసి అతని భార్య అతణ్ణి ఉద్దేశించి, "ఏమిటీ నీవు చేస్తున్నది? ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబోతున్నావు?" అని అడిగింది.

"ఇదా! ముహమ్మద్ (స)నూ మరియు ఆయన అనుచరుల్నీ ఎదుర్కోవడానికి."

"దైవసాక్షి! ముహమ్మద్ (స) మరియు ఆయన సహచరుల ధాటికి ఎవరూ నిలువలేరు."

"దైవసాక్షి! నీవలా అనుకుంటున్నావేమో? ఆయన అనుచరుల్లో కొందరిని పట్టుకొచ్చి నీకు సేవకులుగా చేస్తాను చూడు" అంటూ తన ఆయుధాలను చూయిస్తూ,

"ఈ రోజే గనక ఆయన నాకు ఎదురుబడితే నాకు ఎలాంటి భయం ఉండదు. చూశావా ఈ ఆయుధం, ఈ శూలం, ఒర నుండి వెంటనే దూసుకు వచ్చే రెండు వైపులా పదునున్న ఈ కరవాలం?" అని బింకాలు పలుకసాగాడు.

ఖంద్‌మా యుద్ధంలో ఇతను కూడా పాల్గొన్నవాడే.

https://teluguislam.net



## 'జీతువా'కు చేరిన ఇస్లామీయ సైన్యం

ఇటు మహాప్రవక్త (స) మఁర్రజ్జహ్రాన్ దాటి జీతువాకు చేరుకున్నారు - ఈలోపు అల్లాహ్ ప్రసాదించిన విజయాన్ని తలచుకొని కృతజ్ఞతాపూర్వకంగా ఆయన తన తలను క్రిందికి వంచి ఉంచారు. అలా తలవంచడం వలన ఆయన గెడ్డం వెంట్రుకలు 'కజావా' (అంబారి) కర్రను తాకుతున్నాయి - జీతువాలో ఆగి ఆయన (స), తన సైన్యాన్ని తీర్చి నిలబెట్టారు. ఖాలిద్ బిన్ వలీద్ (ర)ను కుడి వైపున ఉన్న సైన్యానికి నాయకునిగా చేశారు - ఆ సైన్యంలో అస్లమ్, సులైమ్, గిఫ్ఫార్, ముజీనా, జుహైనా ఇంకొన్ని అరబ్బు తెగలకు చెందినవారున్నారు- మక్కా దిగువ భాగం నుండి ప్రవేశించమని, ఖురైషులకు చెందిన వాడెవడైనా అడ్డుపడితే అతడిని నరికివేసి 'సఫా' కొండ వద్ద తనను వచ్చి కలువమని ఖాలిద్ బిన్ వలీద్ (ర)కు ఆదేశమిచ్చారాయన.

హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) ఎడమ కొమ్ముృన ఉన్నారు. ఆయన వెంట దైవప్రవక్త (స) గారి పతాకం ఉంది. ఎగువ భాగం ద్వారా మక్కా నగరంలో ప్రవేశించి 'కిదా'కు చేరమని, 'హజూన్' అనే చోట ఆ జెండాను పాతి అక్కడనే తన రాక కోసం ఎదురుచూడమని ఆదేశించారాయనకు,.

హజ్రత్ అబూ ఉబైదా (ర) పదాతిదళ కమాండరుగా నియుక్తులయ్యారు. 'బత్నెవాదీ' (బత్న్ లోయ) వైపునకు పయనిస్తూ తనను మక్కాలో వచ్చి కలువమని ఆదేశమిచ్చారాయనకు.

## మక్కాలో ప్రవేశించిన ఇస్లామీయ సైన్యం

ఈ ఆదేశాలందుకున్న అన్ని సైనిక పటాలాలు వాటికి నిర్దేశించబడిన మార్గాలగుండా బయలుదేరి వెళ్ళాయి.

హజ్రత్ ఖాలిద్ (ర) మరియు ఆయన సహచరులు పోరాటం చేసే ఉద్దేశ్యంతో ఎదురు వచ్చిన ప్రతి ముష్రిక్కును మట్టుబెట్టారు. అయితే ఖాలిద్ సైన్యంలోని ఇద్దరు, కర్జ్ బిన్ ఫహ్రీ (ర) మరియు ఖునైస్ బిన్ ఖాలిద్ బిన్ రబీయా (ర)లు అమరగతినొందవలసివచ్చింది. జరిగినదేమిటంటే, వీరిద్దరు సైన్యం నుండి తప్పిపోయి వేరే దారిపట్టడం వల్ల చంపబడ్డారు. 'ఖంద్మా' అనే చోటికి చేరగానే ఖాలిద్ (ర)కు ఖురైషులు పంపిన పోకిరిమూక ఎదురుబడింది. ఓ చిన్న పోరాటం జరిగి అందులో పన్నెండుగురు ముష్రిక్కులు హతమయ్యారు. ఆ తరువాత ముష్రిక్కుల పటాలంలో అస్తవ్యస్త

https://teluguislam.net



పరిస్థితి నెలకొని పారిపోయారు. ముస్లిములతో తలపడడానికి ఆయుధాలు సానపెట్టిన హమ్మాస్ బిన్ ఖైస్ పారిపోయి తన ఇంట చొరబడి తన భార్యతో తలుపులు మూసేయ్ అని చెప్పగా ఆమె, "ఏమిటి? నీవు పలికిన బీరాలు ఏమయ్యాయి?" అని అడిగింది.

"నీవే గనక ఆ యుద్ధం తీరు చూసి ఉంటే ఇలా అనకపోయేదానివి. సుఫ్వాన్ బిన్ అక్రమా పారిపోయాడు. నగ్నకరవాలాలతో మాకు స్వాగతం పలుకబడింది. అవి మనవారి మణికట్టులను, తలలను నరికిపారవేశాయి. వెనుక వైపు పెద్ద గోల కంటే మాకు మరేదీ వినబడలేదు. అదే నీవు చూసి ఉంటే అంత తేలిగ్గా ఆ మాట అనకపోయేదానివి" అన్నాడు భయంభయంగా.

అనంతరం హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర), మక్కా బజార్లు సందు గొందుల్ని దాటేసుకుంటూ సఫా కొండపై దైవప్రవక్త (స) గారిని వచ్చి కలిశారు.

ఇటు హజ్రత్ జుబైర్ (ర), ముందుకు వెడుతూ 'హజూన్'లో (మస్జిదె ఫతహ్ దగ్గర) దైవప్రవక్త (స) గారి ధ్వజాన్ని పాతి నిలబెట్టారు. ఆయన కోసం ఓ గుడారాన్ని కూడా నిర్మించి అక్కడనే దైవప్రవక్త (స) గారి రాక కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. మహాప్రవక్త (స) కూడా అక్కడికి చేరు కున్నారు.

## దైవ గృహంలోనికి ప్రవేశించిన మహాప్రవక్త (స)-విగ్రహాల తొలగింపు

తదనంతరం మహాప్రవక్త(స) లేచి బయలుదేరారు. అన్సారులు, ముహాజిర్ల బృందాలు ఆయన వెనుకగా, ముందుగా నడుస్తున్నారు. మస్జిదె హరామ్‌లో ప్రవేశించి ముందు హజ్రె అస్వద్‌ను ముద్దాడారు. ఆ తరువాత దైవగృహం (బైతుల్లాహ్) ప్రదక్షిణ చేశారు. అప్పుడు ఆయన చేతిలో ఓ ధనస్సు ఉంది. బైతుల్లాహ్ చుట్టూ, దాని కప్పుపైనా మూడు వందల అరవై విగ్రహాలు ప్రతిష్టించబడి ఉన్నాయి ఆ సమయంలో. మహాప్రవక్త (స) ఆ ధనస్సుతో ఆ విగ్రహాలను కొడుతూ ఇలా పలుకనారంభించారు.

جَآءَ الْحَقُّ وَ زَهَقَ الْبَاطِلُ ؕ اِنَّ الْبَاطِلَ كَانَ زَهُوْقًا ۝

**"సత్యం వచ్చేసింది, అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు."**

**(17: 81)**

https://teluguislam.net



جَآءَ الْحَقُّ وَمَا يُبْدِئُ الْبَاطِلُ وَمَا يُعِيدُ ۝

"సత్యం వచ్చేసింది. ఇక అసత్యం ఏది చేసినా నెగ్గజాలదు." (34 : 49)

ఆ దెబ్బలకు ఆ విగ్రహాలు వాటి ముఖాలపై బోర్లాపడిపోతున్నాయి. మహాప్రవక్త (స) తన ఒంటె నెక్కి దైవగృహం తవాఫ్ చేశారు. ఇహ్రామ్ కట్టుకోలేదు కనుక ఆ తవాఫ్‌తోనే సరిపుచ్చారు. కాబా గృహ ప్రదక్షిణ అయిన తరువాత ఆయన (స) హజ్రత్ ఉస్మాన్ బిన్ తల్హా (ర)ను పిలిచి ఆయన చేతిలో నుండి దైవగృహం తాళాలు తీసుకున్నారు. ఆయన ఆదేశించగా కాబా గృహం తలుపులు తెరువబడ్డాయి. లోనికి ప్రవేశించగా ఆయనకు చిత్రపటాలు అగుబడ్డాయి. వాటిలో హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మరియు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) గారి చిత్రపటాలు కూడా ఉన్నాయి. వారి చేతుల్లో శకునాలు చూసే బాణాలు ఉన్నాయి. ఈ దృశ్యం చూడగానే మహాప్రవక్త (స), "అల్లాహ్! ఈ విగ్రహారాధకులను నాశనం చేయుగాక! దైవసాక్షి! ఈ ఇద్దరు ప్రవక్తలు ఏనాడూ శకునాలు చూసే బాణాలను ఉపయోగించలేదు" అన్నారు. ఆయన (స) కాబా గృహంలో కర్రతో చేయ బడిన ఓ పావురాన్ని కూడా చూశారు. దాన్ని తన చేతులతో విరిచేశారు. అక్కడున్న పటాలన్నీ ఆయన ఆదేశం మేరకు చెరిపివేయబడ్డాయి.

## కాబా గృహంలో దైవప్రవక్త (స) గారి నమాజు - ఖురైష్‌ను సంబోధించడం

ఆ తరువాత మహాప్రవక్త (స) కాబా తలుపును లోపలి నుంచి గడియవేసుకున్నారు. హజ్రత్ ఉసామ (ర) మరియు హజ్రత్ బిలాల్ (ర) కూడా లోపలే ఉన్నారు. పిదప దైవప్రవక్త (స) ద్వారానికి ఎదురుగా ఉన్న గోడ వైపు నడిచారు. గోడ కేవలం మూడు మూరల దూరంలో ఉండగా ఆగిపోయారు. రెండు స్తంభాలు ఆయనకు ఎడమ వైపున, ఒక స్తంభం కుడి వైపున, మూడు స్తంభాలు వెనుకగా చేసి - ఆ రోజుల్లో కాబా గృహంలో ఆరు స్తంభాలుండేవి- అక్కడే నిలబడి నమాజు చేశారు. తరువాత బైతుల్లాహ్ లోపలి భాగంలో చుట్టూ తిరిగి వచ్చారు. 'అన్ని మూలల్లోను తక్బీర్ (దైవ ఔన్నత్యం), తౌహీద్ (ఏకత్వం) వచనాలను (అంటే అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్) పలికారు. ఆ తరువాత ద్వారాన్ని తెరిచేశారు. ఖురైష్

https://teluguislam.net



ఎదురుగా మస్జిదె హరామ్‌లో వరుసలు కట్టి కిటకిటలాడుతూ నిలబడి ఉన్నారు. వారు మహాప్రవక్త (స) ఏం చేస్తారో అని నిరీక్షిస్తున్నారు. మహాప్రవక్త (స) గుమ్మంలో నిలబడి దాని రెండు నిలువు కమ్మీలను పట్టుకున్నారు. క్రింది వైపున ఖురైషులు ఉన్నారు. వారినుద్దేశించి ఇలా అన్నారు:

"అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడూ లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. ఆయన తన వాగ్దానాన్ని నిజం చేసి చూపించాడు. తన దాసునికి సహాయపడ్డాడు. తానొక్కడే మూకలన్నిటికీ పరాజయాన్ని కలుగజేశాడు. వినండి! బైతుల్లాహ్ (కాబా గృహం) తాళపుచెవులను కలిగివుండడం, హాజీలకు దాహం తీర్చడం లాంటివి తప్ప తక్కిన బిరుదులు లేదా ఉన్నత స్థానాలు లేదా రక్తం నా ఈ రెండు పాదాల క్రింద ఉన్నవే. జ్ఞాపకం ఉంచుకోండి. కావాలని హత్య చేసిన దానికి 'దీత్' (రక్తపరిహారం) వంద ఒంటెలు. వాటిలో నలభై ఒంటెలు చూడివి అయి ఉండాలి.

ఓ ఖురైషు ప్రజలారా! అల్లాహ్ మీ నుండి అజ్ఞాన కాలపు నీల్గును, తాతముత్తాతల పేరు చెప్పి గర్వపడడాన్ని అంతమొందించాడు. ప్రజలందరూ ఆదం సంతానం. ఆదం మట్టితో సృజించబడినవాడు" అంటూ ఈ ఖుర్‌ఆన్ ఆయత్‌ను పఠించారు.

يَاأَيُّهَا النَّاسُ إِنَّا خَلَقْنَاكُم مِّن ذَكَرٍ وَأُنثَىٰ وَجَعَلْنَاكُمْ شُعُوبًا وَقَبَائِلَ
لِتَعَارَفُوا ۚ إِنَّ أَكْرَمَكُمْ عِندَ اللَّهِ أَتْقَاكُمْ ۚ إِنَّ اللَّهَ عَلِيمٌ خَبِيرٌ ﴿١٣﴾

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరి కంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవ పాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడు." (49 : 13)

## ఈ రోజు మీపై ఎలాంటి నిందమోపను

దాని తరువాత మహాప్రవక్త (స) ఖురైషులను సంబోధిస్తూ ఇలా

https://teluguislam.net



అన్నారు: "ఓ ఖురైషు ప్రజలారా! నేను ఈ రోజు మీ ఎడల ఎలా ప్రవర్తించ బోతున్నానో మీకు తెలుసా?" అని అడగగా వారు;

"మేలైన ప్రవర్తన! తమరు దయాళువు అయిన సోదరులు, దయాళువు అయిన సోదరుని కుమారులు" అని అరిచారు.

నేను మీతో, హజ్రత్ యూసుఫ్ (అ.స.) తన సోదరులతో అన్న మాటలనే అంటాను. ఆయన ఆనాడు ఇలా అన్నారు: 'లా తస్రీబఅలైకుముల్ యౌమ్' (ఈ రోజు మీపై ఎలాంటి నిందను మోపబోవడం లేదు, పొండి, మీరంతా ఈ రోజు నుండి స్వతంత్రులు) మహాప్రవక్త (స).

## కాబా తాళం చెవిని దాని హక్కుదారునికి అందించడం

మహాప్రవక్త (స) ఆపై మస్జిదులో కూర్చున్నారు. కాబా తాళపు చెవిని చేతబట్టుకొని ఉన్న హజ్రత్ అలి (ర) దైవప్రవక్త (స) సన్నిధిలోనికి వచ్చి, "ప్రవక్తా! హాజీలకు నీరు త్రాగించే హోదా మరియు గౌరవంతో పాటే ఈ గృహం తాళాన్ని కలిగి ఉండే హోదా కూడా మాకే ప్రసాదించండి. దైవం మిమ్మల్ని కరుణించుగాక" అని విన్నవించుకున్నారు.

మరో ఉల్లేఖనంలో, ఈ విన్నపం హజ్రత్ అబ్బాస్ (ర) చేసినట్లుగా ఉంది. దైవప్రవక్త (స), "ఉస్మాన్ ఏడీ!" అని అడగగా ఆయన్ను పిలువ నంపడం జరిగింది.

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు; "ఉస్మాన్ ఇదిగో నీ తాళపు చెవి, ఈ రోజు సత్కార్యాలకు సంబంధిం చిన రోజు. విశ్వాసపాత్రులకు సంబంధించిన రోజు".

తబ్కాత్ ఇబ్నె సఅద్‌లోని ఉల్లేఖనంలో, మహాప్రవక్త (స) ఆ తాళపు చెవిని హజ్రత్ ఉస్మాన్ బిన్ తల్హా (ర)కు అందిస్తూ,

"దీన్ని శాశ్వతంగా నీ దగ్గరనే ఉంచుకో. మీ నుండి ఈ తాళపు చెవిని బలవంతంగా లాక్కున్నవాడు దౌర్జన్యపరుడు. ఓ ఉస్మాన్! అల్లాహ్ మిమ్మల్ని తన గృహానికి అమానతుదారులుగా చేశాడు. కాబట్టి కాబా గృహం నుండి మీకు లభించే సొత్తును ప్రసిద్ధ రీతిలో (అందరికీ ఆమోదకరమైన రీతిలో) అనుభవించండి" అని సెలవిచ్చారు.

https://teluguislam.net



## కాబా గృహ కప్పుపై నిలబడి హజ్రత్ బిలాల్ (ర) పలికిన అజాన్

నమాజు వేళ కాగానే మహాప్రవక్త (స) హజ్రత్ బిలాల్(ర)ను పిలిచి కాబా గృహం పైకి ఎక్కి అజాన్ పిలుపు ఇవ్వమని ఆదేశించారు. అప్పుడు అబూ సుఫ్యాన్ బిన్ హరబ్, అత్తాబ్ బిన్ అసీద్ మరియు హారిస్ బిన్ హిష్షామ్ కాబా గృహ ప్రాంగణంలో కూర్చుని ఉన్నారు. వారి నడుమ ఈ క్రింది సంభాషణ జరిగింది. అతాబ్ బిన్ అసీద్ ఆ సందర్భంగా తన మిత్రులతో మాట్లాడుతూ;

"అల్లాహ్ అసీద్‌కు ఆ పిలుపు (అజాన్) వినకుండా ఉండే భాగ్యాన్ని ప్రసాదించాడు. లేకుంటే ఆ కటువైన పలుకులు వినవలసివచ్చేదే" అన్నాడు.

"వినవయ్యా దైవసాక్షిగా చెబుతున్నాను! ఆయనే గనక నిజంగా ప్రవక్త అయితే నేను ఆయనకు అనుచరుణ్ణయి విధేయిస్తాను" అన్నాడు హారిస్.

"అబ్బే నేనేం మాట్లాడను. నేనేదైనా మాట్లాడానా ఈ గులక రాళ్ళున్నాయి చూశావు ఇవి కూడా నా గురించి ఆయనకు చెప్పేస్తాయి" అన్నాడు అబూ సుఫ్యాన్.

ఆ తరువాత ఆ ముగ్గురు కలసి మహాప్రవక్త (స) దగ్గరకు వెళ్ళారు. ఆయన వారిని చూసి;

"ఇప్పుడిప్పుడే మీ ముగ్గురు కలసి ఏం మాట్లాడుకున్నారో అది నాకు తెలిసిపోయింది" అంటూ ఈ ముగ్గురి సంభాషణను వారికి వినిపించారు మహాప్రవక్త (స). దైవప్రవక్త (స) నోట ఈ మాటలు విన్నారో లేదో హారిస్ మరియు అతాబ్‌లు వెంటనే, "మేము సాక్ష్యం ఇస్తున్నాం. తమరు అల్లాహ్ ప్రవక్తేనని. దైవసాక్షి! మేము మాట్లాడుకున్నప్పుడు మా ముగ్గురి తప్ప అక్కడ మరెవ్వరూ లేరు మా సంభాషణను విని మీకు చెప్పడానికి" అంటూ ఇస్లామ్ ధర్మం స్వీకరించారు.

## విజయం లభించినందుకు లేదా కృతజ్ఞతలు తెలుపుకోడానికి చేసిన నమాజు

అదే రోజు మహాప్రవక్త (స) అబూ తాలిబ్ కుమార్తె 'ఉమ్మె హానీ' ఇంటికి వెళ్ళారు. అక్కడ ఆయన స్నానం చేసి ఆ యింటనే ఎనిమిది రకాఅత్‌ల నమాజు చేశారు. ఇది చాష్త్ సమయం (అంటే ప్రొద్దు కొంత

https://teluguislam.net



ఎక్కిన తరువాతి సమయం). కాబట్టి ఈ నమాజును కొందరు చాష్త్ నమాజ్‌గా, మరికొందరు అది విజయం ప్రాప్తించినందుకు కృతజ్ఞతాపూర్వకంగా చేసిన నమాజు ఏమో అని అనుకున్నారు. ఉమ్మె హానీ తన ఇద్దరు మరదులకు (భర్త సోదరులకు) రక్షణ ఇచ్చి ఉన్నారు. అది గమనించిన మహాప్రవక్త (స) ఆమెతో, "ఉమ్మె హానీ! నీవు ఎవరికైతే రక్షణ ఇచ్చావో నేనూ రక్షణ ఇచ్చానని అనుకో" అన్నారు. ఇలా చెప్పడానికి కారణం, ఉమ్మె హానీ సోదరుడు హజ్రత్ అలీ (ర) వారిద్దరిని హతమార్చాలని అనుకోవడమే. అందుకని ఉమ్మె హానీ వారిద్దరిని తన ఇంట ఉంచి తలుపులు గడియ వేసి ఉంచవలసి వచ్చింది. మహాప్రవక్త (స) ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు వారి విషయం అడిగారు. దైవప్రవక్త (స) వారికి రక్షణ ఇచ్చానని తెలిసి ధైర్యాన్ని తెచ్చుకున్నారు ఆమె.

## కరుడుగట్టిన నేరస్తుల హత్యలకు రక్తపరిహారం నాస్తి

మక్కా విజయం నాడు కరుడుగట్టిన తొమ్మండుగురు నేరస్తుల హత్యకు రక్తపరిహారం లేదంటూ ప్రకటించబడింది. వారు కాబా గృహం పరదా వెనుకను దాక్కున్నాసరే వారిని సంహరించవలసిందే అని ఆదేశించడం జరిగింది. వారి పేర్లు ఇవి:

1) అబ్దుల్ ఉజ్జా బిన్ ఖలీల్ 2) అబ్దుల్లాహ్ బిన్ సఅద్ బిన్ అబీసరహ్ 3) అక్రమా బిన్ అబీ జహల్ 4) హారిస్ బిన్ నుఫైల్ బిన్ వహబ్ 5) ముఖైస్ బిన్ సబాబా 6) హబ్బార్ బిన్ అస్వద్ 7-8) ఇబ్నె కతల్‌కు చెందిన ఇద్దరు స్త్రీ బానిసలు (వీరు దైవప్రవక్త (స)ను తిడుతూ ఉండేవారు). 9) సారా. ఈమె అబ్దుల్ ముత్తలిబ్ వంశంలో ఒకరికి బానిసగా ఉండేది. ఈమె వద్ద హాతిబ్ (ర) లేఖ పట్టుబడింది.

ఇబ్నె అబీ సరహ్‌ను హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (ర) దైవప్రవక్త (స) సన్నిధికి గొనిపోయి అతనికి ప్రాణభిక్ష పెట్టమని అర్థించారు. ఆయన (స) అతనికి ప్రాణభిక్ష పెట్టగా అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అంతకు ముందు మహాప్రవక్త (స) అతనికి ప్రాణభిక్ష పెట్టకుండా కొంత తాత్సారం చేశారు. దానికి కారణం లేకపోలేదు. తను అనుచరుల్లో ఎవరైనా లేచి అతని తలను మొండెం నుండి వేరుచేస్తారేమో అని ఎదురు చూశారు. ఎందుకంటే

https://teluguislam.net



ఈ వ్యక్తి ఇంతకు పూర్వం కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిము అయి హిజ్రత్ చేసి మదీనా వచ్చినవాడు. కాని ఆ తరువాత ధర్మభ్రష్టుడు (ముర్తిద్) అయి పారిపోయి మక్కా చేరుకున్న వ్యక్తి. (అయినప్పటికీ ఆ తరువాత అతను ఇస్లామ్ ప్రకారంగానే నడుచుకున్నాడు.)

అక్రమా బిన్ అబీ జహల్ యమన్‌కు పారిపోయాడు. అయితే అతని భార్య దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై అతనికి ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయ పడింది. మహాప్రవక్త (స) అతనికి ప్రాణభిక్షను ప్రసాదించారు. ఆ తరువాత ఆమె అక్రమాను వెన్నంటి వెళ్ళి అతణ్ణి తోడ్కొని వచ్చింది. రాగానే అతను ఇస్లామ్ ధర్మం స్వీకరించాడు.

ఇబ్నె ఖతల్ కాబా గృహం పరదా పట్టుకొని వ్రేళ్ళాడుతున్నాడు. ఓ సహాబీ (ర) దైవప్రవక్త (స)కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఆయన, అతణ్ణి చంపేయండి అని చెప్పగా ఆ సహాబి అతణ్ణి చంపేశారు.

ముఖీస్ బిన్ సబాబాను హజ్రత్ సుమైలా బిన్ అబ్దుల్లా హతమార్చారు. ముఖైస్ ఇదివరకే ఇస్లామ్‌ను స్వీకరించినవాడు కాని ఓ అన్సారీని హతమార్చి ధర్మభ్రష్టుడై ముష్రిక్కుల వద్దకు పారిపోయి వచ్చినవాడు.

హారిస్, ఇతను మక్కాలో దైవప్రవక్త (స)ను బాగా హింసించేవాడు. అతణ్ణి హజ్రత్ అలి (ర) హతమార్చారు.

హబ్బార్ బిన్ అస్వద్ ఒకప్పుడు దైవప్రవక్త (స) గారి కుమార్తె హజ్రత్ జైనబ్‌ను, ఆమె హిజ్రత్ చేసి మదీనాకు వెళ్ళేటప్పుడు- నెట్టడం వలన ఆమె ఒంటె అంబారీ నుండి క్రిందపడిపోయారు. అలా పడిపోవడం వలన ఆమె గర్భం పడిపోయింది. ఇతను మక్కా విజయం రోజున మక్కా నుండి పారిపోయాడు. ఆ తరువాత ఇస్లామ్ స్వీకరించి బ్రతికిపోయాడు.

ఇబ్నె ఖతల్‌కు చెందిన ఇద్దరు స్త్రీ బానిసల్లో ఒకామె చంపేయబడింది. మరొకామె కోసం ప్రాణభిక్ష కోరడం జరిగింది. ఆ తరువాత ఆమె కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించింది. అలాగే సారా కోసం కూడా ప్రాణభిక్ష కోరడం జరిగింది. ఆమె కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించింది.

(మొత్తానికి తొమ్మండుగురిలో నలుగురు మాత్రమే చంపబడ్డారు. తక్కిన అయిదుగురికి ప్రాణభిక్ష లభించింది. వారంతా ఇస్లామ్‌ను స్వీకరించారు ఆ తరువాత).

https://teluguislam.net



హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా రాస్తున్నారు:

ఎవరి హత్యలకు రక్తపరిహారం లేదని ప్రకటించబడిందో వారిలో అబూ మాషిర్, హారిస్ బిన్ తలాల్ ఖజాయీ పేరు కూడా ఉందని అబూ మాషిర్ అంటారు. అతణ్ణి హజ్రత్ అలి (ర) సంహరించారు. ఇమామె హాకిమ్ ఓ పట్టికలో కఅబ్ బిన్ జుబైర్ పేరును కూడా ఉటంకించడం జరిగింది - కఅబ్‌కు సంబంధించిన సంఘటన ప్రాచుర్యం పొందిన సంఘటన- అతను ఆ తరువాత వచ్చి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. దైవప్రవక్త (స)ను పొగిడాడు కూడా. (అదే పట్టికలో) వహ్షి బిన్ హరబ్ (హజ్రత్ హమ్‌జా (ర)గారి హంతకుడు), అబూ సుఫ్‌యాన్ భార్య హింద్ బిన్తె ఉత్బైబాలు కూడా ఉన్నారు. వీరిద్దరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అయితే ఇబ్నె ఖతల్ బానిసరాలు అర్‌నిబ్ చంపబడింది. ఉమ్మె సఅద్ కూడా సంహరించబడింది. ఇబ్నె ఇస్‌హాక్ కథనంలో మొత్తం ఎనిమిది మంది పురుషులు, ఆరుగురు స్త్రీలని ఉంది. బహుశా వారు స్త్రీ బానిసలు అర్నిబ్, ఉమ్మె సఅద్‌లు అయి ఉంటారు. ఈ అభిప్రాయభేదం కేవలం పేర్లకు సంబంధించినది మాత్రమే. వారి మారు పేర్లను గురించి ఈ తేడా కనిపిస్తుందేమో.[9]

## 'సుఫ్‌వాన్ బిన్ ఉమయ్యా' మరియు 'ఫిజాలా బిన్ ఉమైర్'ల ఇస్లామ్ స్వీకారం

సుఫ్‌వాన్ హత్యకు రక్తపరిహారం లేదు అని ప్రకటించబడినప్పటికీ అతను ఖురైష్‌కు చెందిన ఓ పెద్ద నాయకుడు అయినందున తాను తన ప్రాణాలను దక్కించుకునే ఉద్దేశ్యంతో పారిపోవాల్సివచ్చింది. ఉమైర్ బిన్ వహబ్ హుజ్మీ, మహాప్రవక్త (స) సన్నిధిలో హాజరై తనకు రక్షణ కల్పించండని కోరారు. మహాప్రవక్త (స) అతనికి రక్షణ ఇచ్చారు. గుర్తుగా ఉమైర్‌కు అతను మక్కాలో ప్రవేశించేటప్పుడు తన తలపై కట్టుకున్న తలపాగాను కూడా ప్రసాదించారు. ఉమైర్ సుఫ్‌వాన్‌ను వెదుకుతూ అతని వద్దకు వెళ్ళినప్పుడు అతను 'జిద్దా' నుండి యమన్‌కు వెళ్ళడానికి ఓడ ప్రయాణం కోసం సంసిద్ధం అవుతున్నాడు. ఉమైర్ అతణ్ణి వెనక్కు పిలుచుకువచ్చారు. సుఫ్‌వాన్ బిన్

9. ఫత్‌హుల్ బారీ-8/11,12

https://teluguislam.net



ఉమయ్యా దైవప్రవక్త (స) గారి సన్నిధికి వచ్చి రెండు నెలల గడువు కోరగా అతనికి ఆయన నాలుగు నెలల గడువును ఇచ్చారు. ఆ తరువాత సుఫ్వాన్ ఇస్లామ్ స్వీకరించాడు. అతని భార్య ఇదివరకే ఇస్లామ్ స్వీకరించి ముస్లింగా మారిపోయి ఉన్నందున వారిద్దరినీ వారి మునుపటి నికాహ్ బంధంలోనే ఉంచారు మహాప్రవక్త (స).

'ఫిజాలా' ఓ ధైర్యసాహసాలుగల మనిషి. దైవప్రవక్త (స) కాబా గృహం తవాఫ్ (ప్రదక్షిణ) చేసేటప్పుడు ఆయన్ను చంపడానికి ధైర్యం చేసిన వ్యక్తి. కాని అతను దగ్గరకు రాగానే తాను ఏ ఉద్దేశ్యంతో అక్కడికి వచ్చిందో చెప్పారు మహాప్రవక్త (స) అతనితో. దానితో అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడు.

## మక్కా విజయం మరుసటి రోజున మహాప్రవక్త (స) గారి ప్రసంగం

మక్కా జయించబడిన మరునాడు మహాప్రవక్త (స) ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడానికి తిరిగి లేచి నిలబడ్డారు. మొదట ఆయన దైవస్తుతి చేస్తూ ఆయన్ను శ్లాఘించారు. ఆ తరువాత ఇలా ప్రసంగించారు:

"ప్రజలారా! అల్లాహ్ ఏ రోజైతే ఈ భూమ్యాకాశాల్ని సృజించాడో ఆ రోజే మక్కాను హరామ్ (పవిత్రమైన నగరంగా) చేశాడు. కాబట్టి అది అల్లాహ్ పవిత్రత కారణంగా ప్రళయ దినం వరకు పవిత్రంగానే ఉంటుంది. అల్లాహ్ను, ప్రళయ దినాన్నీ విశ్వసించే వారెవరికీ ఈ ప్రదేశంలో రక్తపాతం సృష్టించడం లేదా ఇక్కడి చెట్లను నరకడం ధర్మసమ్మతమైన విషయం కాదు. ఎవరైనా దైవప్రవక్త (స) ఇక్కడ యుద్ధం చేశారుగదా అని అనుకొని అలా చేస్తే, అల్లాహ్ తన ప్రవక్తకు ఆ అనుమతి ఇచ్చాడన్నది, మీకు ఆ అనుమతి లేదు అన్న విషయం వారికి తెలియజెప్పండి. నా కోసం కూడా ఆ అనుమతి కేవలం ఒక రోజులోని ఓ గంట కోసమే ధర్మసమ్మతం చేయబడింది. ఇక ఈ రోజు నుండి దాని పవిత్రత నిన్నటి వరకు ఎలాగుండిందో అలానే తిరిగి వచ్చేసింది. ఇప్పుడు ప్రస్తుతం ఇక్కడున్న ప్రతివాడూ ఇక్కడ హాజరుగా లేని ప్రతివానికి ఈ మాటను అందించవలసి ఉంటుంది."

మరో ఉల్లేఖనంలో మరికొంత అదనంగా ఈ విషయం కూడా చెప్పడం జరిగింది. అదేమిటంటే:

"ఇక్కడి ముల్లునైనా విరువకూడదు. వేటాడకూడదు. క్రిందపడి ఉన్న

https://teluguislam.net



ఏ వస్తువును ఎత్తకూడదు. అయితే ఆ వస్తువు తనది అని తెలియజేసి మరీ ఎత్తవలసి ఉంటుంది. ఇక్కడి గడ్డిని కూడా కోయకూడదు." ఇది విన్న హజ్రత్ అబ్బాస్ (ర), "దైవప్రవక్తా! 'ఇజ్‌గర్' గడ్డి విషయంలో మీ అభిప్రాయం ఏమిటి? (ఇజ్‌గర్ అరబ్బుకు చెందిన ఓ రకమైన గడ్డి. దీన్ని టీగా, మందుగా ఉపయోగిస్తారు) ఇది కమ్మరులకు, ఇతర గృహావసరాలకు పనికి వస్తుంది కదా?" అని అడగగా, "అవును, ఆ ఇజ్‌గర్‌ను తప్ప" (ఇతర అన్ని రకాల గడ్డిని కోయకూడదు) అని అన్నారు.

బనూ ఖుజాఅ ఆ రోజు బనూ లైస్‌కు చెందిన ఓ వ్యక్తిని చంపేశారు. ఎందుకంటే అజ్ఞాన కాలంలో బనూ లైస్ చేతిలో వారికి చెందిన ఓ వ్యక్తి చంపబడ్డాడు గనుక. ఈ విషయంలో మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు.

"ఖుజాఅ ప్రజలారా! హత్యలు చేయడం మానుకోండి. ఎందుకంటే ఆ హత్యలే ప్రయోజనాన్ని కలిగిస్తే, ఇప్పటివరకు ఎన్నో హత్యలు జరిగి ఉండేవి. మీరు చంపిన ఆ వ్యక్తికి రక్తపరిహారాన్ని నేను చెల్లిస్తాను. ఇక నుండి మీరు నా ఈ ప్రదేశంలో మరెవ్వరినైనా హతమారిస్తే, హతుని సంరక్షకులకు నేను రెండు విషయాల అధికారాన్ని ఇస్తున్నాను. వారనుకుంటే దానికి బదులు మరొకరిని హత్య చేయవచ్చు. లేదా వారు కోరితే ఆ హతునికి బదులు దీత్ (రక్తపరిహారం) పొందవచ్చు.

ఓ ఉల్లేఖనంలో, దైవప్రవక్త (స) అలా చెప్పగా యమన్‌కు చెందిన ఓ వ్యక్తి లేచి (అతని పేరు అబూ షాహ్) "దైవప్రవక్తా! ఈ హత్య రక్తపరిహారాన్ని నా పేర రాయండి" అనగా, మహాప్రవక్త (స) "దీన్ని అతని పేరున్నే రాయండి" అని అన్నారు.[10]

## ఆందోళనకు గురియైన అన్సారులు

మక్కా విజయం పరిపూర్ణమైపోయింది. ఇది మహాప్రవక్త (స) గారి స్వంత నగరం, ఆయన పుట్టిన చోటు అని గ్రహించిన అన్సారులు పరస్పరం గుసగుసలాడుకోసాగారు. మహాప్రవక్త (స) తమ స్వస్థలాన్ని జయించారు

---

*10. ఈ ఉల్లేఖనాల గురించి చూడండి, సహీ బుఖారి-1/22, 216, 247, 328, 329, 2/615, 617; సహీ ముస్లిమ్ - 1/437, 438, 439; ఇబ్నె హిష్షామ్-2/415, 416; సునన్ అబూ దావూద్-1/276*

https://teluguislam.net



గనుక ఆయన ఇక్కడనే ఉండిపోతారేమో అనేదే వారి అనుమానం. వీరు ఈ ఆందోళన చెందుతూ ఉండగా దైవప్రవక్త (స) సఫా కొండపై నిలబడి దుఆ చేస్తున్నారు. దుఆ పూర్తి అయిన తరువాత ఆయన అన్సారులనుద్దేశించి, "ఇప్పటిదాక మీరు అనుకునేదేమిటి?" అని అడిగారు. "అబ్బే, మేమేం అనుకోలేదే?" అని జవాబు చెప్పగా, 'కాదు, మీరు ఏమని అనుకున్నారో చెప్పవలసిందే" అని పట్టుపట్టారు దైవప్రవక్త (స). చివరికి విషయం ఏమిటో చెప్పేశారు వారు. ఈ మాటలు విన్న మహాప్రవక్త (స), "అంత తీవ్రంగా ఆలోచించారా మీరు? ఇక నుండి నా జీవితం, నా మరణం మీతోనే" అని వారికి భరోసా ఇచ్చారు.

## బైత్ (ప్రమాణం)

అల్లాహ్ దైవప్రవక్తకు, ఆయన తోటి ముస్లిములకు మక్కా విజయాన్ని ప్రసాదించిన తరువాత అసలు సత్యం ఏమిటో మక్కా ప్రజలకు తెలిసిపోయింది. ఇస్లామ్ తప్ప మరెందులోనూ మనం నెగ్గుకురాలేం అని అనుకున్నారు. కాబట్టి వారు దైవప్రవక్త (స) చేతి మీదుగా ప్రమాణం చేసి (బైత్ చేసి) ఇస్లామ్ ధర్మంలోనికి రావడం ప్రారంభించారు. హజ్రత్ ఉమర్ (ర) మహాప్రవక్త (స) ఎత్తయిన ప్రదేశంలో కూర్చుని ఉండగా ప్రజల నుండి ప్రమాణం చేయించుకుంటున్నారు. ప్రజలు ఆ బైత్‌లో సాధ్యమైనంత మట్టుకు ప్రవక్త (స) గారిని విధేయిస్తూ ఆయన ఆదేశాలను పాటిస్తాము అని ప్రమాణం చేస్తున్నారు.

తఫ్సీర్ మదారిక్ అనే గ్రంథంలో ఈ సందర్భం గురించే ఓ ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం:

"మహాప్రవక్త (స) పురుషులందరి చేత ప్రమాణం చేయించుకున్న తరువాత సఫా కొండపై స్త్రీల చేత కూడా ప్రమాణం చేయించుకో నారంభించారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్ (ర) క్రింద కూర్చుని ఉన్నారు. దైవప్రవక్త (స) ఆదేశం మేరకు ఆయన స్త్రీల చేత ప్రమాణం చేయించుకుంటున్నారు. వారికి మహాప్రవక్త (స)గారి ఆదేశాలను విడమర్చి చెబుతున్నారు. ఈ సందర్భంలోనే అబూ సుఫ్యాన్ భార్య హింద్ బిన్తె ఉత్బా

https://teluguislam.net



మారువేషంలో అక్కడికి వచ్చింది. దానికి కారణం, హజ్రత్ హమ్జా (ర)గారి శవం ఎడల ఆమె ప్రవర్తించిన తీరుకు భయపడిపోవడం, మహాప్రవక్త (స) ఆమెను గుర్తుపట్టకుండా ఉండడానికే. ఇటు మహాప్రవక్త (స) (బైత్ ప్రారంభిస్తూ) ఇలా అన్నారు:

"నేను మిచేత అల్లాహ్‌కు ఎవరినీ సాటి కల్పించబోమనే మాటపై ప్రమాణం చేయిస్తున్నాను" అనగా హజ్రత్ ఉమర్ ఆ వచానాలనే తిరిగి మహిళలకు వల్లించి చెబుతున్నారు. ఆ తరువాత "దైవప్రవక్త (స) దొంగతనం చేయము" అని పలుకగా హిందా, "అబూ సుఫ్‌యాన్ చాలా పిసినిగొట్టు- ఒకవేళ నేను అతని సొత్తులో నుండి ఏదైనా తీసుకుంటే?(అది దొంగతనం అవుతుందా?)" అని అడిగింది. అబూ సుఫ్‌యాన్ కూడా అక్కడనే కూర్చుని ఉన్నారు.

"సరే నీవు ఆ సొత్తులో ఏది తీసుకున్నా అది నీకు ధర్మసమ్మతమైనదే అవుతుంది" అన్నారు అబూ సుఫ్‌యాన్.

ఇది విన్న మహాప్రవక్త (స) చిరునవ్వు నవ్వారు. ఆయన హింద్‌ను గుర్తు పట్టేశారు.

"ఓహో నీవు హింద్‌వా?" అనగా; "అవును, దైవప్రవక్తా! నేను హిందానే. ప్రవక్తా! జరిగిపోయిందేదో జరిగిపోయింది. దాన్ని తమరు క్షమించివేయండి, అల్లాహ్ తమరిని క్షమించుగాక" అన్నదామె.

ఆ తరువాత మహాప్రవక్త (స) మహిళలనుద్దేశించి, "వ్యభిచారము చేయము" అనగా హిందా; "ఏమిటి 'హుర్రా' (స్వతంత్రురాలైన స్త్రీ) ఎక్కడైనా వ్యభిచారానికి పాల్పడుతుందా?" అని అడిగింది.

"మా సంతానాన్ని హతమార్చము."

"మేము బాల్యంలో వారిని పెంచి పోషించినవాళ్ళం. కాని పెద్దయిన తరువాత మీరే వారిని హతమార్చారు. కాబట్టి ఈ విషయం మీకూ వారికే బాగా తెలుసు" అన్నది హిందా.

(హిందా కుమారుడు హంజలా బిన్ అబీ సుఫ్‌యాన్ బద్ర్ యుద్ధంలో

https://teluguislam.net



చంపబడిన విషయం మనకు గుర్తు ఉండే ఉంటుంది.) ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర) నవ్వును ఆపుకోలేక క్రిందపడిపోయారు. దైవప్రవక్త (స) కూడా చిరునవ్వు నవ్వేశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఎవరి మీదా అపనింద వేయము."

"దైవసాక్షి! అపనింద చాలా చెడ్డది. తమరు మాకు సన్మార్గాన్ని, నైతికతలను నేర్పుతున్నారు."

"ప్రసిద్ధమైన ప్రతి విషయంలోనూ దైవప్రవక్తకు అవిధేయత చూపము" అని పలికారు మహాప్రవక్త (స).

"దైవసాక్షిగా! మేము ఈ సభలో తమకు అవిధేయతను చూపుతామనే భావాన్నయినా మనస్సులో పెట్టుకుని రాలేదు" అంది హిందా.

హిందా వెనక్కు వెళ్ళిపోయి తన ఆరాధ్య దైవవిగ్రహాన్ని తునాతునకలు చేస్తూ, "మేము ఇప్పటివరకు నీ గురించి మోసంలో పడివున్నాం" అని పలుకసాగింది.[11]

## మక్కాలో మకామేసి దైవప్రవక్త (స) చేసిన పని

మక్కాలో మహాప్రవక్త (స) మొత్తం పందొమ్మిది రోజులు ఉన్నారు. ఈ కాలంలో ఆయన ఇస్లామ్ గుర్తుల్ని పునరుద్ధరించడం, ప్రజలను సన్మార్గం వైపునకు పిలువడం, వారిలో దైవభీతిని కలుగజేయడం చేశారు. ఆ రోజుల్లోనే దైవప్రవక్త (స) ఆదేశమివ్వగా హజ్రత్ అబూ అసీద్ ఖుజాయి (ర), క్రొత్తగా 'హరం' సరిహద్దులుగా స్తంభాలు పాతారు. మహాప్రవక్త (స) ఇస్లామ్ ధర్మప్రచారం కోసం, మక్కా మరియు చుట్టుపట్ల ప్రతిష్ఠించబడి ఉన్న విగ్రహాలను రూపుమాపేందుకుగాను సరాయాలు పంపించడం జరిగింది. అలా అక్కడి విగ్రహాలన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. మహాప్రవక్త(స) మక్కావాసుల్లో, "ఎవరైతే అల్లాహ్ మరియు ప్రళయ దినాన్ని విశ్వసిస్తున్నాడో అతను తన ఇంట ఎలాంటి విగ్రహాన్ని ఉంచకూడదు. సరికదా, వెంటనే దాన్ని రూపుమాపేయాలి" అని చాటింపు వేయించారు.

---

11. చూడండి, మదారకుతన్జీల్

https://teluguislam.net



## సరాయా మరియు ప్రతినిధి బృందాలు

1. మక్కా విజయం పూర్తియైన తరువాత మహాప్రవక్త (స), రమజాన్ నెల 25వ తేదీ (హి.శ. 8) నాడు హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర)గారి సారథ్యంలో 'ఉజ్జా దేవుని' ప్రతిమను నాశనం చేసేందుకు ఓ సరియ్యాను పంపించారు. 'ఉజ్జా' నఖ్లా అనే ప్రదేశంలో ప్రతిష్టించబడి ఉన్న విగ్రహం. ఖురైష్ మరియు బనూ కనానా తెగవారంతా దాన్ని పూజిస్తూ ఉండేవారు. ఇది వారికి చెందిన అన్నిటికంటే పెద్ద దేవతా విగ్రహం. బనూ షైబాన్ దానికి పూజారులుగా ఉంటూ వస్తున్నారు. హజ్రత్ ఖాలిద్ (ర) ముప్ఫయి మంది ఆశ్వారూఢులతో 'నఖ్లా' వెళ్ళి ఆ 'ఉజ్జా' ప్రతిమను పడగొట్టారు. హజ్రత్ ఖాలిద్ (ర) తన పనిని పూర్తి చేసుకొని దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చారు.

"అక్కడ నీవేదైనా విశేషం చూశావా?" అని అడిగారు ప్రవక్తశ్రీ(స).

"లేదు" అని బదులిచ్చారు ఖాలిద్(ర).

"అయితే నీవు ఆ విగ్రహాన్ని పడగొట్టనే లేదన్నమాట. వెళ్ళి దాన్ని పడగొట్టిరా" అని చెప్పారు మహాప్రవక్త (స).

హజ్రత్ ఖాలిద్(ర) మళ్ళీ తన నగ్న కరవాలంతో అక్కడికి వెళ్ళగా, అక్కడ ఆయన వైపునకు తల విరబూసుకుని ఉన్న నల్లటి ఆకారం గల ఓ దిగంబర స్త్రీ రావడం కనబడింది. పూజారి ఆమెను పెద్దగా అరుస్తూ పిలుస్తున్నాడు. ఇంతలోనే హజ్రత్ ఖాలిద్ (ర) ఆమెపై వేసిన కత్తి వ్రేటుకు ఆమె రెండు ముక్కలుగా అయి క్రిందపడిపోయింది. ఆ తరువాత ఆయన మహాప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఆ వృత్తాంతమంతా చెప్పారు. అప్పుడాయన, "ఆమే ఉజ్జా. ఆమె పని అయిపోయింది. మీ దేశంలో ఆమెను ఇక పూజించేవారే ఉండరు" అన్నారు.

2. మహాప్రవక్త (స) అమ్రూ బిన్ ఆస్ (ర)ను, ఆ నెలలోనే, 'సువా' పేరుగల దేవతా విగ్రహాన్ని నిర్మూలించి రమ్మని పంపించారు. ఇది మక్కాకు మూడు మైళ్ళ దూరంలోని 'రిబాత్' అనే ప్రదేశంలో 'బనూ హుజైల్' తెగకు చెందిన దేవతా విగ్రహం. హజ్రత్ అమ్రూ (ర) అక్కడకు చేరగా అక్కడి పూజారి ఆయనతో, నీకేం కావాలి? అని అడిగాడు.

https://teluguislam.net



"దైవప్రవక్త (స), నాకు ఈ దేవతా విగ్రహాన్ని పడగొట్టి రమ్మని పంపించారు" అన్నారు అమ్రూ (ర).

"అది నీకు చేతనయ్యే పని కాదు."

"ఎందుకు?" అని అడిగారు అమ్రూ(ర).

"నీవు అలా చేయకుండా అడ్డుకోబడతావు చూడు" అన్నాడు పూజారి.

"ఓహో! నీవింకా అంధకారంలోనే ఉన్నావన్నమాట. ఇది చూడడంగాని, వినడంగాని చేస్తుందా?" అంటూ దాని దగ్గరకు వెళ్ళి దాన్ని ముక్కలుగా చేసివేశారాయన. తనతో వచ్చిన వారిని, వెళ్ళి ఈ విగ్రహానికి సంబంధించిన ధనాగారాన్ని పడగొట్టండి అని ఆదేశించారు. అక్కడ ఆయనకు ఏమీ లభించలేదు. పూజారిని చూసి "ఇప్పుడెలా ఉందో చెప్పు" అనగా అతను, "నేను అల్లాహ్‌ను విశ్వసిస్తున్నానని" ముస్లిమ్ అయిపోయాడు.

3. ఆ నెలలోనే హజ్రత్ సఅద్ బిన్ జైద్ అష్హలీ (ర)కు ఇరవై మంది అశ్వికులనిచ్చి మనాత్ వైపునకు పంపించారు మహాప్రవక్త (స). 'మనాత్', ఖుదియా దాపులో 'ముస్‌లులల్' అనే చోట అవస్, ఖజ్రజ్ మరియు గస్సాన్ తెగలకు సంబంధించిన దేవతా విగ్రహం ఉంది. హజ్రత్ సఅద్ (ర) అక్కడికి చేరగానే దాని పూజారి ఎందుకు వచ్చావు అని అడిగాడు.

"నేను నీ మనాత్ దేవతా విగ్రహాన్ని పడగొట్టి ధ్వంసం చేయడానికి వచ్చాను" అనగా, అతను అది నీ ఇష్టం అని అడ్డం తొలిగాడు. హజ్రత్ సఅద్ మనాత్ వైపునకు అడుగు ముందుకు వేయగానే ఓ నలుపు రంగు గల దిగంబర స్త్రీ జుట్టును విరబూసుకొని ఆయన వైపునకు రానారంభించింది. ఆమె తన ఎదురు రొమ్మును బాదుకుంటోంది. అంతలోనే ఆ విగ్రహ పూజారి ఆమెతో ఓ దేవతా! నీ ధిక్కారులను సంహరించు అని మొరపెట్టుకుంటున్నాడు. కాని ఇంతలోనే హజ్రత్ సఅద్ ఆమెపై వేసిన కత్తి వ్రేటుకు ఆమె ప్రాణాలు వదిలేసింది. వెంటనే వెళ్ళి ఆయన ఆ విగ్రహాన్ని ముక్కలు ముక్కలుగా చేసేశారు. ధనాగారంలో ఆయనకు ఏమీ లభించలేదు.

4. ఉజ్జా దేవతా విగ్రహాన్ని ధ్వంసం చేసి వచ్చిన హజ్రత్ ఖాలిద్ (ర)కు మహాప్రవక్త (స), షవ్వాల్ నెల (హి.శ. 8)లో 'బనూ జజీమా' వద్దకు

https://teluguislam.net



పంపించారు. ఇస్లామ్ ధర్మప్రచారం చేయడమే ఉద్దేశ్యంగా ఆయన్ను అక్కడకు పంపించడం జరిగింది. హజ్రత్ ఖాలిద్ (ర) తన వెంట ముహాజిర్లు, అన్సారులు మరియు బనూ సులైమ్ తెగకు చెందిన మొత్తం మూడొందల యాభై మందిని తీసుకొని అక్కడికి వెళ్ళారు. బనూ జజీమా వద్దకు వెళ్ళి ఆయన వారికి ఇస్లామ్ వైపునకు ఆహ్వానించారు. వారు 'అస్లమ్నా' (మేము ఇస్లామ్ స్వీకరించాము) అనే బదులు 'సబానా, సబానా' (మేము మా ధర్మాన్ని వీడాము) అననారంభించారు. ఈ మాటలు విన్న ఖాలిద్ వారిపై విరుచుకుపడి చాలా మందిని సంహరించి తక్కిన వారిని బంధించనారంభించారు. అలా తనతో వచ్చిన వారందరికీ ఒక్కో ఖైదీని అప్పజెప్పారు. ఓ రోజు ఖాలిద్ తనతో వచ్చిన వారందరికీ తన ఖైదీలను సంహరించండి అని ఆదేశం జారీచేశారు. కాని హజ్రత్ ఇబ్నె ఉమర్ (ర) మరియు ఆయన సహచరులు ఆయన ఆదేశాన్ని పాటించడానికి నిరాకరించారు. మహాప్రవక్త (స) వద్దకు వచ్చి ఈ వృత్తాంతాన్ని ఆయనకు చెప్పగా మహాప్రవక్త (స), తన రెండు చేతుల్ని పైకెత్తి రెండుమార్లు, "ఓ అల్లాహ్! ఖాలిద్ ఏదైతే చేశాడో దానికి నేను బాధ్యుణ్ణి కాను" అన్నారు. [12]

ఈ సందర్భంగా బనూ సులైమ్ తెగ వారు తమ ఖైదీలను హత మార్చారు. అన్సారులు, ముహాజిర్లు దాని జోలికిపోకుండా ఉన్నారు. మహాప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను అక్కడికి పంపించి వారి హతుల 'దీత్'ని (రక్తపరిహారాన్ని), వారికి జరిగిన నష్టానికి నష్టపరిహారాన్ని చెల్లించారు. ఈ వ్యవహారంలో హజ్రత్ ఖాలిద్ (ర)కు మరియు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)కు నడుమ వాగ్వివాదం కూడా జరిగింది. ఈ వార్త మహాప్రవక్త (స)కు అందగా ఆయన ఖాలిద్నుద్దేశించి, "ఖాలిద్ ఇక చాలించు! నా ఈ సహచరులను ఇంకేమీ అనకు. దైవసాక్షిగా చెబుతున్నాను, ఉహద్ కొండ పూర్తిగా బంగారమైపోయి, దాన్నంతటిని నీవు దైవమార్గంలో ఖర్చు చేసేసినా, నా ఈ సహచరుల్లోని ఏ ఒక్క వ్యక్తి చేసిన ఉదయం పూట ఆరాధన లేదా సాయంత్రం చేసిన ఒక్క ఆరాధనకు కూడా నీవు చేరలేవు" అన్నారు. [13]

---

*12. సహీహ్ బుఖారి-1/450, 2/622.*

*13. ఈ గజ్వాకు సంబంధించిన ఆధారాలు ఈ గ్రంథాల నుండి పొందవచ్చు. ఇబ్నె హిషామ్ 2/389 - 437; సహీ బుఖారి - కితాబుల్ జిహాద్, కితాబుల్*

https://teluguislam.net



ఇవీ గజ్వాయె ఫతహె మక్కా (మక్కా విజయం గజ్వా) వివరాలు- ఈ నిర్ణయాత్మకమైన ఘన విజయం విగ్రహారాధనకు సంబంధించిన శక్తినంతటిని విరిచివేసింది. ఇంకా అరేబియా ద్వీపంలో మనజాలనంతగా దాని నడ్డి విరిచేసిన గజ్వా ఇది. ఎందుకంటే అప్పటివరకు సాధారణ తెగలన్నీ, ముస్లిములు మరియు విగ్రహారాధకుల నడుమ ఏ పోరాటం అయితే కొనసాగుతోందో దాని పరిణామం ఎలా ఉంటుందో అని వేచిచూస్తున్న తరుణం అది. సత్యం ఎవరి పక్షాన్నయితే ఉంటుందో వారే దైవగృహాన్ని కైవసం చేసుకుంటారని ఈ తెగలకు బాగా తెలిసిన విషయం.

ఈ విషయంలో అప్పటికి యాభై ఏళ్ళ క్రితం ఏనుగు బలం ద్వారా కాబా గృహాన్ని పడగొట్టడానికి ప్రయత్నించిన అబ్రహా గతి ఏమైందో వారికి బాగా తెలుసు. అల్లాహ్ గృహం వైపునకు అబ్రహా తన సైన్యంతో దురుద్దేశ్యంతో వచ్చినందుకు అల్లాహ్ వారిని హతమార్చి ఊకలా మార్చేసిన విషయం అరేబియా ప్రజలకు ఇంకా గుర్తే ఉంది.

సులే హుదైబియా (హుదైబియా ఒప్పందం) ఈ ఘన విజయానికి నాంది పలికిందన్న విషయం కూడా గుర్తుంచుకోవలసి ఉంది. దీని కారణంగా ఎల్లెడల శాంతి వాతావరణం నెలకొంది. ప్రజలు స్వతంత్రంగా ఒకరితో ఒకరు మాట్లాడుకునే స్వేచ్ఛ కూడా వచ్చేసింది. ఇస్లామ్ ధర్మం విషయంలో చర్చలూ జరిగేవి. ఎవరైతే రహస్యంగా ముస్లిములు అయి మక్కా నుంచి వలస పోయారో వారికి కూడా ఈ ఒప్పందం తరువాత తమ ధర్మం గురించి ప్రకటించే, దాన్ని ప్రచారం చేసే అవకాశం లభించింది. ఈ పరిస్థితుల మూలంగా చాలా మంది ఇస్లామ్ ధర్మం ఛత్ర ఛాయల్లోకి వచ్చారు. చివరికి, ఒకప్పుడు మూడు వేలకంటే పెరగని ఇస్లామీయ సంఖ్య సేన ఈ మక్కా విజయం సందర్భంగా పది వేల వరకు చేరిపోయింది.

ఈ నిర్ణయాత్మకమైన గజ్వా (మక్కా విజయం) ప్రజల కళ్ళను తెరిచింది. ఇస్లామ్ ధర్మస్వీకారం విషయంలో అడ్డుగోడగా నిలిచివున్న ఆ అడ్డంకి కూడా తొలగిపోయింది. ఈ విజయం తరువాత అరేబియా ద్వీప రాజకీయ, ధార్మిక

---

*మునాసిక్-2/612 - 615, 622; ఫత్‌హుల్ బారి, 8/3 - 27; సహీముస్లిమ్-1/437, 438, 439; 2/102, 103*, 130; జాదుల్ ముఆద్ - 2/160 - 168; ముక్తరుస్సీరత్ - షేక్ అబ్దుల్లాహ్, పుట. 322 - 351

https://teluguislam.net



దిగ్మండలంపై ఇస్లాం సూర్యుడు వెలగనారంభించాడు. ఇప్పుడు ధార్మిక పెత్తనం, ప్రాపంచిక అధికార పగ్గాలు మొత్తం ముస్లిముల చేతుల్లోకి వచ్చేశాయి.

అంటే, హుదైబియా ఒప్పందం తరువాత ముస్లిములకు అనుకూలంగా ఏ మార్పు అయితే ప్రారంభం అయిందో, ఈ విజయం తరువాత అది సంపూర్ణతను సంతరించుకుందన్న మాట. ఆ తరువాత మరో శకం ఆరంభమైంది. ఆ శకం పూర్తిగా ముస్లిములకే అనుకూలమైన శకం. ఇందు పరిస్థితి పూర్తిగా ముస్లిముల నియంత్రణలోనికి వచ్చేసింది. ఇక అరబ్బుల ముందు ఉన్నది ఒకే ఒక మార్గం, అది, వారు తండోపతండాలుగా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం, ఆయన పిలుపును తీసుకొని ప్రపంచంలో విస్తరించడం. వచ్చే రెండేళ్ళలో చేపట్టిన కార్యక్రమం కూడా అదే.

https://teluguislam.net



